ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
విజయవాడ
epaper.vaartha.com WWW.VAARTHA.COM
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
11-1-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 341 పేజీలు: 10+4 వెల: 8.00

**గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం తథ్యం: ట్రంప్**
**సిబిఐ వలలో సిపిఆర్‌ఐ జాయింట్ డైరెక్టర్**
5లో

## తీవ్ర వాయుగుండం
### నేటి మధ్యాహ్నానికి శ్రీలంక తీరం దాటే అవకాశం
### తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు వర్ష సూచన



**విజయవాడ,జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతోంది. శుక్రవారం ఇది తుపానుగా బలపడుతుందని భారత వాతావరణ విభాగం తొలుత అంచనా వేసినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో బలపడలేదని వాతావరణ నిపుణులు చెప్పారు. తీవ్ర వాయుగుండం ప్రస్తుతం వాయవ్య దిశగా కదులుతూ శ్రీలంకలో ట్రింకోమలి, జాఫ్నా మధ్యలో శనివారం మధ్యాహ్నానికి తీరం దాటుతుందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురిసే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో తేలికపాటి వర్షం కురవొచ్చని చెప్పింది. శని, ఆదివారాల్లో తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ వెల్లడించింది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం కొనసాగుతుంది. శ్రీలంకలోని ట్రింకోమలీకి తూర్పు ఆగ్నేయంగా 150 కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు. ఇది శ్రీలంకలోని పోట్స్‌విల్‌కు ఉత్తర ఈశాన్యంగా 180 కి.మీ. దూరంలో , చెన్నైకి దక్షి ణ ఆగ్నేయంగా 590 కి.మీ. దూరంలో ఉన్నట్లు వాతావరణ నిపుణులు వివరిస్తున్నారు. గడిచిన ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండం గంటకు 6 కి.మీ. వేగంతో కదిలింది. 24 గంటల్లో వాయవ్య దిశగా కదిలి మధ్యాహ్నం తీరం దాటే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. శ్రీలంకలోని ట్రింకోమలీజాఫ్నా మధ్య ఈ మధ్యాహ్నం తీరం దాటే అవకాశం ఉంది. శని, ఆది వారాల్లో రెండ్రోజులు ఏపీ దక్షి ణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ నిపుణులు వివరిస్తున్నారు.

# నగరాలు నదీతీరాల్లోనే



### నాగరికత తెలిస్తే జగన్ నదుల గురించి దుష్ప్రచారం చేయరు
### ఢిల్లీ, లండన్ సహా అనేక నగరాలు నదుల ఒడ్డునే
### నదీ గర్భం, పరీవాహక ప్రాంతానికి తేడా తెలీదా?
### ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మడమా?
### జలవివాదాలపై తెలుగురాష్ట్రాల మధ్య గొడవలు వద్దు: సీఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** నాగరికత తెలిస్తే నదుల గురించి జగన్ దుష్ప్రచారం చేయరని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. రాష్ట్రంలో వచ్చే రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళిక సిద్ధం చేసామన్నారు. నీటి సద్వినియోగం వల్లే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందన్నారు.దేశ ఉద్యాన రంగంలో మన రాష్ట్రానిదే మొదటి స్థానం అన్న విషయం గ్రహించాలన్నారు. శనివారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో సీఎం చంద్రబాబు ఇష్టాగోష్టి.(చిట్‌చాట్) సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరికత తెలిస్తే నదుల గురించి జగన్ దుష్ప్రచారం చేయరు అన్నారు, సింధూ నాగరికత గురించి జగన్ తెలుసుకుంటే మంచిది ఢిల్లీ సహా అనేక ప్రధాన నగరాలు నదీతీరాల పక్కనే ఉన్నాయి లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీతీరాల్లోనే ఉన్నాయి నదీగర్భం, నదీపరివాహక ప్రాంతానికి తేడా జగన్‌కు తెలియదు ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మటం మానట్లేదు రాష్ట్రంలో వచ్చే రెండేళ్లలో నీటికొరత లేకుండా ప్రణాళిక నీటి సద్వినియోగం వల్లే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందింది దేశ ఉద్యానరంగంలో మన రాష్ట్రానిదే మొదటి స్థానం అనే విషయం గమనించాలన్నారు, నీటి విషయంలో గొడవలకు దిగితే నష్టపోయేది తెలుగు ప్రజలే తెలుగు రాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుంది? మిగులు జలాల సద్వినియోగంతో రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయి రాయలసీమకు నీరిచ్చాం అనేందుకు పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ పట్టిసీమ ద్వారా రాయలసీమ పట్ల మాకున్న చిత్తశుద్ధి చాటుకున్నాం పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యాన పంటలు పెరిగాయి 2020లో నిలిపిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టిపనులుచేసి రూ.900 కోట్లు బిల్లులు చేసుకున్నారు. రాష్ట్ర ప్రయోజనాలే మాకు ముఖ్యం. నీటి విషయంలో రాజీలేదని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతిలో నిర్మాణాలను హైదరాబాద్ సచివాలయంతో పోల్చి విమర్శించడం సరికాదని, అటువంటి వాదనలను మానుకోవాల్సిందిగా మంత్రి నారాయణ వైఎస్సార్సీపీ నేతలకు సూచించారు. హైదరాబాద్ సచివాలయం మంత్రులు, కార్యదర్శులకే పరిమితమని నారాయణ స్పష్టం చేశారు. అదే అమరావతిలో అయితే శాఖాధిపతులు, వారి సిబ్బంది ఒకేచోట ఉంటారని నారాయణ గుర్తుచేశారు. ఎంతో దూరదృష్టితో అమరావతిని నిర్మిస్తున్నారని సీఎం చంద్రబాబు మంత్రి నారాయణ ఈ సందర్భంగా కొనియాడారు.

నదీ జలాల విషయంలో తెలుగు రాష్ట్రాలు గొడవలు పెట్టుకుంటే ప్రయోజనం ఏమీ ఉండదని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మన వద్ద నీళ్లు మిగిలితే తెలంగాణ కూడా వాడుకోవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. అయితే గత కొద్ది రోజులుగా చంద్రబాబు తెలుగురాష్ట్రాల జలవివాదాలపై తెలుగు రాష్ట్రాల మధ్య గొడవలు వద్దు అని కోరుతూనే ఉన్నారు.

**ప్రపంచంలోనే నెంబర్ 1గా రాష్ట్రం:** రాష్ట్రంలో రానున్న 2 ఏళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. నీటిని సద్వినియోగం చేసుకోవడం వలనే >>2



అమరావతి ఆవకాయ్ వేడుకల ముగింపు ఉత్సవంలో ప్రసంగిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

# త్వరలోనే 'నంది' అవార్డుల ప్రదానం
### నాటకోత్సవాలు కూడా నిర్వహిస్తాం
### అట్టహాసంగా ముగిసిన 'అమరావతి ఆవకాయ్' ఉత్సవాలు
### వచ్చే డిసెంబరు 17,18,19 తేదీల్లో తిరిగి ఉత్సవాలు: మంత్రి దుర్గేష్

**విజయవాడ, జనవరి 10 ప్రభాతవార్త:** తెలుగువారి సంస్కృతికి, రుచులకు మరియు కళలకు ప్రతిబింబంగా నిలిచిన అమరావతి ఆవకాయ్ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా ముగిశాయి. విజయవాడలోని పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్ వేదికలుగా మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలకు ప్రజల నుండి అపూర్వ స్పందన లభించింది. ముగింపు >>2

# కీలక దశకు దర్యాప్తు
### కల్తీ నెయ్యి కేసు: నెలాఖరుకు మలివిడత ఛార్జిషీటు



**తిరుపతి,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్న లడ్డూల తయారీ కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసు దర్యాప్తు సిబిఐ సిట్ అధికారులు కీలక వివరాలు సేకరించారు. ఈ కేసు పురోగతి కూడా కీలకదశకు చేరడంతో నెలాఖరుకు మలివిడత ఛార్జిషీట్ సుప్రీంకోర్టులు దాఖలు చేయడానికి, మరింత సమగ్ర వివరాలతో సీల్డుకవర్‌లో సమర్పించేందుకు సిట్ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం రెండురోజులుగా తిరుపతి అలిపిరిలోని సిట్ తాత్కాలిక కార్యాలయంలో సిట్ ఐసి మురళీరాంభా నేతృత్వంలోని డిఐజి, ఎస్పీలు సమావేశమై కేసు దర్యాప్తు విషయాలు సమీక్షిస్తున్నారు. ఇప్పటివరకు రాబట్టిన సమాచారం. అరెస్ట్ అయ్యి నెల్లూరు ఏసిబి కోర్టులో ఉన్న నిందితుల వివరాలు, వారినుండి రాబట్టిన వివరాలు రికార్డులను పున:పరిశీలించుకుంటున్నారు.కల్తీ నెయ్యి కేసులో గత ఆరేడునెలలుగా సిబిఐ సిట్ అధికారులు అన్ని కోణాల్లో పూర్తిస్థాయిలో వేగవంతమైన దర్యాప్తుచేపట్టి పలువురిని అరెస్ట్ చేసి నివేదికలు సిద్ధం చేసింది. కీలకమైన జిఎంల స్థాయి అధికారులను రిమాండ్‌కు తరలించింది. రాబోయే రోజుల్లో ఈ నివేదికలను సిబిఐ చీఫ్‌కు,సుప్రీం కోర్టుకు అందజేసి తదుపరి టిటిడిలో కీలక అధికారుల విచారణ కు ముందుకు కదిలే సూచనలు కనిపిస్తున్నాయి. లడ్డూల తయారీలో వినియోగిస్తున్న ఆవునెయ్యిలో పలు నూనెలు కల్తీచేసి పంపిన కాంట్రాక్టర్లు, ఇక్కడ పరీక్షించి వెనక్కుపంపాల్సిన టిటిడి అధికారులు, ల్యాబ్, మార్కెటింగ్, విజిలెన్స్ ఉద్యోగులు పాత్రపై నివేదికలు సిద్ధం చేశారు.

సమగ్ర వివరాలు సేకరించిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి సూత్రధారులు,ఇంకా పాత్రధారులు ఎవరని తేల్చేపనిలో ఉన్నారనేది తెలుస్తోంది. తిరుమలకు 2019 నుండి 2024 మేనెల వరకు నెయ్యి సరఫరాచేసేందుకు టెండర్లు పిలవడం, పాల్గొన్న సంస్థలు ,ఎంతవరకు టెండర్లు దక్కించుకుని ఎంతకాలం సరఫరా చేశారు అనే వివరాలు రికార్డు చేశారు. కీలకంగా కల్తీ నెయ్యి సరఫరా వెనుక ఎవరి ప్రమేయం ఉంది.ఎందుకు అంతకాలం మౌనంగా కల్తీనెయ్యినే లడ్డూలకు వినియోగించారనేది ఇప్పుడు సిట్ కీలక దర్యాప్తులో వెలుగుచూడనుంది. 12మంది టిటిడి అధికారులు ప్రమేయం ఉందని కూడా సిట్ గుర్తించింది.

## హైదరాబాద్-విజయవాడ 10 సంక్రాంతి రైళ్లు

**విజయవాడ,జనవరి10.ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ స్పెషల్ ట్రైన్స్ వేసింది. హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. ఎక్కువ మంది ప్రయాణికులు కూర్చుని ప్రయాణించేలా ఛైర్‌కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. పండుగ ముందు, తర్వాతి రోజుల్లో ప్రత్యేక రైళ్ల రాకపోకలు సాగించనున్నాయి. ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రత్యేక రైళ్లు నడవవున్నాయి. అదే విధంగా ఈ నెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. ఛైర్ కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయాన్ని రైల్వే శాఖ కల్పించింది. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికి పైగా జనరల్ బోగీలు ఏర్పాటు చేసింది. రైల్వేశాఖ చర్యలతో ప్రయాణ పాట్లు తగ్గుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి పండుగ ముందు తర్వాతి రోజుల్లో హైదరాబాద్ నుంచి ఏపీలోని పలు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ రైళ్లలో 3 నెలల ముందే బెర్తులు అన్నీ నిండిపోయాయి.



# అదుపులోకి బ్లోఔట్
### పూర్తిగా ఆరిన మంటలు

**రాజోలు, జనవరి10,ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలోని మోరి5 డ్రిల్లింగ్ సైట్‌లో చోటుచేసుకున్న బ్లో అవుట్‌ను పూర్తి స్థాయిలో ఓఎన్జీసి నియంత్రించింది. రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం మై మంటలు పూర్తిగా ఆరిపోయాయి. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణ బృందం శకలాలను పూర్తిగా తొలగించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చింది. వాటర్ అంబ్రెల్లా ద్వారా బావి పరిసరాలను శీతలీకరిస్తున్నారు. బ్లోఅవుట్‌ని పూర్తిగా నిలుపుదల చేసిన ఓఎన్జీసి అధికారులు సంబరాలు చేసుకున్నారు. ఈనెల5వ తేదీన జరిగిన బ్లో అవుట్‌తో స్థానిక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవ్వగా ఆర్సిఎంటి హెడ్ శ్రీహరి ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్ అదుపు చేసింది. బిఓబిని అమర్చి బ్లో అవుట్ ను ఆరు రోజుల్లోనే నిలుపుదల చేయడంతో జై ఓఎన్జీసి అంటూ సంబరాలు జరుపుకున్నారు. శనివారం ఉదయం పూర్తిగా మంటలు నిలిచిపోయాయి.

క్రైసిస్ మేనేజింగ్ టీమ్ హెడ్ శ్రీహరి టీమ్ 6 రోజుల పాటు శ్రమించి బ్లో అవుట్ మంటలను పూర్తిగా అదుపుచేసి వెల్ కు క్యాపింగ్ వేశారు. దీంతో అగ్ని కీలలు పూర్తిగా నిలిచిపోయి ఆ ప్రాంతం సాధారణ స్థితికి చేరుకుంది. ఓఎన్జీసీ అధికారులు శకలాల తొలగింపు ప్రక్రియలో నిమగ్నమయ్యారు. మోరి 5 బావిలో ఉత్పత్తి నిలిచి పోవడంతో పనులు చేస్తుండగా 5వ తేదీ ఉదయం 11.30 నిమిషాల సమయంలో బావి నుంచి అధిక పీడనంతో పొగ మంచులో ఉన్నచమురు గ్యాస్ లీకై ఆకాశమంతా దట్టంగా కమ్మేసింది. 12.30సమయంలో పీడనశక్తి రాపిడినుండి మంట పుట్టి ఒక్కసారిగా విస్పోటం మొదలై బ్లో అవుట్ సంభవించింది. సుమారు 20 మీటర్ల ఎత్తులో అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. అక్కడ ఉన్న సిబ్బంది అక్కడినుండి పరుగులు తీశారు. మంటల దాటికి సైట్ లో ఉన్న రిగ్, ఇతర సామాగ్రి కరిగి పోయాయి. అప్రమత్తమైన అధికారయంత్రాంగం ఇరుసుమండతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.





శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్

# రేపే పిఎస్ఎల్వి-సి62 ప్రయోగం

## ఉదయం గం.10.19కి ముహూర్తం: ఇస్రో ఛైర్మన్ నారాయణన్

**సూళ్లూరుపేట, జనవరి 10 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి జనవరి 12వ తేదీన ఉదయం 10 గంటల 19 నిమిషాలకు పిఎస్ఎల్వి-సి62 రాకెట్ ప్రయోగానికి సర్వం సిద్ధంగా ఉందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. శనివారం శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దర్శించుకున్న అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఈ ప్రయోగానికి సంబంధించి ఆదివారం 12 గంటల 19 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 22 గంటల పాటు కొనసాగి సోమవారం ఉదయం 10 గంటల 19 నిమిషాలకు శ్రీహరికోటలోని ప్రథమ లాంచ్ ప్యాడ్ నుంచి పిఎస్ఎల్వి-సి62 రాకెట్ నింగిలోకి ఎగురుతుందని చెప్పారు. ఈ ప్రయోగంలో భాగంగా రాకెట్ అనుసంధాన కార్యక్రమాలు పూర్తయినట్లు తెలిపారు. పిఎస్ఎల్వి-సి62 రాకెట్ ద్వారా ఇఓఎస్-ఎన్1 (అన్వేష్) ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు మరో 15 మైక్రో శాటిలైట్లను నింగిలోకి పంపుతామన్నారు. ఇందులో 8 ఇతర దేశాలకు చెందినవి కాగా, 7 మన దేశానికి చెందినవని నారాయణన్ చెప్పారు. ఇఓఎస్-ఎన్1 ఉపగ్రహం పర్యావరణంపై సమగ్ర నివేదిక అందించడం, సైనిక నిఘా అవసరాల కోసం పనిచేయడానికి, వాతావరణ పరిశీలన నిమిత్తం అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్లు తెలిపారు. పిఎస్ఎల్వి సిరీస్‌లో ఇది 64వ ప్రయోగమని అన్నారు. ఇప్పటివరకు భారతదేశం 34 దేశాలకు సంబంధించి 432 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో చేపడుతున్న ప్రప్రథమ ప్రయోగం విజయవంతం కావాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఇస్రో శాస్త్రవేత్తలు వీరముత్తువేలు, ఎస్కె అండర్సన్, ఎంఎస్‌డి గ్రూప్ మేనేజర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సోమ్‌నాథ్ 'ఓంకారం'లో పవరశించిన మోడీ

## ప్రజల అపూర్వ స్వాగతమే వారి ఆశీస్సులు: ప్రధాని

**సోమ్‌నాథ్,(గుజరాత్), జనవరి 10:** రాష్ట్రంలోని సోమ్‌నాథ్‌లో జరిగే స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రధాని మోడీకి సోమ్‌నాథ్‌ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. సోమ్‌నాథ్ ప్రజలు తనను ఎంతోప్రేమతో ఆశీర్వదించారని, మన నాగరికత, ధైర్యసహసాలకు సోమ్‌నాథ్ పెట్టిందిపేరనిమోడీ ఈసందర్భంగా పేర్కొన్నారు. గజిని మహ్మద్ సోమ్‌నాథ్ దేవాలయంపై దాడికిప్రయత్నించి వెయ్యి సంవత్సరాలు పూర్తయిన సందర్భంగాజరిగిన స్వాభిమాన్‌పర్వ్ ఇక్కడిప్రజల సాహసానికి ప్రతీక అని అన్నారు. సోమ్‌నాథ్‌లో జరిగిన ఓంకార్ మంత్ర పఠనంలోకూడా ప్రధానిమోడీ పాల్గొన్నారు. ఆ తర్వాత అక్కడే భారీ ఎత్తున జరిగిన డ్రోన్‌షోను ప్రధాని వీక్షించారు. సోమ్‌నాథ్ చారిత్రక సంఘటనలను వివరిస్తూ జరిగిన డ్రోన్‌షో సందర్శకులను ఎంతో ఆకట్టుకుంది. మొత్తం మూడువేలకుపైగా డ్రోన్లు ఈ ప్రదర్శనలో వినియోగించారు. సోమనాథ్‌కు చేరుకున్న వెంటనే అక్కడి చారిత్రక దేవాలయం సోమ్‌నాథ్ ఆలయంలోప్రత్యేక పూజలునిర్వహించి సోమేశ్వరుని దర్శించుకుని పూజారుల ఆశీస్సులు పొందారు. 12 జ్యోతిర్లింగాల్లో మొట్టమొదటిగా భావించే సోమ్‌నాథ్ సోమేశ్వరాలయంపై ఘజిని మహ్మద్ దండయాత్రకు అనేకసార్లు ప్రయత్నించినా ఇక్కడి ప్రజలతీవ్ర ప్రతిఘటనతో తోకముడిచి వెళ్లిపోయినట్లు చరిత్రల్లో ఉంది. వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సులో కూడా పాల్గొంటారు. జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తోను ఆయన భేటీ కానున్నారు. సోమ్‌నాథ్ దేవాలయ ట్రస్టు కమిటీ ఛైర్మన్‌గా పాలకమండలి సమావేశం కూడా నిర్వహించారు. ఆదివారం ప్రధాని శౌర్యయాత్రలోపాల్గొంటారు. సోమ్‌నాథ్ మందిరానికి రక్షణగా ఆనాడుప్రాణత్యాగాలుచేసిన వీరులకు గుర్తుగా 108 అశ్వాలతో ఈ మహా శౌర్యయాత్రనునిర్వహిస్తున్నారు. అనంతరం రాజ్‌కోట్‌కు చేరుకుని వైబ్రంట్ గుజరాత్‌ప్రాంతీయ సదస్సులో పాల్గొంటారు. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలకోసం ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. అక్కడే నిర్వహించే ట్రేడ్‌షోను ఎగ్జిబిషన్‌ను కూడా మోడీ ప్రారంభిస్తారు. జిఐడిసి మెడికల్ డివైస్‌పార్కును ప్రారంభించేందుకు 14 గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ జిఐడిసి ఎస్టేట్లను కూడా ప్రారంభిస్తారు. అహ్మదాబాద్ మెట్రో రెండోదశను కూడా ప్రారంభిస్తారని గుజరాత్‌సీఎం భూపేంద్ర పటేల్ తెలిపారు. తర్వాత జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌తో కలిసి సబర్మతి ఆశ్రమ్‌ను సందర్శిస్తారు. ఆతర్వాత ఇరువరు ద్వైపాక్షిక భేటీ ఉంటుంది. అనంతరం గాంధీ నగర్‌లో జరిగే పతంగుల వేడుకను ప్రారంభిస్తారు. జర్మనీభారత్‌లమధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం 25 ఏళ్లుపూర్తిచేసుకన్న సందర్భంగా ఈ ఇరువురు నేతలమధ్య ఈ భేటీ జరుగుతోంది. వ్యాపారపారిశ్రామికరంగ ప్రతినిధులతో కూడా ప్రధానిమోడీ జర్మనీ ఛాన్సలర్లు చర్చలు జరుపుతారు.

# బోణీకొట్టిన ముంబయి ఇండియన్స్


## 50 పరుగుల తేడాతో ఢిల్లీ కేపిటల్స్ ఓటమి

## ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హార్మన్‌ప్రీత్‌కౌర్

**నవీముంబయి, జనవరి 10:**డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో ఆఖరి ఓవర్ వరకూ పోరాడి ఓడిన ముంబై ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్‌పై పంజా విసిరింది. హార్మన్‌ప్రీత్ కౌర్(74) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు నాట్ సీవర్ బ్రంట్(70) మెరుపులతో భారీ స్కోర్ చేసిన ముంబై, ఆ తర్వాత నికోలా కారీ(3-37) చెలరేగడంతో ఢిల్లీని పడగొట్టింది. చిన్నెల్లె హెన్రీ(56) అర్ధ శతకంతో ఆశలు రేపినా అవతలివైపు నుంచి సహకారం రాలేదు. దాంతో 196 పరుగుల ఛేదనలో ఢిల్లీ 145కే పరిమితమైంది. 19వఓవర్లోనే 145కు ఆలౌటైన ఢిల్లీ 50 పరుగుల తేడాతో భారీ ఓటమిని మూటగట్టుకుంది. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో ముంబై ఇండియన్స్ పాయింట్ల ఖాతా తెరిచింది. ఆరంభ మ్యాచ్‌లో చేజారిన విజయాన్ని రెండో మ్యాచ్‌లో పట్టేసింది. మొదట కెప్టెన్ హార్మన్‌ప్రీత్ కౌర్(74), నాట్ సీవర్ బ్రంట్(70) అర్ధ శతకాలతో చెలరేగి జట్టుకు కొండంత స్కోర్ అందించారు. అనంతరం నికోలా కారీ(337), అమేలియా కేర్(324)ల ధాటికి ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. 50 పరుగుల తేడాతో గెలుపొందిన ముంబై ఘనంగా బోణీ చేసింది. భారీ ఛేదనలో ఢిల్లీకి పవర్ ప్లేలోనే వరుసగా షాక్‌లు తగిలాయి. ఓపెనర్ లిజెల్లే లీ(10)ని నాట్ సీవర్ బ్రంట్ ఔట్ చేసి తొలి బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత బంతి అందుకున్న నికోలా కారీ(322) ఒకే ఓవర్లో షఫాలీ వర్మ(8), లారా వొల్వార్ట్(9)లను బౌల్డ్ చేసి ఢిల్లీని దెబ్బ కొట్టింది. ఆ తర్వాత షబ్నం ఇస్మాయిల్ ఓవర్లో జెమీమా రోడ్రిగ్స్(1) ఔటయ్యింది. స్లిప్‌లో బౌండరీ కోసం తను కట్ షాట్ ఆడగా వికెట్ కీపర్ కమలిని కుడివైపు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అద్భుతంగా బంతిని అందుకుంది. ఆ షాక్‌తో33కే ఢిల్లీ నాలుగు వికెట్లు కోల్పోయింది. ఢిల్లీని గట్టెక్కించాలనుకున్న మరినే కాప్(10) ఒక సిక్సర్, ఫోర్ బాది క్రీజులో నిలబడే యత్నంచేసినా కారీ ఓవర్లో తను కూడా క్యాచ్ ఇచ్చి డగౌట్ చేరింది. ఢిల్లీజట్టు 46కే సగం వికెట్లు కోల్పోయింది.

# నగరాలు నదీ తీరాల్లోనే

>> రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందని వివరించారు. దేశంలోనే ఉద్యానవన రంగంలో మొదటి స్థానంలో ఉన్న మనం రానున్న మరో పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ 1 స్థానానికి వెళ్తామని స్పష్టం చేశారు. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండు తెలుగురాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాల్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయని వెల్లడించారు. రాయలసీమకు నీరందించామనటానికి పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. పట్టిసీమ ద్వారా రాయలసీమ పట్ల తమకున్న చిత్తశుద్ధిని చాటుకున్నామని తెలిపారు. 2020లో నిలిపిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.



నందిగామ వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఆగిన వాహనాలు

# జాతీయ రహదారులపై సంక్రాంతి సందడి

## వాహనాల రద్దీతో 65, 16 జాతీయ రహదారులపై ట్రాఫిక్ జామ్

## ఎన్టీఆర్ జిల్లా నందిగామ వైజంక్షన్ నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారిలో ట్రాఫిక్ రద్దీ

**విజయవాడ,జనవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ సందడంతా జాతీయ రహదారులపైనే కన్పిస్తోంది. తెలంగాణా ప్రాంతం నుంచి ఆంధ్రాలోని స్వగ్రామాలకు తరలివెళ్ళే ప్రయాణికల వాహనాలతో జాతీయ రహదారులు 65,16లు రద్దీగా ఉన్నాయి. హైదరాబాద్- విజయవాడ రహదారిపై రద్దీ పెరిగింది. టోల్ ప్లాజాల దగ్గర భారీగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. ప్రయాణం సాఫీగా సాగేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షి స్తున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున కార్లు, బస్సులు ఇతర వాహనాల్లో సొంత ప్రాంతాలకు ఆంధ్ర ప్రాంతవాసులు తరలి వస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద జాతీయ రహదారిపై హైవే అండర్ పాస్ బ్రిడ్జికి అనుసంధానంగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం అసంతృప్తిగా నిలిచిపోయింది. దీనివల్ల ఈ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. సర్వీస్ రోడ్డు మీద నుంచి వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. దీనివల్ల హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వాహనాలు రావటానికి నందిగామ వై జంక్షన్ వద్ద నరకయాతన అనుభవిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కావడం వల్ల కిలోమీటర్ల మేర కార్లు బారులు తీరుతున్నాయి. దీంతో నందిగామ మీదుగా హైవేపై వచ్చే వాహనాలు సైతం ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. నందిగామ వై జంక్షన్ నుంచి నందిగామ పట్టణంలోకి వెళ్లే రహదారిలోనూ ట్రాఫిక్ జామ్ అయింది. సంక్రాంతి పండుగకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిసినా కూడా కీసర టోల్ ప్లాజా నిర్వాహకులు, హైవే అథారిటీ అధికారులు కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయించకపోవడం గమమనార్హం. విజయవాడ డీసీపీ లక్ష్మీ ్మనారాయణ, సీఐ లచ్చు నాయుడు సంఘటనా స్థలానికి సందర్శించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రయత్నాలు చేస్తున్నారు. తెల్లవారుజాము నుంచి ఉదయం 11 గంటల వరకు చిలకల్లు టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి మొత్తం 13,567 వాహనాలు వెళ్లాయి. సొంత ఊర్లు వెళ్లేవారితో విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ సందడిగా మారింది. సొంత ఊరికి వెళ్లేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రయాణికులు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు. పండుగ రద్దీని అధిగమిం చేందుకు అందుకు అనుగుణంగా ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు.

# త్వరలోనే 'నంది' అవార్డుల ప్రదానం

>> వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్‌ను ఒక బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఏటా ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా వచ్చే ఏడాది 2026 డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో అమరావతి ఆవకాయ్ ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయన అధికారికంగా ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో కళలు, సంస్కృతి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రి దుర్గేష్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాకారులకు ప్రాధాన్యతనిస్తూ కందుకూరి, ఉగాది పురస్కారాలను అందజేశామని గుర్తుచేశారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో నంది నాటకోత్సవాలు నిర్వహించి, ప్రతిభావంతులకు నంది అవార్డులు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీమ్ వర్క్స్ ఆర్ట్స్ సంస్థ నాటకం, సినిమా, సాహిత్యం మరియు విభిన్న ప్రదర్శనలను ఒకే వేదికపైకి తీసుకురావడాన్ని మంత్రి దుర్గేష్ అభినందించారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ జీవిత ప్రస్థానంపై జరిగిన చర్చా కార్యక్రమం, సినీ దర్శకులు కోదండరామిరెడ్డి, రచయిత యండమూరి వీరేంద్రనాథ్ పాల్గొన్న సాహిత్యం సినిమా చర్చలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయన్నారు. నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రదర్శించిన కురుక్షేత్ర పద్యాల ఆలాపన, ఏకపాత్రాభినయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజుల్లో భవానీ ఐలాండ్‌కు 15 వేల మంది, పున్నమి ఘాట్‌కు 30 వేల మంది.. మొత్తంగా 45 వేల మందికి పైగా సందర్శకులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, టీమ్ వర్క్స్ ఆర్ట్స్ ప్రతినిధులు శ్యామ్స్, సంజయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

# 'జీరామ్‌జీ' వేదికగా స్వర్ణాంధ్ర సాధన

## వ్యవసాయ పనులకు ఆటంకంలేని విధంగా పథకం అమలు: బిజెపి

## చీఫ్ మాధవ్, మంత్రి దుర్గేష్‌తో భేటీలో సిఎం చంద్రబాబు

**సచివాలయం,జనవరి 10,ప్రభాతవార్త:** పేదలకు ఉపాధి కల్పించడంతో పాటు..గ్రామాల్లో ఆస్తులను సృష్టించేలా వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం గత డిసెంబర్‌లో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం స్థానంలో తెచ్చిన వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ (గ్రామీణ్) - విబి జీ రామ్ జి పథకంపై ప్రజలకు, లబ్దిదారులకు వివరించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం సూచించారు. ఈ మేరకు శనివారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో బిజేపి ఏపి చీఫ్ మాధవ్, జనసేన తరపు మంత్రి కందుల దుర్గేష్ భేటీ అయ్యారు. ఈ భేటీలో జీ రామ్ జీ పథకం అమలుపైనా ఈ పథకం ద్వారా రాష్ట్రానికి ..పేదలకు ఎలాంటి మేలు జరుగునన్న అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకాన్ని తెచ్చింది. కొత్త మార్గదర్శకాల ద్వారా గతానికంటే 25రోజులు ఎక్కువగా పేదలకు ఉపాధి కల్పించే అవకాశం లభించింది. దీని వల్ల అటు కూలీలకు, ఇటు రైతులకు మేలు జరిగేలా చూసింది.

**స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాలకు అనుగుణంగా:** రాష్ట్రాన్ని 10సూత్రాల ఆధారంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని ఆ దిశగా పనిచేస్తుంది. ఈ స్కీమ్‌లో భాగంగా గ్రామాల్లో గోకులాలు నిర్మించుకోవచ్చు..ప్లాంటేషన్ చేసుకోవచ్చు, పశుగ్రాసం పండించుకొని ఉపాధి కల్పించవచ్చు. అలాగే ప్రతి ఇంటికి తాగునీరు అందించే జన్ జీవన్ మిషన్--అమరజీవి జలధార వంటి పథకాలను ఈ స్కీంకు అనుసంధానం చేయవచ్చు.

**గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఆస్కారం : మంత్రి కందుల దుర్గేష్**

మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు 2014-19 మద్యకాలంలో సీఎం గా ఉన్నప్పుడు ఉపాధి హామీ కింద గ్రామాల్లో ఎన్నో ఆస్తులను సృష్టించగలిగారు. ఇప్పుడు జీ రామ్ జీ పథకం ద్వారా నీటి భద్రత, గ్రామాల్లో మౌలిక వసతులు, జీవనోపాధికి ఆసరాగా నిలవడం, వివిధ నిర్మాణాలు చేపట్టవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసేలా ఈ స్కీమ్‌ను కేంద్రం రూపొందించింది. దీనిపై త్వరలో డిప్యూటీ సీఎంతో భేటి జరుపుతాం అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

**అవినీతికి తావు ఇవ్వని విధానం: మాధవ్**

బిజెపి ఏపి చీఫ్ మాధవ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉపాధి కల్పించే నిమిత్తం కొత్తగా తెచ్చిన జీ రామ్ జీ పథకంలో అవినీతికి తావు లేకుండా పటిష్టమైన వ్యవస్థను తీర్చిదిద్దారు. ఈ పదకం ద్వారా ఉపాధితోపాటు ఆస్తుల కల్పనకు పెద్దఎత్తున ప్రాధాన్యతిచ్చే దిశగా కేంద్రం పనిచేస్తుంది. పీఎం గతి శక్తితో అనుసంధానం ద్వారా అందరికి అభివృద్ధి ఫలాలు అందేలా కేంద్రం జాగ్రత్తలు తీసుకొని ఈ పథకాన్ని రూపొందించింది. ఈ సమావేశంలో కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ జీ రామ్ జీ పథకంలోని అంశాలను పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు సీఎంకు వివరించారు. అలాగే నరేగా పథకంలో కవర్ కాని కొన్ని అంశాలను జీ రామ్ జీ పథకంలో కవర్ చేసినట్లు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.



# ఆదుకోండి..

## కనీస సౌకర్యాలు కల్పించండి, ఉరి తాడుతో గిరిపుత్రుల వేడుకోలు

## డి.సిఎం పవన్‌కు విజ్ఞప్తి చేస్తున్న ఐదు గ్రామాల గిరిజనులు

**బొబ్బిలి (విజయనగరం జిల్లా), జనవరి 10 ప్రభాతవార్త :** గిరిజనుల ఆవేదనను అర్థం చేసుకునే వ్యక్తి కేవలం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాత్రమేనని బొబ్బిలి నియోజకవర్గం పరిధిలోని ఐదు గ్రామాలకు చెందిన గిరిజనులు అంటున్నారు. ఆయనకి తమ సందేశం వెళ్లాలనే ఆలోచనతో ఆయా గ్రామాల గిరిపుత్రులు మెడకి ఉరితాడు బిగించుకొని తమ నిరసనను తెలియజేస్తున్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధిలో ఉన్న అయిదు గిరిజన గ్రామాలు కృపావలస, రామన్నవలస, దీవెనవలస, సీయోను వలస గ్రామాలకు చెందిన గిరిజనులు తమకు ఓటు హక్కు, ఆధార్ కార్డు ఉన్నా కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ నుంచి ఉన్నతా ధికారి వరకు తమ సమస్యలు ఎన్నో సార్లు విన్నవించినా ఫలితం లేదని వాపో యారు. తమ గిరిజన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తాగునీరు విద్యుత్ సౌకర్యం, రహదారితో పాటు గూడు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకో వాలని డిప్యూటీ సీఎం పవన్‌ని కోరుతున్నారు. ఈ ఐదు గ్రామాలలో 60 మంది పిల్లలు వరకు ఉన్నారని, వారికి విద్య, వైద్య సౌకర్యాలు అం దడంలేదని చెబుతూ ఈ నేపథ్యంలోనే పవన్ తమ కుటుంబాలకు సరైన న్యాయం చేయాలని విన్నవించుకుంటూ లేనిపక్షంలో తమకి ఉరితాడే శరణ్యమని అంటున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ రామ్ సుందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఐదు గిరిజన గ్రామాల్లో అధికారులు పర్యటించి గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను ప్రభుత్వానికి తెలియచేసి పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు.

# తెలంగాణ మున్సిపోల్స్‌లో జనసేన పోటీ!

## పార్టీ ప్రక్షాళనపై పవన్ కల్యాణ్ పూర్తి దృష్టి

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** తెలం గాణలో జనసేన బలోపేతంపై పవన్ కల్యాణ్ ఫోకస్ పెట్టారు. కొండగట్టు పర్యటన తర్వాత పార్టీని స్ట్రాంగ్ చేయాలని జనసేనాని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణలో పార్టీ ప్రక్షాళన మొదలు పెట్టారు. రాబోయే తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధిం చిన కార్యాచరణ ఇప్పటికే ప్రారంభించినట్లు ఆ పార్టీ వెల్లడించింది. ఎన్నికలకు తక్కువ సమయం ఉన్నప్పటికీ సాధ్యమైనన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు ప్రకటించింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు పార్టీని తిరుగులేని శక్తిగా తయారుచేసి, క్రియ శీలక పాత్ర పోషించేలా చేయాలని భావిస్తు న్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతంపై పవన్ కల్యాణ్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందుకోసం పవన్ కల్యాణ్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని శ్రేణులకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర కమిటీలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. వాటి స్థానంలో కొందరు సభ్యులతో అడ్ హాక్ కమిటీలను నియమించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం తెలం గాణలో జనసేన పార్టీకి పెద్దగా బలం లేదు. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపే పార్టీ బలపడాలని భావిస్తోంది. గత ఎన్నికల్లో బీజేపీ తో పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీకి బహిరంగ మద్దతు ప్రకటించింది. పవన్ ప్రచారానికి రాలేదు కానీ భవిష్యత్ ఎన్నికల్లో తెలంగాణలో జనసేన బలపడాలని చూస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన కొన్నిచోట్ల పోటికి దిగింది. కానీ ఎమ్మెల్యేలు గెలవలేదు. ఎన్నికల సమయంలో పవన్ కల్యాణ్ ప్రచారం నిర్వహించారు. అయినప్పటికీ భారీగా ఓట్లు వచ్చాయి. కానీ సీట్లు మాత్రం రాలేదు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓటర్లు, ముఖ్యంగా కాపు సామాజికవర్గం ఓటర్లు సంఖ్య భారీగా ఉంది. అందుకే వచ్చే ఎన్నికల్లో మరింత గట్టిగా ఫైట్ చేస్తే మెరగైన ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తోంది. తాజాగా పవన్ జగిత్యాల జిల్లా కొండగట్టులో పర్యటించారు. కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కొండగట్టు ఆలయం దగ్గర దాదాపు రూ.35 కోట్లతో పలు కాటేజీల నిర్మాణం చేపడుతున్నారు.

## వారం - వర్జ్యం

11-01-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,ఉత్తరాషాఢ కార్తె
అష్టమి ఉ.10.21
చిత్త సా.6.14
వర్జ్యం : రా.12.30-2.17
దు.సా.4.18-5.03,
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** విభేదాలతో, అపోహలతో ఇన్నాళ్ళు సాగిస్తూవస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెబుతారు. సోదరుల కలయిక.

**వృషభం:** దైవ సంబంధితమైన కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు తొలుగుతాయి.

**మిథునం:** రావలసిన ఋణాలు మీరు చెల్లించవలసిన చెల్లింపులను బేరీజు చేసుకుంటారు. ప్రయణాలు.

**కర్కాటకం :** తగువిధంగా ప్రణాళికలు రూపొందించుకుంటారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** ప్రత్యర్థులు సమస్యలు సృష్టించినా వాటిని అధిగమించి ముందుకు సాగుతారు. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**కన్య :** కుటుంబసభ్యులతో ముఖ్యమైన విషయాలు చర్చించి ఓ నిర్ణయానికి వస్తారు. ఆభరణాలు కొనుగోలు.

**తుల :** సంతాన విషయాలపైన ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు కొంత వరకు తీరుతాయి.

**వృశ్చికం:** మీ ముందు ఒక మాట, మీ వెనుక ఒక మాట చెబుతూ వస్తున్నవారి పట్ల అప్రమత్తంగా మెలగవలసి వస్తుంది.

**ధనుస్సు:** ఋణయత్నాలు ఫలిస్తాయి. తాత్కాలికంగా చేసే నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు. వాహనసౌఖ్యం.

**మకరం:** ధనానికన్నా ఆత్మగౌరవానికి ప్రాముఖ్యత నిస్తారు. మొండితనాన్ని పట్టుదలను కలిగి ఉంటారు.

**కుంభం:** ఇష్టం లేకపోయినా ఇంతకాలం మీరు భరిస్తూవస్తున్న ఓ వర్గాన్ని వదిలించు కోగలుగుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం :** స్తంభించిన కార్యక్రమాలను తిరిగి ప్రారంభించడానికి మీరు చేసే యత్నాలు ఫలిస్తాయి. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆడపిల్లకు చదువే అసలైన ఆస్తి

## - హోం మంత్రి అనిత



కెఎల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న హోంమంత్రి అనిత

**విజయవాడ,జనవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లకు చదువే అసలైన ఆస్తి అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శని వారం నాడు వడ్డేశ్వరంలోని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ లలో ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికై జాతీయ స్థాయిలో నిర్వహించిన మొదటి విడత ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష ఫలితాలను ఆమె విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆమె మాట్లాడుతూ కెఎల్ యూనివర్సిటీలో అడుగు పెట్టగానే రాబోయే తరాన్ని తయారు చేసే ఖర్మాగారంలో అడుగు పెట్టినట్లుగా భావన కలిగిందన్నారు. ఇంత మంది అమ్మాయిలను ఒక దగ్గర చూడటం ఆనందంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా పెంపొందిస్తున్న కెఎల్ యూనివర్సిటీ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. తన తండ్రి తనకు చదువే అసలైన ఆస్తి అని చెప్పేవారని తన భాల్యంలోని సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. తాను డిఎస్సి పాసయి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేసినట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడి ప్రోత్సాహంతో తాను రాజకీయాలలోకి ప్రవేశించి రాష్ట్రానికి హోం మంత్రి అయ్యానని చెప్పారు. మోటివేషన్ అనేది ఆడపిల్లకి ఎంత ముఖ్యమో.... మగ పిల్లలకి కూడా అంతే ముఖ్యమని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని పిల్లలు ఎప్పటికీ మరచిపోకూడదని హితవు పలికారు. టెక్నాలజీతో కూడా కెఎల్ యూనివర్సిటీలో చదువుతున్న బాలికా విద్యార్థినులను ముందుండి కాలేజీలో ప్రయోగాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. బాలికలు అపరిచితుల మాయలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఇటీవల తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను ఆమె ఉదహరించారు. ఇన్ స్టా గ్రామ్ , ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా పరిచయాలను నమ్ముకుని కన్న వారికి కడుపుకోత మిగల్చవద్దని తెలియజేశారు. తాను హోం మంత్రిగా భాద్యతలు తీసుకున్న ఏడాదిన్నర కాలంలో 4 శాతం నేరాల శాతం రాష్ట్రంలో తగ్గించిన్నారు. సోషల్ మీడియా వ్యాప్తి బాలికలను ట్రాప్ చేసే ఆకతాయిలు ఎక్కువయ్యారని అన్నారు. అలాంటి వారి పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. 18 ఏళ్ళ లోపు బాలికలను వేధించినా , అసభ్య కరంగా ప్రవర్తించిన వారిపైన పోక్సో కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీ షీట్లు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. మీ చుట్టు పక్కల ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటే ఈగల్ టీమ్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.. వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఒక దశలో తాను కూడా సోషల్ మీడియాలో వేధింపులకు గురయ్యానట్లు తెలిపారు.

# తిరుమల సమాచారం

## 25న మినీబ్రహ్మోత్సవం!

### - 24నుండి 26వరకు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు రద్దు



**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** మరో రెండువారాల్లో కలియుగవైకుంఠం తిరుమలకొండపై ఈనెల 25వతేదీ ఆదివారం సూర్యజయంతి(రథసప్తమి) వేడుకలు అంగరంగవైభవంగా జరుగనున్నాయి. ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై ఏడుకొండలదేవుడు భక్తులకు దర్శనమివ్వనున్నాడు. ఈ సందర్భంగా తిరుమల ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోపాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దుచేసింది. భక్తులను వైకుంఠం 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు. ఆదివారం రథసప్తమి పర్వదినం ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలు, భద్రత అంశాలపై టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, విజిలెన్స్,పోలీసు విభాగాల అధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం ముందు, మాఢవీధుల్లో గ్యాలరీలు, జర్మన్‌షెడ్లను ఏర్పాటు చేసే పనులు మొదలయ్యాయి. ఆరోజు ఉదయం నుండి రాత్రి వరకు నిరంతరాయంగా భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు. టీ,కాఫీ,పాలు అందించేలా శ్రీవారిసేవకులు, టిటిడి ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నారు. తిరుమలలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అదనపు పార్కింగ్ ప్రదేశాలను సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తున్నారు. 25వతేదీ పూర్తిగా భక్తులకు ఉదయం నుండిరాత్రి వరకు చలికి, ఎండకు ఇబ్బందులు కలగకుండా మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. 25వతేదీ ఆదివారం అన్ని ఆర్జితసేవలు, ఇతర ప్రత్యేక దర్శనాలు, సిఫార్సు దర్శనాలు,బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దుచేశారు. ఆ రోజు ఉదయం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలు రద్దుచేశారు. ఒకరోజు మినీబ్రహ్మోత్సవం వీక్షించేందుకు తిరుమలకు అశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 24వతేదీ నుండి 26వరకు తిరుపతిలోని కౌంటర్లలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని కూడా నిలుపుదలచేశారు. ఆరోజు ఉదయం 5.30గంటలకు తొలివాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగనుంది.

# విజయవాడ దుర్గగుడిలో విద్యుత్ షాక్

## - విచారణకు ఆదేశం



**విజయవాడ,జనవరి10, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ దుర్గగుడిలో శనివారం ఉదయం ప్రసాదం వితరణ ప్రదేశంలో విద్యుత్‌షాక్ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ప్రసారమాధ్యమాల్లో జరిగిన ప్రచారంపై దేవస్థానం అధికారులు సమగ్ర విచారణకు ఆదేశించారు. వన్‌టౌన్ సీఐతోపాటు ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రసాదం వితరణ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి తీగలు, ఇనుప కంచెను చేతితో పట్టుకుని మరీ తనిఖీ చేశారు. ప్రసాదం పంపిణీ చేసిన అర్చకున్ని ప్రశ్నించారు. తనకు షాక్ తగిలినట్లు అనిపించిందంటూ అతను ఇచ్చిన వివరణను రికార్డు చేసుకున్నారు. విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం జరిగిన ఘటన మరవకముందే, నేడు మళ్లీ నేడు కొత్త ఆరోపణతో వార్తల్లో కెక్కింది. నిన్న అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన శ్రీచక్ర నవావరణార్చన జరుపుతుండగా పాలలో పురుగులు వచ్చాయని భక్తులు సహా ఆలయ ఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దానిపై విచారణ జరగకముందే నేడు దుర్గగుడిలో మరో అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ రోజు (శనివారం) ఉదయం ప్రసాద వితరణ ప్రదేశంలో విద్యుత్ షాక్ అంటూ ప్రసార మాధ్యమాల్లో జరిగిన ప్రచారంపై దేవస్థానం అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ప్రసాదం పంపిణీ ప్రాంతం కొత్తగా ఏర్పాటు చేసింది కాదు. ఇటీవల ఆలయంలో అనేక చోట్ల సీసీ కెమెరాల నిఘా పెరిగింది. భక్తుల సౌకర్యార్థం అంటూ సంస్థాగతంగా కొన్ని మార్పులు చేశారు. పూజల ప్రదేశాల్లోను మార్పులు జరిపారు. ఈ తరుణంలో ప్రసాదం వితరణ ప్రాంతం వద్ద విద్యుత్తు షాక్ అంటూ వచ్చిన ప్రచారంతో సమగ్రంగా పరిశీలించిన తర్వాత మళ్లీ యథావిధిగా ప్రసాదం పంపిణీ జరిపారు. ఈ విషయంలో వాస్తవాన్ని ఇంజినీరింగ్ సిబ్బంది, పోలీసులు నిగ్గుతేల్చడంపై దృష్టి సారించారు. శుక్రవారం శ్రీచక్ర నవావరణార్చనలో అభిషేకానికి వినియోగించే ఆవుపాలలో పురుగులు కనిపించాయంటూ వేద పండితులు అర్చనను నిలిపివేసిన అంశంపై ఈవో వీకే శీనానాయక్ సమగ్ర విచారణకు స్థానాచార్యులు శివప్రసాదశర్మ నేతృత్వంలో కమిటీ వేశారు.

# అమరావతిని జగన్ వ్యతిరేకించలేదు

## - వైఎస్సార్సీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి



విజయవాడ,జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతిని జగన్ వ్యతిరేకించలేదని వైసీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. జగన్ ఇల్లు అమరావతిలోనే ఉందన్నారు. పెద్దపెద్ద భవనాలను కడుతూ ప్రజాధనం వృధా చేస్తున్నారనే జగన్ ప్రశ్నించారన్నారు. అమరావతి అనేది కేవలం ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారిందని, అక్కడ చంద్రబాబు నాయుడు తన అనుకూల వర్గాలకు లబ్ధి చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. జగన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదన్నారు. జగన్ ఎప్పుడూ రాష్ట్రానికి ద్రోహం చేయలేదని స్పష్టం చేశారు. రాజధాని పేరుతో అక్కడ పెద్ద ఎత్తున భూ కుంభకోణాలు జరిగాయని, అవినీతి చోటు చేసుకున్నప్పుడు దానిని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అమరావతిని అభివృద్ధి చేస్తామంటున్న కూటమి ప్రభుత్వం, కేవలం గ్రాఫిక్స్‌తోనే కాలక్షేపం చేస్తోందని సజ్జల విమర్శించారు. చంద్రబాబు గతంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి చేసిన వాగ్దానాలు ఏవీ నెరవేరలేదని, ఇప్పుడు మళ్ళీ అదే పద్ధతిని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. పారదర్శకత లేకుండా అక్కడ సాగుతున్న పనులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని, కేవలం భ్రమలు కల్పించడం ద్వారా ప్రజలను మోసం చేయలేరని ఆయన వ్యాఖ్యానించారు. అమరావతిలో సాగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తే అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు చిత్రీకరించడం సరికాదని, బాధ్యత గల ప్రతిపక్షంగా తాము ప్రజా ప్రయోజనాల కోసం నిలబడతామని ఆయన స్పష్టం చేశారు. పెద్ద భవనాల పేరుతో ఎందుకు బడ్జెట్ పెంచుతున్నారని ప్రశ్నించారు. ప్రజాధనం వృథా కాకూడదనేదే తమ ఆలోచన అని చెప్పుకొచ్చారు. అమరావతిపై అంత డబ్బు ఖర్చు చేయడం అవసరమా అని జగన్ అడిగారని గుర్తుచేశారు. అమరావతిపై జగన్ ప్రశ్నలకు ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పడం లేదని నిలదీశారు. అమరావతి పేరుతో జగన్‌ను దూషిస్తున్నారని విమర్శించారు.

# ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులనుంచి ఎక్సైజ్ శాఖకు కీలక సమాచారం

## - ఇబ్రహీంపట్టణం కేంద్రంగా ప్లాన్ అమలు

**విజయవాడ,జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి:**ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితులనుంచి ఎక్సైజ్ శాఖ కీలక సమాచారాన్ని రాబడుతుంది. అత్యంత ఆశ్చర్యకరమైె సమాచారాన్ని నిందితుల నుంచి రాబట్టింది. నలుగురు నిందితులను కస్టడీకి ఇస్తూ విజయవాడ ఎక్సైజ్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విచారణలో భాగంగావిషయాలు బయటకు వచ్చాయి. తొలుత మనోజ్ కుమార్‌కు మూతలు సరఫరా చేశాను. అతను ఇబ్రహీంపట్నం, ములకలచెరువులోని తయారీ కేంద్రాలకు పంపించాడు. ఆ తర్వాత నేను స్వయంగా ఆర్డర్ తీసుకుని సరఫరా చేశానని నకిలీ మద్యం కేసులో నిందితుడు ధారబోయిన ప్రసాద్ ఎక్సైజ్ పోలీసుల విచారణలో చెప్పాడని సమాచారం. కోర్టు ఉత్తర్వుల మేరకు ఎక్సైజ్ పోలీసులు నలుగురు నిందితులను కస్టడీకి తీసుకున్నారు. విజయవాడ కారాగారంలో ఉన్న ప్రసాద్‌ను జైలు నుంచి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. మిగిలిన నిందితులు బాలాజీ, సుదర్శన్, తలారి రంగయ్యను నెల్లూరు కారాగారం నుంచి తీసుకురావడంతో ఆలస్యమైంది. వీరు సాయంత్రం రావడంతో విచారణ సాగలేదు. ఈ రోజు విచారిస్తారు. ఇకప్రసాద్‌ను ఎక్సైజ్ అధికారుల బృందం పలు ప్రశ్నలు వేసింది. మనోజ్‌తో ఎలా పరిచయమైందని ప్రశ్నించారు. అతని సోదరుడితో తనకు పరిచయం ఉందన్నాడు. అలా అతనితో పరిచయమైందని వివరించాడు. 2022 నుంచి నకిలీ మద్యం తయారీ కోసం అల్యూమినియం మూతలు సరఫరా చేస్తున్నట్లు చెప్పాడు. మనోజ్ సరఫరా చేయలేక తప్పుకున్న తర్వాత పలు బ్రాండ్ల లోగోలతో మూతలను అద్దేపల్లి సోదరులకు అందజేసినట్లు విచారణలో వెల్లడించాడు.

# వైఎస్సార్సీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పండి

## : మంత్రి పి.నారాయణ

**విజయవాడ.జనవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పాలని మంత్రి పి.నారాయణ అన్నారు. అమరావతిపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలకు మంత్రి నారాయణ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసు వద్ద మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ దృష్టిలో రాష్ట్ర రాజధాని ఎక్కడో చెప్పాలన్నారు. అమరావతి రాజధాని అని తమకు పూర్తి క్లారిటీ ఉందని.. వైసీపీ కూడా రాజధానిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రివర్ బెడ్‌కు రివర్ బేసిన్‌కు తేడా తెలియకుండా మాట్లాడారని వ్యాఖ్యలు చేశారు. చాలా నగరాలు రివర్ బేసిన్‌లోనే మహా నగరాలుగా అభివృద్ధి చెందాయని మంత్రి తెలిపారు. రైతులతో మాట్లాడటానికి ఇష్టపడని నాయకులు ఇప్పుడు లేనిపోని ప్రేమ చూపిస్తారని మంత్రి నారాయణ మండిపడ్డారు. గత ప్రభుత్వ నిర్వాకంతోనే అమరావతి పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని విమర్శలు గుప్పించారు. అమరావతి నిర్మాణ పనులకు పారదర్శకంగా టెండర్లు పిలిచామని స్పష్టం చేశారు. రాజధానిపై బురద జల్లే ఉద్దేశంతో అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో కేవలం మంత్రులు, వారి శాఖలు, అధికారులు మాత్రమే ఉండేలా నిర్మించారన్నారు. కానీ అమరావతిలో నిర్మించే సెక్రటేరియట్‌లో మంత్రులు, సిబ్బంది, హెచ్‌వోడీలు, ఇతర కార్పొరేషన్లు అన్నీ ఒకేచోట ఉండేలా నిర్మిస్తున్నామని వివరించారు. ప్రజలకు పాలన దగ్గరగా ఉండే విధంగా అన్ని నిర్మాణాలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు.

# శ్రీవారి ఆశీస్సులతో మరిన్ని ప్రయోగాలు

## - ఇస్రో ఛైర్మన్ నారాయణన్



**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** 1979 నుండి శ్రీహరికోట అంతరిక్షకేంద్రంలో ప్రయోగాలు చేస్తున్నామని, తిరుమలశ్రీవారి ఆశీస్సులతో ఈ నూతన సంవత్సరంలో మరిన్ని ప్రయోగాలు చేపట్టే శక్తినివ్వమని ప్రార్థించినట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. శనివారం ఉదయం శాస్త్రవేత్తలతో కలసి తిరుమలకు వచ్చారు. ఉదయం విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయ కుడు శ్రీవేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో దేశంలోని ప్రజలతోబాటు తెలుగుప్రజలకు శుభాలు కలగాలని ప్రముఖులు ఆకాంక్షించారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఎస్‌బిఐ ఎండి,సిఇఒ నీవన్‌చంద్రఝా,మాజీ ఎంపి గోరంట్లమాధవ్,మాజీ ఎమ్మెల్యేకేతిరెడ్డి పెద్దారెడ్డి విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం ఆనందదాయకం


## - అందరికీ శుభాలు కలగాలి: టిజి ఎమ్మెల్యే



**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** పుట్టినరోజున ఏడుకొండల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని, ఆశీస్సులందు కోవడం ఆనందంగా ఉందని తెలంగాణ ఎమ్మెల్యే తలసానిశ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. దేవదేవుని ఆశీస్సులతో తెలుగు ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# భోగి పండుగను పర్యావరణహితంగా జరుపుకుందాం

## రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా.పి.క్రిష్ణయ్య



**విజయవాడ,జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి:** భోగి పండుగ అనేది ఆనందం, సంప్రదాయం, సంతోషాన్ని పంచుకునే పర్వదినమని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి.క్రిష్ణయ్య వ్యాఖ్యానించారు..భోగి మంటల్లో ప్రమాదకర వ్యర్థాలు వేయకుండా పర్యావరణాన్ని కాపాడుకుందాం అని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. పి.క్రిష్ణయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసారు. శీతాకాలంలో సాధారణంగా గాలిలో ధూళిరేణువులు నిలకడగా ఉండి పొగమంచు రూపంలో కొంత వరకూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. దీనికి తోడుగా భోగి మంటలు వేయడం, వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం ఎక్కువగా ఉండి గాలి నాణ్యత క్షీణిస్తుంటుంది. చాలామంది తెలిసీ తెలియక పండుగ సందర్భంగా మంటల్లో టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు, ఫ్లెక్సీలు, రంగులు వేసిన ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వంటి ప్రమాదకరమైన వస్తువులను వేస్తుంటారు. ఈ రకమైన వాటిని కాల్చినప్పుడు డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు, సీసం, క్యాడ్మియం, మెర్క్యూరీ వంటి విషవాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయి. వీటి వల్ల పిన్నల నుంచీ పెద్దల వరకూ ప్రతి ఒక్కరికీ ప్రమాదకర వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా, అలర్జీలు తీవ్రతరం కావడం, కళ్ల మంట, ముక్కుగొంతు దురద, గుండె సంబంధిత సమస్యలు, దీర్ఘకాలంలో క్యాన్సర్ వంటి వాటి బారినా పడే ప్రమాదం లేకపోలేదు. అలాగే ఈ విషవాయు వులు వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేసి, గాలి నాణ్యతను దిగజార్చడమే కాకుండా, పర్యావరణ సమతుల్యతకు కూడా భంగం కలిగిస్తాయి. కాబట్టి ప్రజలందరూ భోగి మంటల్లో ప్లాస్టిక్, రబ్బరు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు లేదా రసాయన పూతలున్న వస్తువులను వేయకుండా కేవలం ఎండుటాకులు, కట్టెలు లేదా వ్యవసాయ వ్యర్థాలను మాత్రమే ఉపయోగించి భోగి పండుగను జరుపుకోవాలని డా.పి.క్రిష్ణయ్య కోరారు.

# గ్రామ రెవెన్యూ అధికారులపై వేధింపులు సరికాదు

**విజయవాడ, జనవరి 10, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ రెవెన్యూ అధికారులపై పై అదికారులు వేధింపులకు గురిచేయడం సరికాదంటూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు అన్నారు. గత ప్రభుత్వంలో 100 రోజుల్లో రీసర్వే పూర్తి చేయాలని హడావుడిగా సర్వే చేయించిన తదుపరి రీసర్వే పూర్తయిన 6,680 గ్రామాలకు , సంబంధించిన 4,784 గ్రామాలకు 22.33 లక్షల కొత్త పాస్ పుస్తకాలు వారంలోగా పంపిణీ చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారన్నారు. పాత డేటా ప్రకారం కొత్త పాస్‌పుస్తకాలను ఇవ్వాలని చెబుతున్నారని, చాలా మంది రైతులు ఇతర ప్రాంతాల్లో, ఇతర దేశాల్లో వుంటున్న వారికి వారి కుటుంబసభ్యులకు ఇవ్వటానికి యాప్‌లో చెబుతున్నప్పటికి వాస్తవంగా యాప్ ఆవిధంగా సహకరించడం లేదన్నారు.

ఈ సమస్యలను పట్టించుకోకుండా సంక్రాంతి లోపు పాస్‌పుస్తకాల పంపిణీ చేయాలని ఒత్తిడి తెస్తున్న అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తగు ఆదేశాలివ్వాలని కోరారు. ప్రజలకు మేలు చేయడానికి సహకరిస్తామని తెలిపారు.

# వేసవికి ముందే మొదటిఘాట్ రోడ్డుపై భయపెడుతున్న ఏనుగులు!

## - ద్విచక్రవాహనాలపై ఒంటరిగా వెళ్లొద్దని హెచ్చరిక



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శేషాచలం రిజర్వుఅటవీప్రాంతంలో తరచూ చిరుతపులులతో భయపడుతున్న నడకదారి భక్తులు ,వాహనదారులు వేసవికాలానికి మూడునెలల ముందే తిరుపతికెళ్ళే మొదటిఘాట్‌లో ఏనుగుల సంచారంతో వణికిపోతున్నారు. ఏనుగులు గుంపులుగా అటవీప్రాంతంలో సంచరిస్తుండటం, దారితప్పి రోడ్డు దాటుతుండటంతో ఎప్పుడు ఎలా వచ్చి దాడిచేస్తాయనే భయం పట్టుకుంది. శుక్రవారం సాయంత్రం దాటిన తరువాత మూడుఏనుగులు ఘాట్‌కు సమీపంలో అడవిలో ఉండటంతో అటుగా వెళుతున్న ద్విచక్రవాహనదారులు, వాహనదారులు భయపడిపోయారు. గుంపునుండి ఓ ఏనుగు ఘాట్‌రోడ్డుమీదికి రావడంతో వాహనాల హారన్ శబ్దాలకు అవి తిరిగి అవిబాట పట్టాయి. సమాచారాన్ని టిటిడి విజిలెన్స్‌కు, అటవీశాఖకు తెలియజేయడంతో ఏడవమైలు,మోకాళ్ళపర్వతం వద్దఉన్న సెక్యూరిటీ సిబ్బంది అక్కడకు చేరుకుని ఏనుగులను అడవిలోకి తరిమేందుకు వాహనాల హారన్లు, గట్టిగా కేకలతో వెనక్కివెళ్ళాయి. అయితే తిరుమల ఘాట్‌లో ఇప్పటి వరకు ఏనుగులు యాత్రికులపై దాడిచేసిన సందర్భాలు లేవనే తెలుస్తుంది. తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్డులో ఏనుగులు సంచారం మొదలవడంతో టిటిడి అధికారులు కూడా వాహనదారులకు తగిన జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. ఎవరూ కూడా వాహనాల్లో ఒకరుగా వెళ్ళొద్దని, గుంపులుగా వెళ్ళాలని హెచ్చరిస్తున్నారు. ఘాట్‌లో,కాలినడక మార్గాల్లో చిరుతల సంచారంతో బెంబేలెత్తిపోయిన భక్తులకు ఇప్పుడు ఏనుగులు రాకతో భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులను ఏమీ అనకపోతే వాటిదారిన అవి వెళ్ళిపోతాయని, ఏనుగులకు మనుషులు కూడా కనిపించరాదని చెబుతున్నారు.

# నారా భువనేశ్వరికి అవుట్ స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు



**విజయవాడ,జనవరి 10,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా సాధికారతకు చేస్తున్న సేవలకు ప్రశంసలు భువనేశ్వరి కృషి స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు ఈ గౌరవం పాడి రైతులకే చెందుతుందన్న భువనేశ్వరి ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా భువనేశ్వరిపై ప్రశంసలు కురిపించారు. ఆమెకు మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాడి రైతుల అభ్యున్నతి, మహిళా సాధికారత కోసం భువనేశ్వరి చేస్తున్న కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారం ఆమెకు, ఆమె బృందానికి దక్కాల్సిన సరైన గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ గౌరవం వెనుక ఆంధ్రప్రదేశ్‌లోని వేలాది మంది పాడి రైతుల కృషి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇండియన్ డెయిరీ అసోసియేషన్ (సౌత్ జోన్) నారా భువనేశ్వరికి అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డును ప్రకటించింది. డెయిరీ రంగంలో ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు అందుకోవడంపై భువనేశ్వరి స్పందించారు.

# సమాజానికి అండగా వైద్యులు

## రంగరాయ మెడికల్ కళాశాల కాకినాడకు గర్వకారణం: డిసిఎం పవన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 10 (ప్రభాతవార్త):** పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించి. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించారు. బ్రిడ్జి మొత్తం తిరిగి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుద్దగడ్డ కాలువపై పవన్ కళ్యాణ్ ఆదేశాలతో రూ. 3.05 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది. 2024 సెప్టెంబర్ లో పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా హౌసింగ్ కాలనీ సందర్శనకు వచ్చిన సందర్భంలో వరద ముంపులో ఉంది. పడవపై వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువకు వరద వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని హౌసింగ్ కాలనీ వాసులు పవన్ కళ్యాణ్ కు చెప్పారు. వరదలు వచ్చిన ప్రతిసారి జనజీవనం స్తంభించిపోతుందని వాపోయారు. ఆ సందర్భంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందించి హామీ నెరవేర్చారు. శుక్రవారం సంక్రాంతి మహోత్సవ వేదికపై లాంఛనంగా బ్రిడ్జిని ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ముంపు కష్టాలు తొలగించిన పవన్ కళ్యాణ్ కు కాలనీ వాసులు,

స్కూలు పిల్లలు థ్యాంక్యూ డిప్యూటీ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందు మాధవ్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, ఆర్ అండ్ బి అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఊటీని తలపిస్తున్న తిరుమల - కొండంతా పొగమంచు




**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరులపై మారిన వాతావరణం, చిరుజల్లులు కురుస్తుండటంతో శనివారం వేకువజామున పూర్తిగా తిరుమల ఆలయం పరిసరాలు పొగమంచుతో కమ్మేసింది. ఆలయం పూర్తిగా పొగమంచులో అద్భుతంగా కనువిందుచేసింది. ఆలయ నాలుగుమాఢవీదులు, జిఎంసి, ఘాట్‌రోడ్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు కూడా పొంగమంచులో కమ్ముకోవడంతో భక్తులు వైకుంఠంలో విహరించినట్లు అనుభూతి చెందారు. ఆలయం ముందున్న పుష్పాలంకరణఎలతో తమతమ సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు తీసుకున్నారు. పొగమంచుతో ఘాట్‌రోడ్లపై వాహనాలు ప్రయాణానికి కొంత ఇబ్బందిగా మారింది.

# పునర్విభజన రాజకీయమా! శాస్త్రీయమా?

పునర్విభజన కానీ, కొత్త జిల్లాల ఏర్పాటు కానీ, వికేంద్రీకరణ కానీ ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలి. శాపం కాకూడదు. ఇవన్నీ పరిపాలన సౌలభ్యం కోసం చేస్తున్నవి. అంతకంటే ముఖ్యంగా ప్రజల కోసం చేస్తున్నవని మర్చిపోకూడదు. అధికారం ఉందని పాలకవర్గం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ పోతే నష్టపోయేది ప్రజలే అన్న విషయం మర్చిపోకూడదు. ఏ రాజకీయ పక్షం అధికారంలోకి వస్తే వారి ఇష్టం వచ్చేట్లు నిర్ణయాలు తీసుకుంటూపోతే అంతిమంగా ఇబ్బంది పడేది ప్రజలే. ప్రజాస్వామ్యంలో పాలకుల నిర్ణయాలు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరగాలి. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు కాకూడదు. అలాంటి నిర్ణయాలు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేస్తాయి. అప్పుడే ప్రతికూల ఫలితాలకు ఆస్కారం ఏర్పడుతుంది. అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత మరొక మాట కూడా మాట్లాడటం పరిపాటిగా మారింది. స్థానిక నేతలు సైతం అధినాయకత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించలేని పరిస్థితి ఏర్పడింది. అందుకు అధికార సంకెళ్లు అడ్డుపడుతున్నాయి. అందుకు ఉదాహరణకు 70ఏళ్ల రాజకీయ చరిత్ర కలిగిన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం ఓటర్లు నాలుగు ముక్కలు అయ్యారు. నాలుగు జిల్లాల పరిధిలోకి వెళ్లిపోయారు. ఇదే అందుబాటులో ఉన్న, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయమని చెప్పడం ఎంతవరకు సబబు. ఈ నిర్ణయాన్ని శాస్త్రీయమంటారా? రాజకీయమంటారా? వైసీపీ హయాంలో లో రాష్ట్రంలో ఉన్న 26జిల్లాలు తాజాగా 28గా మారాయి. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలు వచ్చాయి. 5 కొత్త రెవిన్యూ డివిజన్లు వచ్చాయి. జిల్లాల పునర్విభజన, మార్పులు ,చేర్పులు హేతుబద్ధంగా జరగలేదని విమర్శలు ఎక్కువ వినిపిస్తున్నాయి. భౌగోళికంగా కాకుండా రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా జరిగాయని విమర్శలు వెల్లువేత్తుతున్నాయి. రెవెన్యూ డివిజన్ల ఏర్పాట్లు కూడా ఇష్టం వచ్చినట్లు చేశారు. ముక్కలు ముక్కలుగా చేసి పెట్టారు. రెవెన్యూ డివిజన్లలో కూడా మండలాల సంఖ్య ఇష్టారాజ్యాంగ చేశారు. ఒక జిల్లాలో ఏకంగా 40 మండలాలు ఉంటే ఇంకో జిల్లాలో

**ఎం.రఘునాథ**

కేవలం 11 మండలాలే ఉండడం ఎంతవరకు కరెక్ట్. ఏ జిల్లాలో ఎన్ని మండలాలు ఉండాలన్నది ప్రాతిపదిక లేకుండా నిర్దిష్టమైన విధానం అంటూ లేకుండా నిర్ణయాలు తీసుకుంటూ పోతే ప్రజలు ఏమి కావాలి. ఎందుకంటే అల్లూరి సీతారామ జిల్లాలో 11 మండలాలు, పోలవరం జిల్లాలో 12 , అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 19,పశ్చిమగోదావరి, బాపట్ల జిల్లాలలో 20, కాకినాడ ,మార్కాపురం 21, తూర్పుగోదావరి,




కర్నూలు 22, అనకాపల్లిలో 24 ,అన్నమయ్య జిల్లాలో 25 మండలాలు ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే డివిజన్ల విభజన, జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని చెప్పవచ్చు. అంతే కాదు 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాల పునర్విభజనకు సంబంధించి మార్కాపురం,గూడూరు, రాజంపేట, మదనపల్లె ప్రాంతాల్లో పర్యటించినప్పుడు స్థానికంగా రాజకీయ లబ్ధి కోసం పలు హామీలను గుప్పించారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలను నెరవేర్చకుండా తీసుకొన్న రాజకీయ నిర్ణయాలు ప్రజల్లో ఆందోళనకు దారి తీసింది. ఎందుకంటే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మంచి నిర్ణయం తీసుకుంటామని న్యాయం చేస్తామని చెప్పడం గెలవకపోతే ఎందుకు చేయాలని ప్రజల్ని ఎదురు ప్రశ్న వేయడం సర్వత్ర విమర్శలకు దారితీస్తోంది. ఎందుకంటే ఓటేసిన వారికి న్యాయం చేయాలి. ఓటు వేయని వారికి అన్యాయం చేయాలని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ఆచరణలో అమలు చేయలేమనే వాస్తవం తెలిసినప్పుడు ఆవాస్తవాలు ప్రజలకు ఎందుకు చెప్పాలి. హామీలు ఇచ్చేటప్పుడు ఇది గుర్తుకు రాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజంపేట రెవెన్యూ డివిజన్లో తొమ్మిది మండలాలు ఉండేవి. ప్రస్తుతం నాలుగు మండలాలతో డివిజన్ రాష్ట్రంలోనే అతి చిన్నదిగా మారింది. రాష్ట్రంలో అతిపెద్ద డివిజన్‌గా 11 మండలాలతో అల్లూరి సీతారామరాజు డివిజన్ ఏర్పడింది. అలాగే మరో రెండు డివిజన్ల లో కూడా 11 మండలాలే ఉన్నాయి. అయితే రెండు డివిజన్లు కేవలం ఐదు మండలాలతోనే మిలిగాయి. ఇది ఎలా నిర్దిష్టంగా జరిగిం దని చెప్పచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో జరిగిన పునర్విభజన విమర్శ లకు దారి తీసింది. వైసీపీలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధి ప్రామాణికంగా గూడూరు నియోజకవర్గం మొత్తం తిరు పతిలో విలీనం చేశారు. తాజాగాకూటమి ప్రభుత్వం ఐదు మండలాల్లో గూడూరు, చిల్లకూరు, కోట మండలాలు నెల్లూరు జిల్లాలో విలీనం చేశారు. మిగతా వాకాడు, చిట్టెమురు మండలాలు తిరుపతి జిల్లాలోని కొనసాగిం చారు. భౌగోళికంగా రెండు మండలాలు నెల్లూరు జిల్లాకు దగ్గరగా ఉంటాయి. అయితే రాజకీయ ప్రయోజనాలు ఆశించి తిరుపతి జిల్లాలో కొనసాగించడం విమర్శలకు తావిస్తోంది. ఇది పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయమని రెండు మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో మదనపల్లె ,పీలేరు, తంబళ్లపల్లె ,రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో పుంగనూరు నియోజకవర్గం పరిధిలోని రొంపిచర్ల, పులిచెర్ల మండలాలను చిత్తూరు జిల్లాలో కలి పారు. రాజంపేట నియోజకవర్గాన్ని కడప జిల్లాలో కలిపారు. ఈ నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా వైసిపి హయాంలోనే కడప జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దోటం మండలాలు కడప డివిజన్లో కలిపారు. మిగతా నాలుగు మండలాలు మాత్రమే రాజంపేట డివిజన్‌లో మిగిలిపోయాయి. దీంతో రాష్ట్రంలోనే రాజంపేట రెవెన్యూ డివిజన్ అతి చిన్నదిగా మారింది. మరోవైపు పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపారు. నియోజకవర్గంలోనిసగం మంది పైబడి ప్రజలు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రధానంగా పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట మండలాల ప్రజలు కడప జిల్లా వైపే మొగ్గు చూపు తున్నారు. రైల్వేకోడూరు నియోజక వర్గం తిరుపతి జిల్లాలో కలపడం వల్ల రైల్వే కోడూరు మండల ప్రజలు మాత్రమే సంతోషంగా కనిపిస్తున్నారు. ఇక పార్లమెంట్ నియోజక వర్గం పరిస్థితిని పరిశీలిస్తే రాష్ట్రంలోనే ఏ పార్లమెంట్ నియోజకవర్గం కూడా నాలుగు జిల్లాల పరిధిలో లేదు. రాజకీయ కారణాలతో గతంలో వైసిపి,తాజాగా కూటమి ప్రభుత్వం ఇష్టంవచ్చినట్లు ముక్కలు చేసింది. రాజంపేటపార్లమెంట్ నియోజకవర్గంలోని మెజార్టీ మండలాలు అన్నమయ్య జిల్లా లోనూ, ఆ తర్వాత ఐదు మండలాలు తిరుపతి జిల్లాలోనూ, ఆరు మండలాలు కడప జిల్లాలోను, రెండు మండలాలు మాత్రమే చిత్తూరు జిల్లాలోనూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితు లలో ప్రజలకు పరిపాలనా సౌలభ్యం ఎలా సాధ్యమో పాలకులు చెప్పాలి. ఇకపోతే జిల్లాల పునర్ విభజన తర్వాతకూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనకు రాజకీయ పక్షాలు నాయకత్వం వహిస్తున్నా ప్రజల మనోభావాలు దెబ్బ తింటేనే ఉద్యమ పట్ల ప్రజలు మొగ్గు చూపుతారు. బలవంతంగా ఆందోళనలు ఎల్లకాలం కొనసాగవన్నది అక్షర సత్యం. ఇకపోతే ఏడాదిలోగా దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్ విభజన మరోసారి అలజడి రేపనుంది. ప్రభుత్వం ఎప్పుడు ఏమి చేసినా నిర్దిష్టమైన విధివిధానాలతో విభజన చేస్తేప్రజలు హర్షిస్తారు. అలా కాకుండా రాజకీయ ప్రయోజనాలు, ఆధిపత్యం ధ్యేయంగా విభజనచేస్తే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవు తుంది. పాలపక్షాలకు ఇది శరాఘతంగా మారుతుంది. ●

మరోవైపు పార్లమెంట్ నియోజక వర్గంలోని రైల్వే కోడూరు నియోజక వర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపారు.నియోజక వర్గంలోనిసగం మంది పైబడి ప్రజలు ఈ నిర్ణయాన్ని వ్యతి రేకిస్తున్నారు. ప్రధానంగా పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట మండలాల ప్రజలు కడప జిల్లా వైపే మొగ్గు చూపుతున్నారు. రైల్వేకోడూరు నియోజక వర్గం తిరుపతి జిల్లాలో కలపడం వల్ల రైల్వే కోడూరు మండల ప్రజలు మాత్రమే సంతోషంగా కనిపిస్తున్నారు. ఇక పార్లమెంట్ నియోజక వర్గం పరిస్థితిని పరిశీలిస్తే రాష్ట్రంలోనే ఏ పార్లమెంట్ నియోజకవర్గం కూడా నాలుగు జిల్లాల పరిధిలో లేదు. రాజకీయ కారణాల తో గతంలో వైసిపి,తాజాగా కూటమి ప్రభుత్వం ఇష్టంవచ్చినట్లు ముక్కలు చేసింది. రాజంపేటపార్లమెంట్ నియోజకవర్గంలోని మెజార్టీ మండలాలు అన్నమయ్య జిల్లా లోనూ, ఆ తర్వాత ఐదు మండలాలు తిరుపతి జిల్లాలోనూ, ఆరు మండలాలు కడప జిల్లాలోను, రెండు మండలాలు మాత్రమే చిత్తూరు జిల్లాలోనూ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితు లలో ప్రజలకు పరిపాలనా సౌలభ్యం ఎలా సాధ్యమో పాల కులు చెప్పాలి. ఇకపోతే జిల్లాల పునర్ విభజన తర్వాతకూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఆందోళనకు రాజకీయ పక్షాలు నాయకత్వం వహిస్తున్నా ప్రజల మనోభావాలు దెబ్బ తింటేనే ఉద్యమ పట్ల ప్రజలు మొగ్గు చూపుతారు. బలవం తంగా ఆందోళనలు ఎల్లకాలం కొనసాగవన్నది అక్షర సత్యం. ఇకపోతే ఏడాదిలోగా దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్ విభజన మరోసారి అలజడి రేపనుంది. ప్రభుత్వం ఎప్పుడు ఏమి చేసినా నిర్దిష్టమైన విధివిధానాలతో విభజన చేస్తేప్రజలు హర్షిస్తారు. అలా కాకుండా రాజకీయ ప్రయోజనాలు, ఆధి పత్యం ధ్యేయంగా విభజనచేస్తే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవు తుంది. పాలపక్షాలకు ఇది శరాఘతంగా మారుతుంది.

# కొత్త 'ద్విపాత్రా'భినయం!

పశ్చిమ బెంగాల్

ఒకసారి రెండు పాత్రలు అభినయించగలిగినవారు సినిమాల లోనే ఎక్కువగా కనిపిస్తూంటారు. సినిమా నటులు రాజకీయాల్లోకి వస్తే అవసరమైనప్పుడు అటువంటి ద్విపాత్రాభినయం తేలికగానే చేస్తూంటారు. గతంలో ఎన్టీఆర్‌ను అలా చూశాం.సినిమా రంగంతో సంబంధం లేక పోయినా, అలా ద్విపాత్రాభినయం అలవోకగా చేయగలిగిన ధీర ఇప్పుడు మమతా బెనర్జీ అని చెప్పవచ్చు. గత రెండు మూడు రోజులుగాఆమె కొన్ని సంచలన ప్రకటనలు చేస్తూ అందరి దృష్టి తనవైపు తిప్పుకొంటున్నారు. 'నేనుముఖ్యమంత్రి నే. కానీ ఇప్పుడు ప్రతిపక్ష నేతగా అవతారం ఎత్తాను' అంటూ ఆమె చేసిన ఓ ప్రకటన అసెంబ్లీ ఎన్నికలొస్తున్న వేళ పెద్ద సంచలనమే సృష్టిస్తోంది. నిజానికి అధికారంలో ఉన్నా, ప్రతిపక్ష నేత పాత్రే ఆమెకు ఇష్టం. ఆ పాత్ర అయితేనే గర్జనలకు ఆస్కారం ఉంటుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో ఆమె నిత్యం పోరు జరిపే తీరు అంతా ప్రతిపక్ష నేత తరహాలోనే. అయితే కొంతసేపు ముఖ్యమంత్రిగా, మరికొంత సేపు ప్రతిపక్ష నేతగా విడివిడిగా పాత్రలను రక్తి కట్టించినా, ఇప్పుడు ఒకేసారి రెండు పాత్రలను పోషించవలసిన అవసరం వచ్చినట్లు కనిపిస్తోంది. బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి 'ఐ ప్యాక్' కార్యాలయంలో గత గురువారం ( 8, జనవరి) ఇడి జరిపిన సోదాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఆ ఐప్యాక్ కార్యాలయం, సంస్థ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్ నివాసంలో ఇడి విస్తృతంగా సోదాలు జరిపి కొన్ని ముఖ్యమైన ఫైళ్లను 'స్వాధీనం'చేసుకొంది. అంత వరకు మామూలే. అయితే అదే సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన అనుచర గణం, మందీమార్బలంతో అదే కార్యాలయానికి వచ్చి తాము కూడా కొన్ని ఫైళ్ల 'స్వాధీనం' చేసుకొని తీసుకెళ్లారు. ఆ ఉదంతమంతా రచ్చ రచ్చ అయింది. తాను ముఖ్యమంత్రిగా అక్కడకు వెళ్లలేదనీ, ప్రతిపక్ష నేత అవతారం ఎత్తాననీ, టిఎంసి అధినేత్రి హోదాలో మాత్రమే అక్కడకు వెళ్లి తమ పార్టీకి చెందిన కొన్ని ముఖ్యమైన ఫైళ్లను తెచ్చుకొన్నామనీ ఆమె అంటున్నారు. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో ఐప్యాక్‌లో సోదాల నెపంతో తృణమూల్

**ఎ.వి.వి ప్రసాద్**

కార్యకర్తల డేటాను కేంద్రం తస్కరించిందనీ, అందుకే ఇడితో సోదాలు చేయించిందనీ ఆమె ఆరోపిస్తున్నారు. మర్నాడు శుక్రవారం కోల్‌కతాలో మమతపార్టీ అతిపెద్ద నిరసన ర్యాలీని నిర్వహించడంతో ఆ మహానగరంలో పరిస్థితిమరింత ఉద్రిక్తంగా మారింది. ఆ ర్యాలీలో పార్టీ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలోనే పాల్గొన్నారు. మహిళలంతా శంఖాలు ఊదుతూ జరిపిన ర్యాలీ హోరెత్తిపోయింది. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షా నివాసం వద్ద కూడాతృణమూల్ కార్యకర్తలు,నేతలు పెద్ద ఎత్తున ఆందోళనలు జరిపారు. ఈ మొత్తం దృశ్యంలో ఆమె ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండు భిన్నమైనపాత్రలు పోషిస్తూ అందరిదృష్టిని ఆకర్షించడం విశేషం. ఏపాత్రలో ఉన్నా ఆమెను ప్రజలు మాత్రం ముఖ్యమంత్రిగానే భావిసారు. అంగబలం ఎప్పుడూ తోడుగానే ఉంటుంది. ముఖ్యమంత్రికి ఉండే పూర్తి అధికార సెక్యూరిటీ, అనధికార అనుచరగణం అదే రీతిలో ఉంటారు. కాకపోతే ఆమె మాటల్లో మాత్రమే తేడా కనిపిస్తుంది. ఏదిఏమైనా ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ వాతావరణం ఈ ఉదంతంతో మరింత వేడెక్కినట్లే కనిపించింది. ఇడి అధికారులపై మమత, ఆమెపై ఇడి పరస్పర ఆరోపణలు చేసుకొంటూ రోడ్డెక్కడమే గాక కోర్టు మెట్లు కూడా ఎక్కడంతో అక్కడా అదే పరిస్థితి కనిపించింది. ముఖ్యమంత్రిగా ఆమె చేసిన ఫిర్యాదులతో ఇడి అధికారులపై శుక్రవారం పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ మమతా బెనర్జీ,కొందరు పోలీసు అధికారులపై సిబిఐ దర్యాప్తు డిమాండ్


మమతా బెనర్జీ

చేస్తూ ఇడి కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. బొగ్గు కుంభకోణంలో అమిత్ షా పాత్రఉన్నదనీ, దానికి సంబంధించిన ఫైళ్లను కొల్లగొట్టేందుకే ఐప్యాక్ కార్యాలయంపై ఇడి దాడులు జరిపిందనీ మమత ఆరోపిస్తున్నారు. ఐప్యాక్ కార్యాలయంపై ఇడి దాడుల కేసు విచారణ సందర్భంగా ఇరు పక్షాలకు చెందిన న్యాయవాదులు పరస్పరం ఒకరినొకరు తోసుకోవడంతో కోర్టు హాలులో గందరగోళ వాతావరణం ఏర్పడింది.విచారణ మొదలు కావడానికి ముందే న్యాయమూర్తి కోర్టు హాలు నుంచి వాకౌట్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. జడ్జి సువ్రాఘోష్ పదేపదే హెచ్చరించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. న్యాయవాదులను ఆమె తీవ్రస్థాయిలో హెచ్చరించారు కూడా. కేసుతో సంబంధం లేని న్యాయవాదులు బయటకు వెళ్లిపోవాలనీ, లేనిపక్షంలో తానేవెళ్తాననీ ఆమె గట్టిగానే హెచ్చరించారు.ఎవరు కోర్టు హాలులో ఉండాలో, ఎవరు వెళ్లాలో న్యాయవాదులు తేల్చుకొనేలోగానే పరిస్థితి మరింత ఉద్రిక్తంగామారడంతో చివరికి ఆమే తనసీటు నుంచిలేచి గబగబా వెళ్లిపోయారు.వారిలో కొందరు బిజెపి మద్దతు న్యాయవాదు లైతే, కొందరు తృణమూల్ మద్దతు న్యాయవాదులు కావడంతో 'న్యాయం' కూడా ఆక్రోశించింది. ఐప్యాక్ కార్యాలయంలో ఇడిఅధికారుల నుంచి ఆమె కొన్ని పత్రాలను లాక్కొని వెళ్లినతీరు, కోర్టులో రెండుపక్షాల న్యాయవాదులు వ్యవహరించిన తీరుచూస్తే ఎన్నికలు సమీపించే కొద్దీ ఇంకెన్ని 'విపరీతదృశ్యాలు' చూడవలసివస్తుందోనని పరిశీలకులు భావిస్తున్నారు. అటు కేంద్ర బలగాలు, ఇటు రాష్ట్ర బలగాలు చేస్తున్న హడావుడితో కోల్ కతా ఇప్పటికే ఉద్రిక్తంగా మారిపోయింది. నిరసనప్రదర్శనలతో ప్రతిపక్ష నేతగా,ఆ వెంటనే ముఖ్యమంత్రిగాఎన్నికల ద్విపాత్రాభినయాన్ని మమత బాగానే రక్తి కట్టిస్తున్నారని కూడా పరిశీకులు భావిస్తున్నారు. ముందుముందు ఇంకెన్ని రాజకీయఅభినయాలు, 'విచిత్ర వేషధారణలు' కనువిందు చేస్తాయో చూడాలి. బయట కనిపించే ఉద్రిక్తతలు కోర్టులలోకి కూడాచొరబడడమే విచారించవలసిన అంశం. ●

# గ్రీన్‌లాండ్ కోసం తహతహ

గ్రీన్‌ల్యాండ్

ప్రపంచ దేశాలపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు అత్యంత భద్రతా పూర్వక స్థావరంగా పేర్కొంటున్న గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. యూరోపియన్ యూనియన్‌లోని డెన్మార్క్‌లో భాగమే అయినా కూడా గ్రీన్‌ల్యాండ్ స్వతంత్ర ద్వీపకల్పదేశంగా కొనసాగుతోంది. కేవలం 57 వేల మంది మాత్రమే జనాభా ఉన్న ఈ దేశాన్ని స్వాధీనం చేసుకుంటే చైనా, రష్యా,ఇతర దేశాల నుంచి ఎదురయ్యే భద్రతా పూర్వక ముప్పును సులువుగా అధిగమించవచ్చని ట్రంప్ భావిస్తున్నారు. ప్రపంచంలోనే అతితక్కువ జనాభా కలిగిన ఈ దేశం మెజార్టీ అంతా కూడా తీరప్రాంతమే. రాజధాని నూక్ నగరంలోనే 20 వేలమంది జనాభా ఉన్నారు. మొత్తం జనాభాలో వీరి వాటా 35శాతం మాత్రమే. అత్యధికంగా గ్రీన్ ల్యాండర్లే ఇక్కడ ఉంటారు. మైనార్టీల్లో డ్యానిష్, ఇతర సంచారజాతుల ప్రజలుంటుంటారు. ఆదేశ జిడిపి 3.33 బిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం కూడా 58,499 అమెరికా డాలర్లు. ఎక్కువగా మత్స్యసంపద ఎగుమతులపైనే ఈ దేశం ఆధారపడింది. 90శాతం ఎగుమతుల్లో మత్స్య సంపదే ఉంటుంది.ఇవికాకుండా బంగారం,ముడి ఇనుము, అరుదైన భూ ఖనిజవనరులు ఇక్కడ లభిస్తాయి. అంతేకాకుండా పర్యాటక రంగంపైనా ఈ దేశానికి అత్యధిక ఆదాయం సమకూరుతోంది. మొత్తం 21లక్షల 66వేల చదరపు కిలోమీటర్లలో 4,10,449 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఐస్‌లేని ప్రాంతంగా ఉంటుంది. మిగిలిన భూభాగం మొత్తం హిమనీనదాలతో నిండిపోయి ఉంటుంది. ద్వీపదేశం కావడంతో గ్రీన్‌ల్యాండ్‌కు 44 వేల చదరపు కిలోమీటర్ల తీరం ఉంటుంది. ఇప్పటికే ఈ ద్వీపదేశంలో ఒక ప్రాంతాన్ని అమెరికా తన సైనిక స్థావరంగా వినియోగిస్తూ 'పిటుఫిక్‌స్పేస్‌బేస్' స్థావరం నుంచే వైమానిక దళాలను ఆపరేట్ చేస్తోంది. ఇప్పుడు ట్రంప్ యోచన మొత్తం గ్రీన్‌ల్యాండ్‌నే స్వాధీనం చేసుకోవాలనే ఉంది. అందుకోసం ఈ మొత్తం దీవి ప్రజలకు డబ్బులు ఎరవేయాలనే ఆలోచనఉంది. ఒక్కొక్కరికి 10 వేల డాలర్లనుంచి అవసరమైతే లక్షకుపైగా డాలర్లు అంటే మన కరెన్సీలోరూ.8 లక్షల నుంచి రూ.89 లక్షలవరకూ ఎరవేసి

**గన్ని మోహన్**

అయినా దీవిని స్వాధీనం చేసుకోవాలని లేదంటే వెనిజులా తరహాలోనే సైనిక చర్యలు తప్పవని బాహాటంగానే హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇప్పటికే తనకు సరిహద్దుగా ఉన్న మెక్సికోపై సైనిక చర్యనుప్రకటించిన ట్రంప్ ఇప్పుడు హడావిడిగా గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసేసుకోవాలని తహతహలాడుతున్నారు. అత్యాధునిక రక్షణ వ్యవస్థలు కలిగిన అమెరికా పెంటగాన్ ఇక్కడ శాశ్వత స్థావరాలు ఉండాలని సిఫారసులుచేసింది. అంతేకాకుండా గ్రీన్ ల్యాండ్‌లో అపారమైన అరుదైన ఖనిజవనరులు అత్యధికంగా లభిస్తాయి. స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ వాహనాలు, సైనిక హార్డ్ వేర్ ఉత్పత్తికి కీలకమైన నిక్షేపాలు ఇక్కడ అపారంగా ఉన్నాయి. చైనా, అమెరికా కంటే ఎక్కువ అరుదైన ఖనిజాలు ఉత్పత్తి చేస్తోంది. ఈ చిన్న దేశంపై ఇప్పటికే చైనా, రష్యాలు కన్నేసాయని, ఆర్కిటిక్ ప్రాంతంలో అమెరికాతోపాటు ఇతర పెద్దదేశాల భద్రతకు ఈ ద్వీపదేశం తమకు ఎంతో కీలకమని ట్రంప్ వాదిస్తున్నారు. వెనిజులా స్వాధీనం చేసుకున్న తర్వాత ఇప్పుడు ట్రంప్ కళ్లన్నీ కూడా మెక్సికో, కొలంబియా, క్యూబా దేశాలపై ట్రంప్ ఫోకస్ పెరిగింది. ఈ దేశాలను నయాన్నోభయాన్నో దారికి తెచ్చుకోవాలని ఆదేశాల్లో కూడా అమెరికా పాలన ప్రారంభించాల్సిందేనన్న ధృఢమైన విస్తరణ కాంక్ష అమెరికా పాలకుల్లో కనిపిస్తోంది.అదే భావన అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ కూడా వ్యక్తం చేసారు. ఇప్పుడు ట్రంప్ ఫోకస్ మొత్తం గ్రీన్‌ల్యాండ్‌పైనే ఉంది. ఉత్తర అట్లాంటిక్‌లో ఈ దేశం అత్యంత వ్యూహాత్మకంగా ఉంటుంది.ఆర్కిటిక్ వలయానికి గ్రీన్‌ల్యాండ్ ప్రవేశద్వారంగా ఉంటుంది. మంచుకరిగి కొత్త నౌకా మార్గాలు


గ్రీన్‌ల్యాండ్

కూడా తెరుచుకుంటాయి. అయితే గ్రీన్‌ల్యాండ్ ప్రధాని జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ఇందుకు భిన్నంగా మాట్లాడుతున్నారు. స్వాధీనం అంటూ వస్తే ముందు కాల్పులు జరుపుతామని ఆ తర్వాతనే చర్చలు జరుపుతామని అదే డెన్మార్క్ ఒప్పందంలోనే ఉందని గుర్తుచేస్తూ హెచ్చరికలు చేసారు. అంతర్జాతీయ చట్టాలను పట్టించుకోననిచెపుతున్న ట్రంప్‌నకు ఈ చిన్నదేశం కూడా తీవ్రస్థాయిలోనే హెచ్చరికలు చేయడంతో ట్రంప్ సవాల్‌గా తీసుకుని దేశం మొత్తం ఆక్రమించేసుకుంటారన్నది ఐరోపా ఖండంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ మా దేశాన్ని స్వాధీనం చేసుకోవాలని చూస్తే నాటో అంతానికి ఆరంభంఅయినట్లేనని కూడా గ్రీన్‌ల్యాండ్ హెచ్చరికలు చేసింది. అయితేట్రంప్‌కు ఇవేమీ పట్టడంలేదు. ముందు గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం చేసుకోవడం అక్కడ అమెరికా నేవల్, ఎయిర్‌బేస్, ఆర్మీబేస్‌లను ఏర్పాటు చేసుకుంటూ చైనా, అమెరికా ఇతర శత్రుదేశాల నుంచి వచ్చే ముప్పును సులువుగా ఎదుర్కొనగలమని పైపైకి చెపుతున్నా గ్రీన్‌ల్యాండ్‌లో ఉన్న అపారమైన, అరుదైన ఖనిజ నిక్షేపాలపైనే అమెరికా కన్నేసిందని నిస్సందేహంగా భావించవచ్చు. గ్రీన్‌ల్యాండ్ ప్రజలు మాత్రం డెన్మార్క్ నుంచి విడిపోతే ఆర్థిక భారంతోపాటు అనేక సమస్యలుంటాయని, అక్కడి ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. స్వతంత్ర రిఫరెండమ్ నిర్వహణకు కూడా మనస్కరించడంలేదు. డెన్మార్క్ నుంచి విడిపోయేందుకు గ్రీన్‌ల్యాండ్‌లో కొంత శాతం ప్రజలు సుముఖంగా ఉన్నా అమెరికాతో కలిసేం దుకు మాత్రం అంగీకరించడం లేదు. భారీ సొమ్ములు ముట్టజెపితే సంచార జాతుల ప్రజలు అమెరికా పట్ల మొగ్గుచూపించే ప్రమాదం ఉందన్న భావన కూడా అక్కడి ప్రజల్లో వ్యక్తం అవుతోంది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ వేస్తున్న సొమ్ముల ఎర ఫలితాలిస్తుందన్న భయాందోళనలు గ్రీన్‌ల్యాండర్లలో పెరిగిపోయాయి. ఇప్పుడు ట్రంప్ కదలికలపై అటు ఐరోపా కూటమి, ఇటు గ్రీన్‌ల్యాండ్ ఏవిధంగా స్పందిస్తాయో వేచి చూడాలి మరి. ●

# ప్రమాదాలతో రక్తసిక్తమవుతున్న రహదారులు!


డా.పోలం సైదులు

ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వార్త లేకుండా దినపత్రిక ఉండదనడంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.దేశంలో ప్రతి సంవత్సరం 5లక్షలకుపైగా రోడ్డుప్రమాదాలు జరుగుతుంటే 1.5 లక్షలకుపైగా మరణిస్తున్నారు. ఒకరోజుకు 1200లకు పైగా రోడ్డుప్రమాదాలు జరుగుతుంటే అందులో 400లకుపైగా మరణిస్తున్నారు. అందులో 20నుండి 30 సంవత్సరాల వయసులో ఉన్నవారు 30శాతం ఉండడం బాధాకరం. తెలంగాణ రాష్ట్రంలో ప్రతిఏటా సుమారు 20వేలకు పైగా రోడ్డుప్రమాదాలు జరుగుతుంటే అందులో ఆరువేలకు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు.అందులో 20-30శాతం మద్యంమత్తులో జరుగుతుంటే, అత్యధికశాతం అతివేగం కావడం విచారకరం. ఈమధ్య జరిగిన కొన్ని సంఘటనలు పరిశీలిస్తే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ దగ్గర హైదరాబాద్-బీజాపూర్ హైవేపై ఉదయంపూట జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో రాంగ్ రూట్‌లో అతివేగంతో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో బస్సు సగభాగం నుజ్జునుజ్జు అయ్యింది. బస్సును ఢీకొట్టిన టిప్పర్ వావాహనం బస్సుపై బోల్తా పడడంతో 19మంది మృత్యువాత చెందారు. అందులో ఒకే కుటుంబానికిచెందిన ముగ్గురు అక్కచెల్లెళ్లు చనిపోవడం అందరిని కలిచి వేసింది. అలాగే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు సుమారు 40 మంది ప్రయాణికులతో బయలుదేరి కర్నూలు జిల్లా సమీపంలోకి రాగానే జాతీయరహదారిపై ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న వెంటనే బస్సులో మంటలు చెలరేగి క్షణాల్లోనే బస్సుమొత్తం అగ్నిగోళంగా మారి, 28మంది ప్రయాణికులను సజీవదహనం చేసిన ఘోరవిషాదం ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో చోటుచేసుకోవడం యావత్తు జాతిని తీవ్రఆందోళనలకు గురిచేసిందని చెప్పవచ్చు. గతంలో తెలం గాణ రాష్ట్రంలో చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖుల కుమా రులు, రాజకీయనాయకుల పుత్రసంతానం రోడ్డుప్రమాదం లో చనిపోయినప్పుడు ఎంతో చర్చ జరిగి,త్వరలోనే ప్రమా దాన్ని అరికట్టే చర్యలను తెలిపేవారు. కానీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు మళ్లీ పునరావృతం అవుతూనే ఉన్నాయి. సాధారణ కుటుంబాలకు చెందిన వారెందరో ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ తగినంత ప్రాధాన్యతలేక వెలుగులోకి రానీ సంఘటనలెన్నో జరుగుతున్నాయి. ఏది ఏమైనా ప్రాణంవిలువ వెలకట్టలేనిది, తల్లిదండ్రులశోకాన్ని ఎవరు తగ్గించలేరు. వారి కుటుంబలోటును ఎవరుపూడ్చ లేరు. ఇంకా రాష్ట్రంలో జరిగిన ప్రమాదాలను చూస్తే, గచ్చిబౌలిలో డ్రంకన్ అండ్ డ్రైవ్‌తో అతివేగం కారణంగా చెట్టును ఢీకొన్న కారు రెండుముక్కలై,ముగ్గురి ప్రాణాలను బలిగొన్నది. కామారెడ్డి జిల్లాలో ఆగివున్నలారీని అతివేగంతో వస్తున్న క్వాలిస్ ఢీకొట్టడంతో హైదరాబాద్‌కు చెందినరెండు కుటుంబాలలోని తొమ్మిదిమంది అక్కడికక్కడే దుర్మరణంచెందటం, అదేజిల్లాలో బైక్‌పై అతివేగంతో నడుపుతూ అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొట్టి ఇద్దరూ యువకులు మరణించడం, ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నోమరెన్నో సంఘటనలుపునరావృతం అవుతూనే ఉన్నాయి. ఉదయం ఇంటి నుండి బయలుదేరామా? సాయంకాలం ఇంటికెళ్ళేదాకా మనిషి జీవితానికి భద్రతా లేకుండాపోయింది. రోడ్డుప్రమాదంలో ఒక్కొక్కసారి ఎంతజాగ్రత్తగా వ్యవహరించిన మృత్యువు ఏ సమయంలో ఎలా దాపురిస్తుందో ఎవ్వరికి తెలియని పరిస్థితి, కేవలం వాహనాదారులే ప్రమాదాలకు గురిగాకుండా ఒక్కొక్కసారి అమాయక పాదాచారుల ప్రాణాలు వాహనాలకు బలైపోవడం గమనించవచ్చు. ముగ్గురుఎక్కే ఆటోలో పదిమందిని ఎక్కించడం, ఇద్దరెక్కే మోటార్ సైకిలుపై ఐదారుగురు ఎక్కడం, హెల్మెంట్స్, సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం,రోడ్డుభద్రత నియమాలు పాటించకపోవడం,త్రాగి వాహనం నడపడం, మొబైల్‌లలో మాటాడుతూ వాహనం నడపడం, అస్తవ్యస్తమైన రోడ్లు, ఇలాంటి సందర్భాలలో ప్రమాదాలకు గురి



కావాల్సి వస్తుంది. జాతీయరహదారులపై కార్లు,ఆటోలు, బైకులు ఇలా ఎన్నోరకాల వాహనాలు ప్రమాదాలకు గురై ఎంతోమంది ప్రాణాలు గాలిలో కలిసి పోతుండటంలో గల అంశాలను పరిశీలిస్తే. ప్రమాదాలు ఎక్కువగా విశాలమైన నాలుగుమార్గాల రోడ్డు,ఔటర్ రింగు రోడ్డులపై ఎక్కువగా జరుగుతుంటాయి.శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానాన్ని పురస్కరించుకోని శాస్త్రవేత్తలు ఎన్నోరకాలైన వాహనాలు కనిపెడుతూ, తయారు చేస్తుంటారు.లక్షలు లక్షలుపెట్టి వాహనాలు తీసుకొని నిదానంగా వెళ్లకుండా అతివేగంతో వెళ్లి రెప్పపాటు క్షణంలో నియంత్రణకోల్పోయి, ఏం జరుగుతుందో అని ఆలోచించకముందే ప్రాణాలను కోల్పోయే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగడంలో అతివేగం ఎంత ప్రాధాన్యత సంతరించుకున్నదో మద్యంకూడా అంతే ప్రాధాన్యత కలిగివున్నది.ఇంకొన్ని ప్రమాదాలు మద్యంమత్తులో వాహనాలను నడుపుతూ విచక్షణజ్ఞానాన్ని కోల్పోయి ప్రమాదాలబారిన పడుతుంటారు.కొన్ని సర్వేలను పరిశీలిస్తేప్రమాదాలలో ప్రాణాలను కోల్పోయినవారిలో అత్యధికం యువతే ఉండటం బాధాకరం.తల్లిదండ్రులు పిల్లలను గారాభంగా పెంచి, అడిగిందల్లా ఇప్పించడం,వారికీ అడిగినంత సొమ్ము ఇవ్వడం వారు వివిధ చెడువ్యసనాలకు అలవాటుపడటం, ఎవ్వరికి భయపడకుండా మొండిగా తయారు కావడం లాంటివి చూస్తుంటే వారే తమప్రాణాలకు ముప్పును 'కొని' తెచ్చుకుంటున్నారనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. ఫోన్లల్లో మాటాడుకుంటూ డ్రైవింగ్ చేయడం వలన కూడా ఎన్నోప్రమాదాలు జరుగుతున్నాయని ఎన్నోసర్వేలు సెలవిచ్చాయి. నేటి ఆధునిక యుగంలో అభివృద్ధి చెందుతున్న శాస్త్ర,సాంకేతికరంగాన్ని ఉపయోగించుకుంటూ ప్రపంచంలో ఏ మూలాన ఏంజరిగినా క్షణంలో తెలిసిపోతుంది. నగరాలల్లో కూడళ్ల వద్ద, ఘాట్స్ రోడ్స్‌వద్ద ఫోన్లలల్లో సంభాషించుకుంటూ ప్రమా దానికిగురై ప్రాణాలు కోల్పోతున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్ లలో రికార్డుకావడం మనం గమనిస్తూనే ఉంటాం.కార్లలల్లో అతివేగంగా గంటకు 150 కి.మీవేగంతో ప్రయాణించడం, సీటుబెల్టు పెట్టుకోకపోవడం,ఆ సమయంలో సేఫ్టీ ఫీచర్స్ పనిచేయకపోవడం లాంటివి రహదారిని రక్తసికంగా మారుస్తుంటాయి. కొన్ని సంధర్భాలల్లో అతివేగంగా ప్రయాణించే టప్పుడు ఆకస్మికంగా గుండెపోటు, రక్తపోటు లాంటివి వచ్చిన, ఏమైనా మానసికపరమైన ఆందోళనలతో వాహా నాలను నడుపుతున్న సందర్భంలో ఇలాంటి ప్రమాదాలు జరిగే ఆస్కారముంటుంది. బైకులపై ఎక్కువ మంది ప్రయా ణించడం,హెల్మెట్ ధరించకపోవడమనేది ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు సులభంగా ప్రాణం పోవడానికి దోహదపడుతుంది. ప్రత్యేకంగా రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జాతీయ రహదారులపైననే జరుగుతుంటాయి. అస్తవ్యస్తమైన రోడ్ల వల్లకావొచ్చు, ఘాట్‌రోడ్డులు ఎక్కువగా ఉండటం, అదే విధంగా అతివేగం,రహదారులు వంకరటింకరగా వుంటూ ఎలాంటి ప్రమాదనివారణ బోర్డులు లేకపోవడం వలనకూడా ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశమున్నది. రోడ్డు భద్రత అధికారులు సరిగ్గా సరైనసమయంలో సక్రమంగా స్పదించకపోవడం,వారికీ సైతం ప్రభుత్వం సహకరించకపోవడం మూలంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రభుత్వం ప్రమాదాల నివారణకు కఠినమైన చట్టాలను వినియోగించాలి. డ్రైవర్లకు లైసెన్సు జారీచేసేటప్పుడు ప్రభుత్వం అమలుపరిచే చట్టాలపై అవగాహన కల్పించాలి.వారందరికీ సూచనలిస్తూ,చట్టాలను అతిక్రమిస్తే జరిగే నష్టాన్ని ముందు గానే తెలియజేయాలి. రోడ్డుభద్రత అధికారులు రోడ్లను జాగ్రత్తగా పరిశీలిస్తూ,ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయి స్తుండాలి. ప్రధానకూడలి వద్ద జీబ్రాక్రాసింగ్,ట్రాపిక్ సిగ్న ల్స్ ఉంచుతూ సక్రమంగా పనిచేసేలా చూస్తుండాలి. బైకు లపై ప్రయాణించే వారికీ హెల్మెట్ వాడకం తప్పనిసరిగా చేయాలి.ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు అధికార దుర్వినియోగం చేయకుండా అందరిని సమానంగా చూస్తూ,చట్టాలను కఠినంగా అమలుపరుస్తుండాలి. కార్లల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ పెట్టుకొని, మితిమీరిన వేగంతో వెళ్ళవద్దు. తమకంటూ కుటుంబం ఉంటుందని, తమ కేమన్నైతే వారు వీధుల్లో పడతారనే ధోరణితోఆలోచించాలి. మద్యం సేవించి,ఫోన్లో మాట్లాడుతూ, సరైననిద్రలేకుండా, అలసటతో,మానసిక ఆందోళనలతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదం జరిగే అవకాశమున్నది. కావున వీటిని విడనాడి వాహనం నడపడం మంచిది. ●

# గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం తథ్యం

## చమురు సంస్థల ప్రతినిధులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## భారత్, పాక్ యుద్ధం నేనే ఆపానంటూ మళ్లీ అదేమాట








**వాషింగ్టన్, జనవరి 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్కిటిక్ ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు బలప్రయోగానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. డెన్మార్క్‌కు చెందిన ఈ స్వయంప్రతిపత్తి గల ద్వీపంపై ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఆయన తోసిపుచ్చారు. నిన్న వైట్‌హౌస్‌లో చమురు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. డెన్మార్క్‌కు నచ్చినా నచ్చకపోయినా, గ్రీన్‌ల్యాండ్ విషయంలో మేం ఏదో ఒకటి చేయబోతున్నాం. సులభమైన మార్గంలో ఒప్పందం చేసుకోవడానికే నేను ఇష్టపడతాను. కానీ, ఆ మార్గంలో పని జరగకపోతే, కఠినమైన మార్గాన్ని ఎంచుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. ఆర్కిటిక్‌లో రష్యా, చైనాల సైనిక కార్యకలాపాలు పెరుగుతున్నాయని, అమెరికా జాతీయ భద్రతకు గ్రీన్‌ల్యాండ్‌ను నియంత్రించడం చాలా కీలకమని ఆయన అన్నారు. మనం ఏమీ చేయకపోతే రష్యా లేదా చైనా గ్రీన్‌ల్యాండ్‌ను ఆక్రమిస్తాయి. దానిని మేం జరగనివ్వం. అందుకే మంచిమాటలతో లేదా మరో కఠిన మార్గంలోనో గ్రీన్‌ల్యాండ్‌తో ఏదో ఒకటి చేస్తామని ట్రంప్ వివరించారు. ట్రంప్ బెదిరింపులపై డెన్మార్క్, ఇతర యూరప్ దేశాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. గ్రీన్‌ల్యాండ్‌పై దాడి జరిగితే నాటో సహా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన భద్రతా వ్యవస్థ మొత్తం కూలిపోతుందని డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సెన్ హెచ్చరించారు. అయితే, ఈ ఆందోళనలను ట్రంప్ తేలిగ్గా తీసుకున్నారు. 500 ఏళ్ల క్రితం వాళ్ల పడవ అక్కడికి చేరినంత మాత్రాన ఆ భూమి వాళ్లది అయిపోదు కదా అని వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై చర్చించేందుకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వచ్చే వారం డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్ ప్రతినిధులతో సమావేశం కానున్నారు.

### 50 సార్లు పైనే అదే మాట..

భారత్‌పాకిస్థాన్ మధ్య 2025లో తలెత్తిన తీవ్ర ఉద్రిక్తతలను తానే అడ్డుకున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ప్రకటించారు. వైట్‌హౌస్‌లో చమురు సంస్థల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన జోక్యం లేకపోతే ఇరు దేశాల మధ్య అణుయుద్ధం జరిగేదని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ప్రధాని స్వయంగా తన వద్దకు వచ్చి ట్రంప్ చొరవ వల్ల కనీసం కోటి మంది ప్రాణాలు దక్కాయని బహిరంగ ప్రకటన చేశారని ఆయన గుర్తుచేశారు. తన హయాంలో ఇప్పటివరకు ఎనిమిది పెద్ద యుద్ధాలను పరిష్కరించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. చరిత్రలో నాకంటే ఎక్కువగా నోబెల్ శాంతి బహుమతికి అర్హులు ఎవరూ లేరు. 30 ఏళ్లుగా నలుగుతున్న సమస్యలను కూడా నేను పరిష్కరించాను. భారత్‌పాక్ మధ్య అప్పటికే ఎనిమిది యుద్ధ విమానాలు కూలిపోయాయి, పరిస్థితి అదుపు తప్పుతున్న వేళ నేను రంగంలోకి దిగి యుద్ధం రాకుండా ఆపానని వివరించారు. శాంతి బహుమతుల కంటే ప్రాణాలు కాపాడటమే తనకు ముఖ్యమని, తాను కోట్ల మందిని కాపాడానని పేర్కొన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలను భారత్ మొదటి నుంచీ ఖండిస్తూనే ఉంది. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోవడంతో భారత్ మే 7న ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాక్ భూభాగంలోని తొమ్మిది ఉగ్రవాద మౌలిక సదుపాయాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. ఈ క్రమంలో భారత సైనిక సత్తాకు భయపడి మే 10న పాక్ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) స్వయంగా భారత అధికారులను సంప్రదించి కాల్పుల విరమణ కోరారని భారత్ చెబుతోంది. ఇందులో మూడో పక్షం జోక్యం ఏమీ లేదని భారత విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేస్తోంది.

### అమెరికాకు లొంగేది లేదు: గ్రీన్‌ల్యాండ్ తీర్మానం

నూక్,(గ్రీన్‌ల్యాండ్) జనవరి 10: అమెరికా ప్రభుత్వానికి లొంగిపోయేది లేదని, ఆ దేశంతో తాము కలవబోమని గ్రీన్ ల్యాండ్ పార్లమెంట్ తీర్మానం చేసింది. ఈ మేరకు పార్లమెంట్ లోని అన్ని పార్టీలు కలిసి శుక్రవారం నిర్ణయం తీసుకున్నాయి. ఆర్కిటిక్ ద్వీప దేశమైన గ్రీన్ ల్యాండ్ ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన కూడా చేశాడు. సైనిక చర్య లేదా ఆ దేశాన్ని కొనుగోలు చేయడం ద్వారానైనా గ్రీన్ ల్యాండ్ ను స్వాధీనం చేసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని ట్రంప్ ప్రకటించారు. అవసరమైతే ఒక్కో పౌరుడికి పదివేల నుంచి లక్ష డాలర్లు ఇచ్చేందుకు కూడా సిద్ధమని చెప్పారు. అంటే మన కరెన్సీలో రూ.8 లక్షలనుంచి రూ.80 లక్షలవరకూ ఉంటుంది. తమ పొరుగు దేశం గ్రీన్‌లాండ్ ఇకపై చైనా లేదా రష్యా పరం కావడం ఇష్టం లేదన్నారు. తమ చర్య అక్కడి ప్రజలకు నచ్చినా నచ్చకపోయినా తాము అనుకున్నది చేస్తామని ట్రంప్ వ్యాఖ్యానించాడు. అయితే, ట్రంప్ నిర్ణయంపై నాటో దేశాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. గ్రీన్ ల్యాండ్ సార్వభౌమత్వానికి మద్దతుగా స్పందించాయి. ఇదే సమయంలో గ్రీన్ ల్యాండ్ కూడా స్పందించింది. పార్లమెంట్లో సమావేశమైన అన్ని పార్టీలు అమెరికా నిర్ణయానికి వ్యతిరేకంగా తీర్మానం చేశాయి. తాము అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదని, గ్రీన్ ల్యాండర్లుగానే ఉండాలనుకుంటున్నామని ప్రజా ప్రతినిధులు ప్రకటించారు. అదే సమయంలో డెన్మార్క్ కంట్రోల్ లో కూడా ఉండాలని కోరుకోవట్లేద న్నారు. మేం అమెరికన్లుగానో, డేన్స్ గానో ఉండాలనుకోవడం లేదు. గ్రీన్ ల్యాండర్లుగానే ఉండాలనుకుంటున్నాం. గ్రీన్ ల్యాండ్ భవిష్యత్తును నిర్ణయించేది మా దేశ పౌరులే అని అక్కడి పార్లమెంట్ తీర్మానం చేసింది. మరోవైపు గ్రీన్ ల్యాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఏ దారినైనా ఎంచుకునేందుకు సిద్ధమని అమెరికా ప్రకటించింది.

## మేం అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదు

### గ్రీన్‌లాండ్ రాజకీయ పార్టీల ప్రకటన

**నుక్, జనవరి 10:** వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురో ఘటన తర్వాత గ్రీన్‌లాండ్ పేరు వార్తల్లో ఎక్కువగా వినిపిస్తోంది. దానిని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమనుకుంటే సైనిక ఆప్షన్‌ను పరిశీలిస్తామని ఆయన యంత్రాంగం ఇప్పటికే పేర్కొంది. ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్ రాజకీయ పార్టీలు ఒక్కతాటిపైకి వచ్చాయి. తాము అమెరికన్లుగా ఉండాలనుకోవడం లేదని, తమ భవిష్యత్తును నిర్ణయించుకునే అధికారం తమ చేతుల్లోని ఉందని స్పష్టం చేశాయి. దానికి సంబంధించిన ప్రకటనపై ఆ పార్టీల నేతలు సంతకాలు చేశారు. గ్రీన్‌లాండ్ భవిష్యత్తును ఈ ద్వీప ప్రజలే నిర్ణయిస్తారని వెల్లడించారు. గ్రీన్‌లాండ్ గురించి ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ ఒకసారి అక్కడి ప్రజలు ఇష్టపడినా, పడకపోయినా ఆ ద్వీపం విషయంలో ఒక నిర్ణయం తీసుకోబోతున్నామని మరోసారి.. ట్రంప్ ఇలా వరుసుగా హెచ్చరికలు చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ చుట్టూ ఉన్న జలాల్లో ఇప్పటికే చైనా, రష్యా తమ నౌకలను మోహరించి ఉన్నాయని అమెరికా దానిని స్వాధీనం చేసుకోకపోతే ఆ పనిని చైనా, రష్యాలు చేస్తాయని ఆయన పేర్కొన్నారు. అందువల్లే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి కఠిన మార్గాలు ఎంచుకోవడానికి సిద్ధంగా ఉన్నామనన్నారు. అలాగే అక్కడి ప్రజలకు డబ్బును ఎరగా వేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బెదిరింపులను గ్రీన్‌లాండ్‌తో పాటు డెన్మార్క్ తిప్పికొడుతోంది. డెన్మార్క్‌తో పాటు మరో రెండు స్వయంప్రతిపత్తి ప్రాంతాలపై గ్రీన్‌లాండ్, ఫారోదీవుల్ని కలిపి 'డెన్మార్క్ లేదా డానిష్ కింగ్‌డమ్'గా పిలుస్తారు.



## సిబిఐ వలలో సిపిఆర్ఐ జాయింట్ డైరెక్టర్

### ప్రైవేటు సంస్థ నుంచి రూ.9.50 లక్షలు లంచం

**బెంగళూరు, జనవరి 10:** కేంద్ర విద్యుత్ పరిశోధనా సంస్థ (సీపీఆర్ఐ)లో భారీ అవినీతి తిమింగలం సీబీఐకి చిక్కింది. సీపీఆర్ఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చెన్ను రాజారామ్ మోహన్‌రావు ఒక ప్రైవేటు సంస్థ నుంచి రూ. 9.50 లక్షలు లంచం తీసుకుంటుండగా అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో పాలుపంచుకున్న సుధీర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ అతుల్ ఖన్నాను కూడా సీబీఐ అదుపులోకి తీసుకుంది. అరెస్ట్ అనంతరం రాజారామ్ నివాసంలో నిర్వహించిన సోదాల్లో భారీగా అక్రమ ఆస్తులు వెలుగు చూశాయి. ఆయన ఇంట్లో కట్టల కొద్దీ ఉన్న రూ. 3.59 కోట్ల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు అమెరికన్ డాలర్లు, యూరోలు, యూఏఈ దిర్హామ్‌లు సహా మొత్తం 9 దేశాలకు చెందిన సుమారు రూ. 4.05 లక్షల విలువైన విదేశీ కరెన్సీని గుర్తించారు. వీటితో పాటు విలువైన నగలు, కీలక పత్రాలను సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు జరిపిన తనిఖీల్లో మొత్తం రూ. 3.76 కోట్ల విలువైన నగదు, కరెన్సీ లభించినట్లు అధికారులు వెల్లడించారు. సుధీర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ తయారు చేసే విద్యుత్ పరికరాలకు అనుకూలంగా టెస్టింగ్ నివేదికలు ఇచ్చేందుకు రాజారామ్ లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ గుర్తించింది. దీనిపై జనవరి 8న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అధికారులు వ్యూహాత్మకంగా మాటు వేసి లంచం తీసుకుంటుండగా నిందితులను పట్టుకున్నారు. కేంద్ర విద్యుత్ శాఖ పరిధిలోని అత్యున్నత పరిశోధనా సంస్థలో ఇలాంటి అవినీతి జరగడం సంచలనంగా మారింది. ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయని, మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని సీబీఐ అధికారులు తెలిపారు.

## పిల్లలులేని మహిళలను తల్లిని చేస్తే రూ.10 లక్షలు

### ఇదో కొత్త తరహా ఆన్‌లైన్ మోసం



**పాట్నా, జనవరి 10:** పిల్లలు కలగని మహిళలను తల్లిని చేస్తే రూ.10 లక్షలు ఇస్తామంటూ ఆన్ లైన్ లో ప్రకటన ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ పేరుతో కనిపించే ఈ ప్రకటన చూసి బీహార్ లో చాలామంది మోసపోయారు. ఆ ప్రకటనలోని ఫోన్ నెంబర్ కు కాల్ చేసిన వారికి మాయమాటలు చెప్పి భారీ మొత్తంలో దండుకున్నారు ఇద్దరు మోసగాళ్లు. ఇందులో ఒకరు మైనర్ కావడం గమనార్హం. మోసపోయామని తెలిసినా పరువుపోతుందని కొంతమంది మౌనాన్ని ఆశ్రయించగా మరికొందరు మాత్రం పోలీసులను ఆశ్రయించారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు, నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. మహిళలను ప్రెగ్నెంట్ చేయాలంటూ గాలం వేయడం విచిత్రంగా ఉంది. పిల్లలు కలగక బాధపడుతున్న మహిళలను తల్లులు చేయాలంటూ ఆకర్షణీయమైన మోడళ్ల ఫొటోలతో నిందితులు ఆన్ లైన్ లో ప్రకటనలు గుప్పించారు. ఆల్ ఇండియా ప్రెగ్నెంట్ జాబ్ పేరుతో తాము దేశవ్యాప్తంగా సేవలందిస్తున్నామని, ఏ రాష్ట్రానికి చెందిన వారికైనా తాము జాబ్ ఇస్తామని చెప్పారు. ఈ ప్రకటన చూసి ఫోన్ చేసిన వారిని తాము చెప్పిన మహిళను ప్రెగ్నెంట్ చేస్తే రూ.10 లక్షలు ఇస్తామని, ఒకవేళ ఆ ప్రయత్నంలో విఫలమైతే అందులో సగం ఇస్తామని ప్రలోభపెట్టారు. అయితే, ఇందుకోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనికి కొంత రుసుము చెల్లించాలని చెప్పారు. పని పూర్తయితే పది లక్షలు సొంతమవుతాయని కొందరు లక్షల మాటెలా ఉన్నా సుఖం దక్కుతుందని మరికొందరు ఈ మోసగాళ్ల వలకు చిక్కారు. నిందితులు చెప్పినట్లు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించగా తర్వాత హోటల్ టారిఫ్ అంటూ మరికొంత చెల్లించాలని అడిగేవారు. ఇలా ఓ ఫీజు చెల్లించాక మరో పేరుతో ఫీజు వసూలు చేసేవారు. మోసపోయామని బాధితులు గుర్తించేదాకా ఈ తంతు ఇలాగే కొనసాగేది.

## రూర్కెలాలో కుప్పకూలిన ఛార్టర్డ్ విమానం

**రూర్కెలా, జనవరి 10:** ఒడిశాలో ప్రమాదం చోటు చేసుకుంది. రూర్కెలా వద్ద ఓ చార్టర్డ్ ఫ్లైట్ కుప్ప కూలిపోయింది. ఈ నైన్ సీటర్ ఫ్లైట్ రూర్కెలా నుంచి భువనేశ్వర్ వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, టేకాఫ్ అయిన వెంటనే ఫ్లైట్ కూలిపోయినట్లు చెప్పారు. ప్రమాద సమయంలో అందులో ఎనిమిది మంది ఉన్నారు. ఇద్దరు పైలట్లు కాగా ఆరుగురు ప్రయాణికులు. ఫ్లైట్ టేకాఫ్ అయి 10 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత ఇంజిన్ విఫలమవడంతో పంట పొలాల్లో కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, రెస్క్యూ టీమ్ హుటా హుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. ఈ ఫ్లైట్ ఇండియావన్ అనే సంస్థకు చెందినదిగా అధికారులు తెలిపారు.

# ఇరాన్‌లో వెల్లువెత్తిన నిరసనలు

## సిగరెట్లు తాగుతూ ఆంక్షలు ఉల్లంఘించిన మహిళలు



**టెహ్రాన్, జనవరి 10:** ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం 1979 తర్వాత ఎన్నడూ లేనంత స్థాయిలో ప్రజా తిరుగుబాటు కనిపిస్తోంది. కేవలం ఆర్థిక కష్టాలకే పరిమితం కాకుండా, ప్రస్తుత పాలనా వ్యవస్థపై నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్ మహిళలు తమ నిరసనను వినూత్నంగా, అత్యంత సాహసోపేతంగా తెలుపుతున్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ ఫోటోలను తగులబెట్టి, ఆ మంటలతో మహిళలు సిగరెట్లు వెలిగిస్తున్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇరాన్ చట్టాల ప్రకారం సుప్రీం లీడర్ ఫోటోలను అవమానించడం మరణశిక్ష పడేంతటి నేరం. మహిళలు బహిరంగంగా పొగతాగడంపై కూడా అక్కడ సామాజిక ఆంక్షలు ఉన్నాయి. ఈ రెండు నిబంధనలను ఒకేసారి ఉల్లంఘించడం ద్వారా మహిళలు తమపై ఉన్న పాలకుల ఉక్కుపాదాన్ని ధిక్కరిస్తున్నట్లు అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు. టెహ్రాన్ వీధుల్లో మహిళలు తమ హిజాబ్‌లను తగులబెట్టి భారీ ఆ కాంతుల మధ్య నాట్యం చేస్తున్న దృశ్యాలు నిరసన తీవ్రతకు అద్దం పడుతున్నాయి. డిసెంబర్ చివరి వారంలో ప్రారంభమైన ఈ నిరసనలపై ఇరాన్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. జనవరి 10 నాటి నివేదికల ప్రకారం, ఇప్పటివరకు 200 మందికి పైగా నిరసనకారులు మరణించగా, 2,300 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు.

## శిశు విక్రయాల కేసులో వీడుతున్న మిస్టరీ

## లొంగిపోతానంటున్న సూత్రధారి ప్రియాంక



**న్యూఢిల్లీ, జనవరి 10:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శిశు విక్రయాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఢిల్లీ ముఠాలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రియాంక త్వరలో పోలీసులకు లొంగిపోనున్నట్లు సమాచారం. విజయవాడ పోలీసులు ఆమె కోసం ఢిల్లీ, మీరట్ ప్రాంతాల్లో గాలింపు చేపట్టిన నేపథ్యంలో ఉత్తరాఖండ్‌కు పరారైంది. అయితే అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరగడం, మీరట్‌లోని తన అత్తమామలకు పోలీసులు నోటీసులు ఇవ్వడంతో న్యాయవాదితో కలిసి విజయవాడ వచ్చి లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. పిల్లల విక్రయాల ద్వారా ప్రియాంక భారీగా అక్రమ ఆస్తులు గడించినట్లు పోలీసులు గుర్తించారు. ఆమె ఆర్థిక లావాదేవీలను వెలికితీసేందుకు సంబంధిత బ్యాంకులకు లేఖలు రాశారు. ఆ ఖాతాల వివరాలు అందిన వెంటనే వాటిని స్తంభింపజేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ లావాదేవీల విశ్లేషణ ద్వారా ఈ ముఠాతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల వివరాలు కూడా బయటకు వచ్చే అవకాశం ఉంది. నిందితులు జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ అవే నేరాలకు పాల్పడుతుండటంతో పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. ముంబై, అహ్మదాబాద్, ఢిల్లీకి చెందిన ఆరుగురు నిందితులపై త్వరలోనే రౌడీషీట్లు తెరవనున్నారు. దీనివల్ల వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంచే వీలుంటుంది. మరోవైపు, ఈ కేసులో నిందితుడైన అనిల్‌కు న్యాయస్థానం రిమాండ్ విధించింది. మహారాష్ట్ర జైలులో ఉన్న అతడిని పీటీ వారెంట్‌పై విజయవాడకు తరలించిన పోలీసులు న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. ఈ విక్రయాల్లో కిరణ్ పెదనాన్న ప్రమేయం కూడా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. కేసులో ఇంకా పరారీలో ఉన్న నూరి కోసం ఒక బృందం థానేకు వెళ్లనుండగా, మరో నిందితురాలు ఫరీనా కస్టడీపై ఒకటి రెండు రోజుల్లో స్పష్టత రానుంది.



## మిస్టరీ వీడిన ఝాన్సీ మహిళా ఆటోడ్రైవర్ హత్య

### ప్రియుడే కాల్చి చంపినట్లు అంగీకారం

**ఝాన్సీ(యుపి) జనవరి 10:** ఉత్తర్ ప్రదేశ్‌లోని ఝాన్సీలో సంచలనం సృష్టించిన తొలి మహిళా ఆటో డ్రైవర్ అనితా చౌదరి హత్య కేసు మిస్టరీ వీడింది. ప్రేమ, ద్రోహం, ప్రతీకారమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసుల విచారణలో తేలింది. పోలీసుల దర్యాప్తులో ప్రధాన నిందితుడు పట్టుబడటంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ఈనెల 4వతేదీ రాత్రి ఝాన్సీలోని నవాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సకున్వా ధుక్వాన్ కాలనీ వద్ద అనితా చౌదరిని దుండగులు కాల్చి చంపారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆమె మృతదేహం, పక్కనే బోల్తాపడి ఉన్న ఆటోను పోలీసులు గుర్తించారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు ముఖేశ్ ఝా, శివం, మనోజ్‌లపై కేసు నమోదు చేశారు. పోలీసులు వెంటనే శివం, మనోజ్‌లను అదుపులోకి తీసుకున్నప్పటికీ, ప్రధాన నిందితుడైన ముఖేశ్ ఝా పరారయ్యాడు. భగవంతపుర సమీపంలోని మట్టి రోడ్డులో ముఖేశ్‌ను పోలీసులు చుట్టుముట్టారు. అతను పోలీసులపై కాల్పులు జరపగా, ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో నిందితుడి కాలికి బుల్లెట్ తగిలింది. సిటీఎస్పీ ప్రీతి సింగ్ వివరాల ప్రకారం ఆరేళ్ల క్రితం ముఖేశ్, అనిత ప్రేమించుకుని ఓ గుడిలో రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. అయితే, కొద్దికాలానికే అనిత అతడిని విడిచి వెళ్లిపోయింది.


## దళిత మహిళ హత్య, కుమార్తె కిడ్నాప్



**లక్నో, జనవరి 10:** ఒక యువకుడు దళిత మహిళను హత్య చేసి ఆమె కుమార్తెను కిడ్నాప్ చేశాడన్న వార్త ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో యువతిని కాపాడి నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో ఈనెల 8న కప్సద్ గ్రామానికి చెందిన దళిత మహిళ, 20 ఏళ్ల కుమార్తె కలిసి నడుస్తూ తమ పొలానికి వెళ్తున్నారు. స్థానిక వైద్యుడి వద్ద కాంపౌండర్‌గా పనిచేసే 22 ఏళ్ల పారస్ కాలువ గట్టు వద్ద ఆ మహిళలను అడ్డుకున్నారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ప్రతిఘటించిన ఆమె తల్లిపై కొడవలితో దాడి చేశాడు. యువతిని కిడ్నాప్ చేసి పారిపోయాడు. గాయపడిన దళిత మహిళ అరుపులు విన్న స్థానికులు అక్కడకు చేరుకున్నారు. ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. దీంతో ఆ గ్రామంలోని దళిత కుటుంబాలు ఆగ్రహంతో రగిలిపోయాయి. భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఆమె కుమార్తెను రక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు, అధికారులు, రాజకీయ నేతల హామీతో నిరసన విరమించారు. దళిత మహిళ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మరోవైపు నిందితుడు పారస్‌కు మరికొందరు వ్యక్తులు సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కిడ్నాపైన యువతిని కాపాడేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. అయితే సీఎం ఆదిత్య నాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలైన బీఎస్పీ, ఎస్పీ, కాంగ్రెస్ మండిపడ్డాయి. నిందితులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించాయి.

## నోబెల్‌ను ట్రంప్‌కు ఇచ్చేస్తారా?

### వచ్చేవారం మచాడో యుఎస్ పర్యటన



**వాషింగ్టన్, జనవరి 10:** నోబెల్ శాంతి పురస్కారాన్ని అందుకునేందుకు తనకంటే అర్హుడు ఈ చరిత్రలో ఎవరూ లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఏమీ చేయకపోయినా ఆ గౌరవం దక్కిందని అసహనం వ్యక్తం చేశారు. చమురు, సహజవాయువు సంస్థలకు చెందిన ప్రతినిధులతో వైట్‌హౌస్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడో అమెరికాలో పర్యటించనున్న నేపథ్యంలో నోబెల్ గురించి మరోసారి ప్రస్తావించారు. ఇటీవల ఆమె ఈ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. 'నా దృష్టి అంతా ప్రజల ప్రాణాలు కాపాడటం పైనే ఉంది. యుద్ధాలను ఆపడం ద్వారా కోట్లాది మందిని రక్షించాను. ఇక వచ్చేవారం మచాడో వాషింగ్టన్‌కు రానున్నారు. ఆమె మన దేశానికి కృతజ్ఞతలు తెలియజేస్తారు. నేను ఈ దేశానికి ప్రతినిధిని కాబట్టి ఆ కృతజ్ఞతలు నాకే. మచాడో ఇక్కడికి రావాలనుకోవడం మంచి విషయం. జరిగిన దానికి నార్వే చాలా ఇబ్బంది పడుతోంది. దానిని సరిదిద్దేందుకే ఆమె వస్తున్నారు' అని ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. గత యేడాది నార్వే రాజధాని ఓస్లోలోని నోబెల్ కమిటీ ఆమెకు నోబెల్ ఇచ్చి సత్కరించిన సంగతి తెలిసిందే. దానిని ట్రంప్‌నకు అంకితం చేస్తున్నట్లు ఇటీవల ఆమె ప్రకటించారు. దాంతో త్వరలో యుఎస్ పర్యటనకు రానున్న వెనిజులా నేత ఆ పురస్కారాన్ని ట్రంప్‌నకు ఇచ్చేస్తారా? అనే చర్చ మొదలైంది.

# సంక్షిప్తంగా..

## అమెరికా వీసాప్రాసెసింగ్ ఫీజులు పెంపు





**వాషింగ్టన్, జనవరి 10:** హెచ్-1బి, ఎల్-1 వంటి వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులను అమెరికా పెంచింది. 2,805 డాలర్ల నుంచి 2,965 డాలర్లకు పెంచింది. మార్చి 1 నుంచి ఈ పెంపు అమల్లోకి రానుంది. మిగతా వీసా కేటగిరీల ప్రాసెసింగ్ ఫీజుల్లోనూ మార్పులు చేసింది. ఈ మేరకు యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఓ ప్రకటన విడుదల చేసింది. జూన్ 2023 నుంచి జూన్ 2025 మధ్య ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని ఈ ఫీజు పెంచినట్లు వెల్లడించింది. వీసా దరఖాస్తులను వేగంగా ప్రాసెస్ చేయడానికి ఈ అదనపు రుసుమును వసూలు చేస్తారు. హెచ్-1బి, ఎల్-1, ఒ-1, పి-1, టిఎన్ వీసాల (ఫారం ఐ-129) విషయంలో ప్రీమియం ఫీజును 2,805 డాలర్ల నుంచి 2,965 డాలర్లకు పెరగనుంది. ఎఫ్-1, జె-1 వంటి వీసాల (ఫారం ఐ-539) విషయంలో ఫీజును 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెంచింది.

## అయోధ్య రామాలయంలో నమాజుకు యత్నం: కాశ్మీర్ ముస్లిం అరెస్టు



**లక్నో, జనవరి 10:**అయోధ్యలోని పవిత్ర రామాలయంలో అనుచిత ఘటన జరిగింది. దేవాలయం ప్రాంగణంఒ కాశ్మీర్‌కు చెందిన ఒక ముస్లిం నమాజుకు ప్రయత్నించాడు. ఈ ఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు, మీడియా కథనాలు ప్రకారం కాశ్మీర్‌కు చెందిన అహ్మద్ షేక్ (55) అనే ఒక వ్యక్తి శుక్రవారం అయోధ్యలోని రామాలయం ప్రాంగణంలో, సీతా రసోయి ప్రాంతంలో నమాజు చేసేందుకు ప్రయత్నించాడు. అంతకుముందు అతడు దేవాలయాన్ని దర్శించుకున్నాడు. అనంతరం నమాజు చేసేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు ఈఘటనపై విచారణ జరుపుతున్నారు. అతడు దేవాలయంలోకి ఎలా ప్రవేశించాడు, భద్రత ఉన్నప్పటికీ లోపలికి వచ్చి, నమాజు చేసేందుకు ఎలా ప్రయత్నించాడు వంటి వివరాలు ఆరా తీస్తున్నారు. అలాగే అతడి ట్రావెల్ హిస్టరీని కూడా పరిశీలిస్తున్నారు.

## చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలి: అజిత్ దోవల్



**న్యూఢిల్లీ, జనవరి 10:** ఢిల్లీలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ యువత నుద్దేశించికీలక వ్యాఖ్యలుచేశారు. మనదేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని వారికి సూచించారు. ప్రతీకారంమంచిది కాదని దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు.

## జన నాయగన్ వివాదం.. విజయ్‌కు స్టాలిన్ మద్దతు



**చెన్నై, జనవరి 10:** సెన్సార్‌బోర్డు ధృవీకరణ పత్రం ఇవ్వకపోవడంతో విజయ్ కథానాయకుడిగా నటిం చిన 'జన నాయగన్' సినిమా విడుదల వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీఎ ప్రభుత్వం తమ రాజకీయ లబ్ధికోసం సిబిఐ, ఇడి, ఐటి వంటి కేంద్ర సం స్థలను ఉపయోగించుకుం టోందన్నారు. తాజాగా ఈ జాబితాలో సెన్సార్ బోర్డు కూడా చేరిందని విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిబిఎఫ్‌సిని కూడా ఆయుధంగా ఉపయోగిస్తోందని ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఈ విషయంలో తమిళనాడు కాంగ్రెస్ నేతలు సైతం విజయ్‌కు మద్దతుగా నిలిచారు.

## మరో వెనిజులా చమురునౌక అమెరికా స్వాధీనం



**కారకాస్, జనవరి 10:** వెనిజులా నుండి రాకపోకలు సాగించే నౌకలపై ఆంక్షలను కఠినంగా అమలు చేస్తున్న ట్రంప్ యంత్రాంగం మరో కీలక చర్యకు దిగింది. కరేబియన్ సముద్రంలో ఒలినా అనే చమురు నౌకను స్వాధీనం చేసుకున్నట్లు అమెరికా సైన్యం ప్రకటించింది. యుఎస్ మెరైన్ అండ్ నేవీ సహకారంతో ఈ ఆపరేషన్‌ను చేపట్టినట్లు అమెరికా సదరన్ కమాండ్ వెల్లడించింది. నేర కార్యకలాపాలకు పాల్పడే వారికి సురక్షితమైన ప్రదేశం లేదని స్పష్టం చేసింది. హెలికాప్టర్ల సహాయంతో అమెరికా బలగాలు నౌకపైకి దిగి విస్తృతంగా సోదాలు నిర్వహించాయని సైన్యం తెలిపింది. దీనికి సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది.

# అంతర్ కళాశాలల ఆటలు పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ తిరుపతి పశువైద్య విద్యార్థుల కైవసం

## సాంస్కృతిక, సాహిత్య విభాగాల్లో గరివిడి విద్యార్థులకు ఛాంపియన్ షిప్



**గరివిడి (విజయనగరం జిల్లా), జనవరి 10 ప్రభాతవార్త** తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం సౌజన్యం, గరివిడి పశువైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 5 నుండి 10వ తేదీ వరకు గరివిడి పశువైద్య కళాశాల వేదికగా జరిగిన అంతర్ కళాశాలల ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థులు అన్ని ఆటల్లోనూ అగ్రగామిగా నిలిచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ని కైవసం చేసుకున్నారు. బాలికలు, బాలుర విభాగాల్లో రెండింట్లోనూ అదే కళాశాల విద్యార్థిని, విద్యార్థులు పతకాలు సాధించి సత్తా చాటారు. కాగా సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు చాంపియన్ షిప్ సాధించి తమ ప్రతిభ చాటుకున్నారు. అలాగే ఓవరాల్ ట్రోఫీ కూడా తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అంతర్ కళాశాలల ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో రాష్ట్రంలో గల తిరుపతి, ప్రొద్దుటూరు, గన్నవరం, గరివిడి పశువైద్య కళాశాలలు, తిరుపతి హెరిటేజ్ కళాశాల విద్యార్థులు 530 మంది పాల్గొన్నారు. 40 విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పోటీ పడి ఆటలు, సాంస్కృతిక, సాహిత్య విభాగాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలు ఉత్సహ వాతావరణంలో ఆరు రోజులు పాటుక్రీడా స్ఫూర్తితో జరిగాయి. సాంస్క ృతిక ప్రదర్శనలు కళామతల్లి పులకించే విధంగా సాగాయి. బాలుర అథ్లెటిక్స్ పోటీల్లో వ్యక్తిగత ఛాంపియన్ షిప్‌ని తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థి ఎన్.విష్ణు సాధించగా, బాలికల అథ్లెటిక్స్‌లో గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థిని ఎం.ప్రణీత, తిరుపతి పశువైద్య కళాశాల విద్యార్థిని జి.అంజలిలు సంయుక్తంగా గెలుపొందారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు ఆటలు, సాంస్కృతిక పోటీలు : వైస్ ఛాన్సలర్ డాక్టర్ జె.వి.రమణ విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న ప్రతిభ వెలికి తీసేందుకు అంతర్ కళాశాలల ఆటలు, సాంస్కృతిక, సాహిత్య పోటీలు దోహధికారిగా నిలుస్తాయని తిరుపతి శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ డాక్టర్ జె.వి.రమణ అన్నారు.

# సుద్ధ గడ్డ వంతెన నిర్మాణం పనులను పరిశీలించిన డిప్యూటీ సిఎం

## థ్యాంక్స్ చెబుతూ ప్లకార్డులు ప్రదర్శించిన కాలనీ వాసులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 10 (ప్రభాతవార్త):** పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సందర్శించి. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించారు. బ్రిడ్జి మొత్తం తిరిగి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుద్ధగడ్డ కాలువపై పవన్ కళ్యాణ్ ఆదేశాలతో రూ. 3.05 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది. 2024 సెప్టెంబర్ లో పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా హౌసింగ్ కాలనీ సందర్శనకు వచ్చిన సందర్భంలో వరద ముంపులో ఉంది. పడవపై వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువకు వరద వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని, రాకపోకలకు ఇబ హారు. ఆ సందర్భంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందించి హామీ నెరవేర్చారు. శుక్రవారం సంక్రాంతి మహోత్సవ వేదికపై లాంఛనంగా బ్రిడ్జిని ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా ముంపు కష్టాలు తొలగించిన పవన్ కళ్యాణ్ కు కాలనీ వాసులు, స్కూలు పిల్లలు థ్యాంక్యూ డిప్యూటీ సీఎం సర్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు.



# మత్తిచ్చి నగలు దోచేసిన మహిళ అరెస్ట్

**తిరుమల,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** భక్తురాలి ముసుగులో తోటి భక్తురాలికి మత్తుకలిపిన పానీయం ఇచ్చి మరో భక్తురాలి ఒంటిపై నగలు దోచేసిన మహిళ నిందితురాలిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అరెస్టుచేశారు. ఆమె నుండి 57గ్రాముల బరువుగల బంగారు ఆభరణాలను స్వాధీనంచేసుకున్నట్లు ఎస్ఐ చలపతి తెలిపారు. తిరుపతినగరానికి చెందిన రాధాకృష్ణవిజయ(63)ఈనెల 2వతేదీ తిరుమలకు చేరుకుని సర్వదర్శనం క్యూలైన్లో వెళుతున్న సమయంలో ఒక అనుమానిత మహిళ పరిచయమైంది. ఆమెకు క్యూలైన్లో మత్తుకలిపిన పానీయం ఇవ్వడంతో తాగింది. దీంతో మత్తులోకి వెళ్ళిన ఆమె మెడలోని 60గ్రాముల బంగారు ఆభరణాలను అనుమానిత మహిళ దోచుకెళ్ళింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్ ఆదేశాలతో ఎస్ఐ చలపతి కేసు దర్యాప్తు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో సిసిటివి ఫుటేజీల ఆధారంగా కర్నాటక కోలారుకు చెందిన నాగరత్నమ్మ (45)ను అరెస్ట్‌చేసి బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

# చీపురుపల్లిలో రైల్వే బ్రిడ్జి ప్రారంభం



**చీపురుపల్లి (విజయనగరం జిల్లా), జనవరి 10 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రాంత ప్రజల కల ఎట్టకేలకు సాకరమైంది. ఎన్నో ఏళ్ళుగా పడుతున్న అవస్థల నుంచి విముక్తి లభించింది. చీపురుపల్లిలోని రైల్వే బ్రిడ్జి ప్రారంభమవ్వడంతో పలు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేందుకు మార్గం ఏర్పడింది. కోట్లాది రూపాయల వ్యయంతో చీపురుపల్లి పట్టణంలోని రైల్వే వంతెన నిర్మాణం గత నాలుగు సంవత్సరాలుగా నత్తనడకన జరుగుతున్నాయి. ఎట్టకేలకు ఆ పనులు నేటికి పూర్తయ్యి వంతెన ప్రారంభం కావడంతో చీపురుపల్లి, రాజాం తదితర ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు, విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నాడు రైల్వే వంతెన నిర్మాణాన్ని ప్రారంభించారు. అదేవిధంగా చీపురుపల్లి ప్రధాన కేంద్రంగా విశాఖపట్నం, పాలకొండతో పాటు ఒరిస్సా రాష్ట్రాలకు సంబంధించిన రాకపోకలు నేటి నుంచి ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలతో పాటు ఉద్యోగ, విద్యార్థులు, వ్యాపార వర్గాలు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు శాసనసభ్యుడు కిమిడి కళా వెంకటరావు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, జనసేన నాయకులు, భారతీయ జనతా పార్టీ నాయకులు వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రజల కష్టాలకు నేటి నుంచి ఇక్కట్లు తొలుగుతాయని అన్నారు.

# దుర్గమ్మసేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి



శ్రీశైల జగద్గురు పీఠాధిపతికి ఆశీర్వాదం అందుకుంటున్న ఇఒ

**ఇంద్రకీలాద్రి, జనవరి 10, ప్రభాతవార్త :** దుర్గమ్మవారిని శనివారం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామివార్లు దర్శించుకున్నారు. వారికి ఇఒ వికె శీనా నాయక్ ఆహ్వానం పలికి దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వాదాలందించారు. పీఠాధిపతులు అనుగ్రహాబాషణంన చేసి అనంతరం ఇఒకు ఆశీర్వచనాలందించారు. దుర్గమ్మవారి ఆలయంలో భక్తులకు అందించే అన్న ప్రసాద వితరణకు విజయవాడకు చెందిన కొల్లూరి రామ్ ప్రకాష్ పేరిట వారి కుటుంబసభ్యులు రు.1లక్ష విరాళం శనివారం అందించారు. హైదరాబాద్‌కు చెందిన మరో దాత భావన భాగ్యలక్ష్మి రు.1,00,001ల విరాళం అన్న ప్రసాద వితరణకు అందించారు. అదేవిధంగా ముదినేపల్లికి చెందిన కిర్ల నాగ వెంకట దుర్గా నవీన్ పేరిట వారి కుటుంబసభ్యులు రు.2,11,450ల విరాళం అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వాదాలందించారు.

# పల్లెల్లో కానరాని సంక్రాంతి సంబరాలు

## ప్రభుత్వ పథకాలతో ప్రజలు ఖుషీ, ఖుషీ


**శ్రీకాళహస్తి, జనవరి 10 ప్రభాతవార్త** తెలుగువారి పెద్దపండుగ సంక్రాంతి శోభ కనుమరుగవుతోంది. ఈ ఏడాది సమృద్ధిగా అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు వర్షాలు కురిసినా రైతులకు వెతలే మిగిల్చాయి. మొదటి సారి వేసిన పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయానికి పెట్టుబడుల సమయంలో ఆదుకునే బ్యాంకులు పాత బకాయిలు చెల్లింలేదని కొత్త అప్పుకు నో అంటున్నారు. పట్టణాల్లో వడ్డీ వ్యాపారస్తుల వద్ద ఏదైనా తాకట్టు పెడదామన్నా ఏమి లేకపోవటంతో పెట్టుబడుల కోసం తల్లడిల్లుతున్నారు. దాంతో సంక్రాంతి సంబరాలు మొక్కుబడిగా మారాయి. జగనన్న కానుకలు ఇచ్చినా పండగ సంబరం కానరావటం లేదు.సిఎం కానుకలు ఎప్పటికప్పుడు ప్రజల అవసరాల్ని తీర్చటంలో సత్ఫలితాలనిస్తున్నాయి. సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలన్న తలంపుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అధికారం చేపట్టిన తరువాత ప్రతి పల్లెల్లోను, ప్రభుత్వ కారా ్యలయాల్లోను సంక్రాంతి సంబరాలు చేయాలని ఆదేశించారు. పల్లెల్లో సైతం ఈ సందడి కన్పించక పండగ మొక్కుబడిగా మారింది. పండుగ నాటికి ఇంటినిండా ధాన్యం, కొత్త అల్లుళ్ల సందళ్లు, భోగిపళ్ల చిన్నారుల హడావిడ ఇది ఒక నాటి సందడి. కానీ నేడు పెట్టుబడుల కోసం వెంపర్లాట ,ఆర్థిక స ంక్షోభం, అప్పులు మది నిండా వెతలతో పండగ సందళ్లు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు ధాన్యాన్ని ఇంటికి తీసుకువచ్చే ఆనవాయితీ ఉండగా, నేడు దిగుబడులు తగ్గి ఉన్న ధాన్యాన్ని రైతులు కల్లాలో అయినకాడికి అమ్ముకుంటున్నారు.

ఒకనాడు రైతుల గాదెల నిండా ధాన్యం, కళ్లలో ఆనందం ఉండేది. కానీ నేడు ఇవేమీ లేవు. తాము వేసిన పంటలు చేతికి ఎప్పుడు వస్తాయో అని ఎదురుచూస్తున్నారు. ఇక సంప్రదాయాల సంగతంటారా..ఊరంతా సంక్రాంతి..కాబట్టి తాము కూడా చేస్తున్నామని మాత్రమే చెబుతున్నారు. పిండి వంటల తయారీకి సైతం అధికశాతం మహిళలు మొగ్గు చూపడం లేదు.

# నాగాయగుంటలో 70 లక్షలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ఘన స్వాగతం

**బుచ్చి (నెల్లూరు), జనవరి 10, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలం నాగాయగుంట పంచాయితీలో 70 లక్షలతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామంలో ప్రజలు ఆమెను ఘనంగా స్వాగతించారు. గజమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కిసాన్ సెజ్‌లోపరిశ్రమలకు స్దాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఐటి మంత్రి నారా లోకేష్, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కృషి ఫలితంగానే ఇఫ్కో కిసాన్ సెజ్ టాటా గ్రూప్ 6 వేల 675 కోట్లతో పవర్ ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నాగాయగుంట పంచాయితీలో దాదాపు 70 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. నాగాయగుంట గ్రామంలో 30 లక్షల 50 వేల రూపాయాలతో త్రాగునీటి వసతి కల్పించేపైప్ లైన్,మరో 15 లక్షలతో ఉపాధీహామి నిధులతో సిసిరోడ్లుతోపాటు,జల్‌జీవన్ మిషన్ ద్వారా మరో 9 లక్షలు జడ్పి నుండి 5 లక్షలు గ్రామాభివృద్ధికి వెచ్చించామన్నారు. 15 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ( ఉపాధీహామి పథకం ) సిమెంట్‌రోడ్డుకు కేటాయించినట్లు తెలిపారు. నాగాయగుంటలో సిఎంఆర్ఎఫ్ కింద 5 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన 20 నెలలో నాగాయగుంటలో 70 లక్షలతో అభివృద్ధి పనులు



చేయడం జరిగిందని ఆమె స్పష్టం చేశారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో బుచ్చిరెడ్డిపాళెం ముంబాయి హైవే రహదారికి 8 కోట్లు మంజూరు చేయించినట్లు ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమం రెండు కళ్ళుగా చేసుకొని ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, సాగునీటి సంఘం అద్యక్షులు బత్తల హరికృష్ణా, చేనేత సంఘం నాయకులు కె వి శేషయ్య, నాగాయగుంట నాయకులు విరువూరు .చెంచయ్య, ఇరువూరు చందు, కోనంకి క్రిష్ణయ్య, ఇరువూరు యానాదయ్య ,నారాయణ, హాజరత్తయ్య, కోడూరు చిన చెంచయ్య, ఉప్పునారాయణ, దేవళ్ళ మనోజ్, దేవళ్ళ వెంకటేశ్వర్లు, బత్తల హాజరత్, విరువూరు చెంచురాంజనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులు, చిలక మనోహార్ తదితరులు పాల్గోన్నారు.



సిద్ధార్ధ అకాడమీ స్వర్ణోత్సవాల్లో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

# విద్యారంగంలో సంచలనాత్మక సంస్కరణలు చేస్తున్నాం

- మరో ఆరు నెలల్లోనే క్వాంటం కంప్యూటర్ అమరావతి నుంచి పనిచేస్తాయి
- విద్యారంగంలో సిద్ధార్ధ అకాడమీ సేవలు అద్భుతం
- విజయవాడను విద్యలవాడగా మార్చటంలో సిద్ధార్ధ సంస్థ కృషి అభినందనీయం
- పిబి సిద్ధార్ధ అకాడమీ విద్యా సంస్థల స్వర్ణోత్సవాల కార్యక్రమంలో సిఎం

**విజయవాడ,జనవరి 10,ప్రభాత వార్తప్రతినిధి:** విద్యారంగంలో సంచలనాత్మక సంస్కరణలు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు.విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశలో సాంకేతిక కోర్సులు అందుబాటులు అందుబాటులోకి తీసుకుని వస్తున్నా మన్నారు.మరో ఆరు నెలల్లోనే క్వాంటం కంప్యూటర్ అమరావతి నుంచి పనిచేయటం ప్రారంభిస్తుంది అన్నారు.సిద్ధార్ధ విద్యాసంస్ధలో ఏపీలో వైద్య విద్యతో సహా అనేక ప్రాధాన్యతా రంగాలకు చెందిన విద్యాభివృద్ధికి కృషి చేసాయన్నారు. పీబీ సిద్ధార్థ అకాడమీ విద్యా సంస్థల స్వర్ణోత్సవాల కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్ లో అత్యుత్తమ విద్యా సంస్థగా సిద్ధార్థ అకాడమీ పేరు తెచ్చుకుంది. లక్షల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన సంస్థగా పేరు ప్రఖ్యాతులను ఈ సంస్థ ఆర్జించింది అన్నారు.విజయవాడను విద్యల వాడ మార్చటంలో ఈ సంస్థ చేసిన కృషి అభినందనీయం అన్నారు. సిల్వర్ జూబ్లీతో పాటు గోల్డెన్ జూబ్లీ వేడుకలకు కూడా నేను హాజరుకావటం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బీఎడ్, హోటల్ మేనేజ్మెంట్, ఫార్మసీ సహా 18 కళాశాలల ద్వారా 28 వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారువిద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న సిద్ధార్థ అకాడమీకి అభినందనలు తెలియచేస్తున్నానుసిద్ధార్థ అకాడమీ సంస్థలు అగ్రిటెక్ కళాశాలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందిఎలాంటి ప్రయోజనం, పరిహారం కోరకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజికి భవనాలు ఇచ్చిన సిద్ధార్ధ అకాడమీకి ధన్యవాదాలుసిద్ధార్ధ విద్యాసంస్థలు నిర్మించిన కళాశాల భవనాలను యూనివర్సిటీగా ఎన్టీఆర్ తీర్చిదిద్దారు.అన్నారు మెగా పేరెంట్ టీచర్ ద్వారా తల్లితండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఏడాదికి రెండు మార్లు సమావేశాన్ని నిర్వహిస్తున్నాం అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది అన్నారు.రాష్ట్రానికి ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు తీసుకురావటం ద్వారా మన వద్దే నైపుణ్యాలు పెంచేలా కృషి చేస్తున్నాం అన్నారు.ప్రైవేటు రంగంలో ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు కూడా అమరావతిలో ఉన్నాయి అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాల క్యాంపస్ లను కూడా అమరావతిలో ఏర్పాటు చేయించాలని సంకల్పించాం అన్నారు.15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది.కేంద్రం క్వాంటం మిషన్ ప్రకటిస్తే.. వెంటనే అందిపుచ్చుకుని క్వాంటం కంప్యూటర్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం అన్నారు, క్వాంటం అల్గారిథమ్స్ నేర్పేందుకు కూడా విద్యార్థులకు, నిపుణులకు కోర్సులు నిర్వహిస్తున్నాంప్రపంచం మెచ్చే అమరావతి రాజధాని నిర్మించబోతున్నాంకొందరు ఈ నిర్మాణ వేగాన్ని చూసి అసూయ చెందుతున్నారు. అమరావతిని ఆపేస్తామని కలలు కంటున్నారు అన్నారు.అమరావతి నదీ పరివాహక ప్రాంతంలో ఉందని ఆరోపణలు చేస్తున్నారు అన్నారు రాజమండ్రి, విశాఖ, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ, లండన్ నగరాలు ఎక్కడున్నాయో వారు చెప్పాలి.

అన్నారు,ఎక్కడ నీరుంటే అక్కడ నాగరికతలు వెలుస్తాయి. ఈ విషయం తెలియని వ్యక్తులు రాజకీయం చేస్తున్నారుపవిత్ర జలాలు, మట్టితో అమరావతి ప్రజా రాజధాని పవిత్రం చేశాం.

# 16న గిరిప్రదక్షిణం ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్



**శ్రీకాళహస్తి,జనవరి 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని గిరి ప్రదక్షిణ ఉత్సవం ఈ నెల 16 శుక్రవారం నిర్వహించబడుతుందని ఆలయాధికారులు ప్రకటించారు.శనివారం గిరి ప్రదక్షిణ రోడ్డును ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ అధికారులతో కలసి పరిశీలించారు. ఇక్కడిఆలయంలో నిర్వహించే ప్రతి ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. ఏడాదిలో రెండు సార్లు కైలాసగిరి ప్రదక్షిణం నిర్వహించటం ఆనవాయితి. సంక్రాంతి కనుమ రోజు నిర్వహించే గిరి ప్రదక్షిణం కైలాసగిరుల్లోని ముక్కోటి దేవతలకు మహాశివరాత్రి సందర్భంగా జరిగే స్వామి అమ్మవార్ల కళ్యాణానికి ఆహ్వానంగా అభివర్ణిస్తారు. శివరాత్రి కళ్యాణోత్సవం తరువాత జరిగే గిరి ప్రదక్షిణను తన వివాహానికి వచ్చిన దేవతల్ని తిరిగి వారి స్థావరాలకు చేర్చటం అని చెబుతారు. సుమారు 21 కిలో మీటర్ల గిరి ప్రదక్షిణలో ఎన్నో గ్రామాలున్నాయి. ప్రతి గ్రామం వద్ద స్వామి అమ్మవార్లకు ఘనస్వాగతం చెబుతారు. సుమారు 16 గ్రామాల్లో ఆ రోజు పండగ జరుపుకుంటారు. గిరిప్రదక్షిణ గ్రామాల్లో కనుమకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఏడాదిలో రెండుసార్లు నిర్వహించే గిరి ప్రదక్షిణకు ఈ ఏడాది సుమారు 3లక్షల మంది హాజరుకావాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం స్వామి అమ్మవార్లు తమ గ్రామాలకు వస్తారు. మామిడితోరనాలు, ముగ్గులతో ముస్తాబు చేస్తారు. గురువారం ప్రదోష మూర్తులు గిరిప్రదిక్షణకు వెళుతుందని వివరించారు. ఉదయం ఆలయం నుంచి బయలుదేరు స్వామి అమ్మవార్లు సాయంత్రం పట్టణానికి చేరుకొని గ్రామోత్సవం నిర్వహిస్తారు.ఈ సందర్భంగా ఆలయంలో రెండు రోజుల పాటు భక్తుల ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. దేవస్థానమే అభిషేకాలు నిర్వహిస్తారు.గతంలో ముళ్ళ పొదలు, రాళ్ళురప్పలు కల్గిన కొండ దిగువప కాలిపడకప వెళ్ళె వారు. కానీ మారిప కాలానుగుణంగా కొండ చుట్టూ సిమెంటు రోడ్డు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పట్టుబట్టి అర్ధాంతరంగా ఆగిన సిమెంటు రోడ్డు పూర్తి చేయాలని ఆదేశించారు. దాంతో అధికారులు కాంట్రాక్టర్ వెంటపడుతున్నారు. స్వామి అమ్మవార్లను మోసే కూలిలకు కూడా సులభంగా ఉంటుందని భావిస్తున్నారు. గ్రామాల్లో సందడికి గ్రామాల్లోని నాయకులు భావిస్తున్నారు. కొత్త ధర్మకర్తల మండలి సారధ్యంలో మొదటి గిరి ప్రదక్షిణ శుక్రవారం నిర్వహించనున్నారు.

# మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డికి అస్వస్థత

**విజయవాడ.జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వెంటనే ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం కుంభకోణం కేసులో ఏ1గా ఉన్న రాజ్ కసిరెడ్డి ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అయితే కొద్దిరోజులుగా ఆయన ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వైద్య చికిత్స నిమిత్తం జైలు అధికారులు ఆయనను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా విచారణల సమయంలో రాజ్ కసిరెడ్డిని అక్కడికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు.ఇక ఇక ఇదే కేసులోని మరో నిందితుడు.. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కూడా వెరికోజ్ వెయిన్స్ సమస్యతో బాధపడుతున్నారు.

దీంతో ఆయన్ను చికిత్స కోసం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు కూడా విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కోర్టు ఆదేశాల మేరకు వైద్య చికిత్సలు కొనసాగుతున్నాయి. మరోవైపు లిక్కర్ స్కామ్ కేసులో సిట్, ఈడీ మరింత లోతుగా విచారిస్తున్నాయి.

# పాడి పంటల అభివృద్ధే దేశాభివృద్ధి

## సంక్రాంతి సంబరాలు ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారథి

**నూజివీడు,జనవరి10 ప్రభాతవార్త** పల్లె సీమల్లో పాడిపంటల అభివృద్ధి చేయడంటే దేశాన్ని అభివృద్ధి చేయడమేనని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు లో జరిగే సంక్రాంతి సంబరాలను రాష్ట్ర గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శనివారం ఏలూరు ఎం.పీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, విజయ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు లతో కలిసి ప్రారంభించారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో తొలుత రిబ్బన్ కట్ చేసి వివిధ పోటీల్లో ఏర్పాటు చేసిన పశువులు గేదె దూడల, దున్నలను తిలకించి,టాస్ వేసి కబాడీ పోటీలు ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ దేశ ప్రగతిలో పాడి పంటలు ప్రముఖ పాత్ర అన్నారు. దేశ రాష్ట్ర ఆర్థికాభివృద్ధి లో పాడి పరిశ్రమది ప్రముఖ స్థానం ఉందన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే రైతుల పండుగ అన్నారు. రైతు కష్టపడి పండించిన పంట ఇంటికి వచ్చిన రోజు కుటుంబం మొత్తం భార్య పిల్లలతో సంతోషంగా చేసుకొనే ఏకైక పండుగ సంక్రాంతి అని అభివర్ణించారు. ఉద్యోగ ఉపాధి నిమిత్తం పిల్లలు సుదీర ప్రాంతాల్లో దేశ విదేశాల్లో ఉండే వారంతా తమ సొంత గ్రామాలకు వచ్చి కుటుంబంతో సంతోషంగా గడుపుకునే ఏకైక తెలుగు పండుగ సంక్రాంతి అన్నారు.రైతుల ప్రగతికి ఆర్థికాభివృద్ధి కి కృష్ణ మిల్క్ డైరీ వారు సుమారు. రూ. 2లక్షల రుణాలు అందిస్తున్నారని, రైతుల అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.గతంలో పేడ,పెంట కృత్రిమ ఎరువుగా వేసేవారని తద్వారా పంట తక్కువ వచ్చిన రోగాలు బారీన పడే వారము కాదన్నారు. ప్రస్తుత కాలంలో ఎరువుల వాడకం అధికంగా ఉన్నందున ప్రజలకు రోగాలు కూడా అధికమయ్యాయన్నారు.ఎరువుల వాడకం సాధ్యమైన మేరకు తగ్గించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో పశువుల షెల్టర్లు ఏర్పాటు చేసి పశువుల పెంపకంను ప్రోత్సహిస్తుందని రైతులు అంతా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులకు పశుపెంపకం,పాడి పంటలకు అనేక పథకాల ద్వారా ఆర్థిక రుణాలు అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నియోజకవర్గ ములోని ప్రజలంతా సంక్రాంతి సంబరాలు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుకోవాలని అన్నారు. అనంతరం వివిధ గేదలు,దూడల, పాల పోటీలో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. సంక్రాంతి పోటీలకు ప్రోత్సాహ బహుమతిగా మంత్రివర్యులు రూ.10 వేలు, ఏలూరు పార్లమెంటు సభ్యులు పి, మహేష్ కుమార్ రూ.10వేలు చొప్పున కమీటీ సభ్యులకు అందజేసారు.ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు పుట్టా మహేష్ కుమార్, నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పశుసంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. పోటీలు జనవరి సంక్రాంతికి 9,10,11.వ తేదీలలో కనీ వినీ ఎరుగని బ్రహ్మాండమైన సంక్రాంతి సంబరాలు మీర్జాపురం గ్రామంలో ఏర్పాటు చేసి ఈ సందర్భంగా

వివిధ పోటీలు నిర్వహించి,పోటీలో పాల్గొన్న విజేతలకు మెగా నగదు బహుమతులు ప్రకటించారన్నారు

# చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను వికేంద్రీకరించాలి

- ప్రజారోగ్యం కోసం సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టాలి - మిల్లెట్ మేళా ముగింపు సమావేశం లో వక్తలు

**అనంతపురం, జనవరి 10, (ప్రభాతవార్త బ్యూరో)** చిరుధాన్యాల ప్రాసెసింగ్‌ను గ్రామ స్థాయిలో వికేంద్రీకరించాల్సి న అవసరం ఎంతైనా ఉందని, తద్వారా రైతులు , వినియోగదారులు కూడా ప్రయోజనం పొందుతారని స్వచ్ఛ కాద్యం వ్యవస్థాపకుడు సతీష్ కుమార్ సిపివి, ధరణి సీఈఓ రమేష్ కుమార్ అభిప్రాయపడ్డారు. అనంతపురంలో మూడు రోజుల పాటు జరిగిన మిల్లెట్ మేళా2026 ముగింపు సభ శనివారం జరిగింది. సభ లో అనంతపురం,శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన పలు రైతుఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓ) డైరెక్టర్ల బోర్డు సభ్యులతో యాక్సి యన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి మాట్లాడుతూ ఎక్కడైతే డైరెక్టర్ల బోర్డు చురుకుగా ఉండి వాటాదారులు తమ ఉత్పత్తులను ఎఫ్‌పిఓకు విక్రయించడం లేదా దాని నుండి ముడిసరుకులను కొనుగోలు చేయడం లాంటి చర్యలు చేస్తున్నారో, అక్కడ వారు విజయవంతంగా లాభాలతో నడుస్తున్నారని అన్నారు.టింబాక్టు కలెక్టివ్ సహ వ్యవస్థాపకురాలు మేరీ వట్టమట్టం మాట్లాడుతూ, అన్ని కాయ కూరలు, పంటలలో జరుగుతున్న కల్తీని హైలైట్ చేస్తూ, ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడానికి వ్యవసాయంలో సహజ/సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం ద్వారా దీనిని అరికట్టాలని అభిప్రాయపడ్డారు. మాజీ ఐఏఎస్ అధికారి స్మరజిత్ రే భార్య నందితా రే మాట్లాడుతూ వ్యవసాయపర్యావరణ నమూనాలకు కట్టుబడి, ఉద్యానవన పంటలను వార్షిక చిరుధాన్యాల పంటలతో కలిపి, సేంద్రియ వ్యవసాయం , ఉమ్మడి పచ్చిక బయళ్ల ద్వారా టింబాక్టు కలెక్టివ్ అభివృద్ధి చేస్తున్న 100 ఎకరాల ఉమ్మడి భూములను సందర్శించవలసిందిగా రైతులకు ఆహ్వానం పలికారు. సభలో ఏపీఎంఏఎస్ వ్యవస్థాపకుడు సి.ఎస్. రెడ్డి తదితరులు ఉన్నారు . మిల్లెట్ మేళాలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థలు సుమారు 30 స్టాళ్లను ఏర్పాటు చేశాయి .రైతులతో సహా వివిధ వర్గాల ప్రజలు దాదాపు 1,500 మందికి పైగా ఈ స్టాళ్లను సందర్శించారు. ఇండియా పోస్ట్ ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసిఎఫ్‌పిఓలు తమ చిరుధాన్యాలను తక్కువ ఖర్చుతో ఎలా ఎగుమతి చేయవచ్చో వివరించింది. పలు వ్యవసాయ, ఉద్యానవన డిప్లొమా కళాశాలలు , ఆర్ట్స్ కళాశాలల విద్యార్థులు మిల్లెట్ మేళలో స్టాళ్లను సందర్శించి మూడు రోజుల పాటు జరిగిన ఉపన్యాసాలను వినడం గమనించదగ్గ విషయం..

# అమెరికాలో అదృశ్యమైన కారసాని హరికృష్ణా రెడ్డి



## కుటుంబసభ్యుల ఆందోళన

**అద్దంకి, జనవరి 10, ప్రభాతవార్త :** విదేశాల్లో ఉన్నత చదువులు పూర్తి చేసి, జీవితంలో స్థిరపడాలన్న ఆశలతో అమెరికా వెళ్లిన ఓ తెలుగు యువకుడు అదృశ్యమవడం యావత్ తెలుగు సమాజాన్ని కలచివేస్తోంది. ప్రకాశం జిల్లా, సంతమాగులూరు మండలం, సంతమాగులూరు గ్రామానికి చెందిన కారసాని హరికృష్ణ రెడ్డి (24) అమెరికాలో మిస్టరీగా గల్లంతయ్యాడు. కారసాని లక్ష్మారెడ్డి-పద్మ దంపతులకు హరికృష్ణ రెడ్డి పెద్దవాడిగా ఏకైక కుమారుడు కాగా, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ఆశాకిరణంగా ఉన్న కుమారుడి అదృశ్యం తల్లిదండ్రులను తీరని వేదనకు గురిచేస్తోంది. టెక్సాస్ రాష్ట్రం హ్యూస్టన్‌లో మాస్టర్స్ చదువు పూర్తి చేసిన హరికృష్ణ రెడ్డి, అక్కడే ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తూ ఉన్నాడు. గత నెల 22న హ్యూస్టన్ నుంచి అలబామా రాష్ట్రంలోని డెనాలీ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లిన అతడు, డిసెంబర్ 30 తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎలాంటి సంప్రదింపులు లేకుండా కనిపించకుండా పోయాడు. అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, అమెరికాలోని తెలుగు సంఘాలు, స్నేహితులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ ఇప్పటివరకు హరికృష్ణ రెడ్డి ఆచూకీపై స్పష్టమైన సమాచారం లభించకపోవడం మరింత కలవరపెడుతోంది. వేల మైళ్ళ దూరంలో ఉన్న ఏకైక కుమారుడి కోసం తల్లిదండ్రులు కంటతడి పెట్టుకుంటూ ఎదురు చూస్తున్నారు. హరికృష్ణ రెడ్డి గురించి ఏ చిన్న సమాచారం లభించినా వెంటనే తెలియజేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు వేడుకుంటున్నారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌లకు సహకరించిన హెడ్‌కానిస్టేబుల్ అరెస్ట్

**తిరుపతి,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ డిమాండ్ కలిగిన ఎర్రచందనం శేషాచలం అక్రమంగా తరలించే స్మగ్లర్లతో చేయి కలిపి సమాచారం అందిస్తున్నాడనే ఆరోపణల ఆధారాలతో టాస్క్‌ఫోర్స్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌ను ఆ విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. స్మగ్లర్లకు పలు రకాలుగా సహకరిస్తున్నాడని హెడ్‌కానిస్టేబుల్ టి.సత్తిరాజును శనివారం టాస్క్‌ఫోర్స్ విభాగం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. స్మగ్లర్ల నుండి డబ్బులు తీసుకుని సమాచారం బయటకు చేరవేస్తున్నాడని ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. ఈ కేసులో ఆయన్ను అరెస్ట్‌చేసినట్లు చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో అనంతపురం జిల్లా వాసి మృతి

**తిరుపతి,జనవరి 10ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో చదువుతున్న కుమార్తెను సంక్రాంతిపండుగకు ఇంటికి తీసుకెళ్ళేందుకు వచ్చిన ఓ తండ్రి రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. బస్సుదిగి రోడ్డుపై నడచి వెళ్తుండగా ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తిరుపతి రూరల్ పోలీసుల కథనం మేరకు....అనంతపురంజిల్లా సికెపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డి(43) కుమార్తె తనపల్లి వద్ద చైతన్యకళాశాలలో ఇంటర్ చదువుతోంది. సంక్రాంతిపండుగకు కుమార్తెను ఇంటికి తీసుకెళ్ళేందుకు శనివారం ఉదయం తిరుపతికి వచ్చాడు. తనపల్లివద్ద రోడ్డుదాటుతుండగా కూడలిలో ప్రైవేట్ బస్సు ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన అతనిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్నకుమార్తె విషాదంతో కుప్పకూలింది. మృతుని వద్ద ఉన్న వివరాల మేరకుతిరుపతి రూరల్‌పోలీసులు అతని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు,.


మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి, బస్సుడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.



# కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో క్రీడల అభివృద్ధి సాధ్యం

- కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో మంత్రి రాంప్రసాద్ భేటీ
- గుంటూరు, కాకినాడలో జాతీయ ఉత్తమ క్రీడాకేంద్రాలు మంజూరుకు వినతి
- ప్రతి జిల్లాకు అదనపు ఖేలో ఇండియా కేంద్రాలు మంజూరు చేయాలని అభ్యర్థన

**విజయవాడ,జనవరి10,ప్రభాతవార్తప్రతినిధి:** కంద్ర-రాష్ట్ర సమన్వయంతో క్రీడల అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియాను రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.75.00 కోట్ల క్రీడా నిధులను మంజూరు చేసినందుకు కేంద్ర మంత్రికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులు రాష్ట్రంలోని క్రీడా వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేసే దిశగా కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పూర్తిస్థాయి, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఫుట్‌బాల్ మైదానం లేకపోవడంపై కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో, అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలో ఫుట్‌బాల్ మైదానం, ఫ్లడ్ లైట్స్, గ్యాలరీతో కూడిన అత్యాధునిక ఫుట్‌బాల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర సహకారం అందించాలని మంత్రి కోరారు. ఈ ఫుట్‌బాల్ మైదానం నిర్మాణం ద్వారా రాయచోటిలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల నిర్వహణకు అవకాశం కలుగుతుందని, ఇందుకోసం 24.90 ఎకరాల విస్తీర్ణంలో తగిన భూమి ఇప్పటికే అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. ఈ మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో ఫుట్‌బాల్ క్రీడకు వ్యూహాత్మకమైన అభివృద్ధికి, యువ క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడానికి దోహదపడతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, క్రీడా మౌలిక సదుపాయాల విస్తరణకు సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అథ్లెటిక్స్, ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్ విభాగాలకు జాతీయ ఉత్తమత్వ కేంద్రం (ఎన్‌సీఇవో) మంజూరు చేయాలని. కాకినాడ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిధిలో హాకీ, షూటింగ్ విభాగాలకు జాతీయ ఉత్తమ కేంద్రం ఏర్పాటు చేయాలని. ఖేలో ఇండియా పథకం కింద ఇప్పటికే రాష్ట్రంలో విజయవంతంగా పనిచేస్తున్న 26 కేంద్రాలతో పాటు, ప్రతి జిల్లాకు ఒక అదనపు జిల్లా స్థాయి ఖేలో ఇండియా కేంద్రం (దీలిరీఃది) మంజూరు చేయాలని. ఖేలో ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా, రూ. 675.36 కోట్ల అంచనా వ్యయంతో 56 క్రీడా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు మంజూరు చేయాలని కోరారు. అన్నమయ్య జిల్లా, రాయచోటి మండలం నక్కవండ్లపల్లి, దిగువ అబ్బవరం గ్రామంలో రూ. 42.62 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర విభజన అనంతరం క్రీడా మౌలిక సదుపాయాల కొరత ఉన్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సమగ్ర క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర సహకారం అందించాలని కోరారు. అనంతం మీడియాతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో యువత సంఖ్య అధికంగా ఉండటంతో క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం, క్రీడా ప్రతిభ, జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేస్తూ క్రీడల అభివృద్ధికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మంత్రి మండిపల్లి అభ్యర్థనలపై కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా గారు ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని, క్రీడల అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి ( రక్షా నిఖిల్ ఖడ్సే, ఎంపీ హరీష్ బాలయోగి ఉన్నారు.



# కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), జనవరి 10, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది పులగల నరసింహా, వెంకటసుబ్బయ్య, హరీష్,తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# 'మన శంకర వరప్రసాద్ గారు' టికెట్ ధర పెంపుపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** మెగాస్టార్, పద్మ భూషన్ కొణిదల చిరంజీవి న్యూ మూవీ మన శంకర వరప్రసాద్ గార్లు పై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ శనివారం న్యాయవాది విజయ్ గోపాల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దీనికి సంబంధించి హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సెలవు తర్వాత విచారిస్తామన హైకోర్టు స్పష్టం చేసింది. కాగా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కనున్న మన శంకర వరప్రసాద్ గారు సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది.



# గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తెలంగాణ

## గేమ్ ఛేంజర్‌గా తెలంగాణ ఎఐ ఇన్నోవేషన్ హబ్, ఎఐ యూనివర్సిటీ

## టెక్నాలజీ డిగ్రీలకే పరిమితం కావొద్దు.. దేశ సేవ, ఆత్మనిర్భరతకు ఉపయోగపడాలి

## బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 10:** తెలంగాణను గ్లోబల్ ఇన్నోవేషన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. టెక్నాలజీ కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా, దేశ సేవకు,ఆత్మ నిర్భరతకు ఉపయోగపడాలన్నారు. శనివారం బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో నిర్వహించిన బిట్స్ అల్యూమ్ని అసోసియేషన్ గ్లోబల్ మీట్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఇతర దేశాలు ప్రైవేట్ గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తే, భారత్ మాత్రం ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిన ఏఐ ఆధారిత తెలంగాణ డేటా ఎక్స్ ఛేంజ్ పరిశోధనలకు గొప్ప ఊతమిస్తోందన్నారు. త్వరలో ప్రారంభించబోయే తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, ఏఐ యూనివర్సిటీలు గేమ్ ఛేంజర్‌గా మారి ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలుస్తాయన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఇంటెలిజెన్స్ కంటే కోఆర్డినేషన్ అత్యంత ఖరీదైనదిగా మారిందన్నారు. ఏఐ వినియోగంలో డేటా ప్రైవసీ, ఎథిక్స్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఆర్ అండ్ డీపై దృష్టి సారించాలని టెక్ కంపెనీలను కోరారు. ఒకప్పుడు స్కేల్, స్పీడ్, వాల్యుయేషన్ ప్రాతిపదికన కంపెనీల సక్సెస్ నిర్ణయించబడేదని.. ఇప్పుడు ఆర్కిటెక్చర్, డేటా ఓనర్ షిప్, డెసిషన్ స్పీడ్, నమ్మకంపైనే వాటి మనుగడ ఆధారపడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో కేవలం కోడింగ్ తెలిసిన వారి కంటే, సమస్య మూలాలను గుర్తించి పరిష్కరించగల క్రియేటివ్ థింకర్స్‌కే జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందన్నారు. ఏఐ ఫలితాలు కేవలం నగరాలకే పరిమితం కాకూడదని, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లోని గ్రామీణ సమస్యలకు పరిష్కారం చూపేలా పరిశోధనలు జరగాలన్నారు. అప్పుడే టెక్నాలజీ ఫలాలు సామాన్యులకు కూడా అందుతాయన్నారు. తెలంగాణ రైజింగ్‌లో భాగస్వామ్యం కావాలని బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థులను, యాజమాన్యాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానించారు. ఏఐ, ఇన్నోవేషన్, అకడమిక్ రీసెర్చ్ వంటి అంశాల్లో బిట్స్ పిలానీతో కలిసి పని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో బిట్స్ అలుమ్ని అసోసియేషన్ ఛైర్ పర్సన్ ప్రేమ్ జైన్, మ్యాప్ మై ఇండియా ఫౌండర్ అండ్ ఛైర్మన్ రాకేష్ వర్మ, బీజీఎం 2026 ఛైర్ పర్సన్ అనిత తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్-విజయవాడ 10 సంక్రాంతి రైళ్లు

**హైదరాబాద్ (తార్నాక), జనవరి 10, ప్రభాతవార్త :** సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సంబంధిత అధికా రులు శనివారం వెల్లడించారు. ఛైర్‌కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేకరైళ్లను ఏర్పాటు చేసినట్లు అధికా రులు వెల్లడించారు. పండుగ ముందు, తరువాత రోజుల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ మధ్య 10 ప్రత్యేక రైళ్లు నడుపు తున్నట్లు వివరించారు. ఈ రైళ్లు ఈ నెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు నడుస్తాయని తెలిపారు. ఈ నెల 10, 11, 12, 17, 19వ తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక రైళ్లు నడుస్తాయని వెల్లడించారు. ఛైర్‌కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలని సూచించారు. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికిపైగా జనరల్ బోగీలు వాడుకోవచ్చన్నారు.

## ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలుచేయాలి

## త్వరలో ఉద్యమబాట పడతాం

## జాక్టో స్టీరింగ్ కమిటీ తీర్మానం

# పెండింగ్‌లోని ఐదు డిఎలను విడుదల చేయాలి

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకి పెండింగ్‌లో ఉన్న 5 డిఏలను వెంటనే విడుదల చేయాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్(జాక్టో) డిమాండ్ చేసింది. ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలని జాక్టో స్టీరింగ్ కమిటీ తీర్మానం చేసిందని జాక్టో ఛైర్మన్ జి సదానందం గౌడ్ తెలిపారు.

శనివారం కాచిగూడలోని ఎస్‌టియూ భవన్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో సదానందం గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైందని, ఉపాధ్యాయ బదలీలు, పదోన్నతులు, మొదటి తారీఖున వేతనాలు మినహా మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు పర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల్లోనే పిఆర్‌సి సిఫార్సులను అమలు చేస్తామని ఇచ్చిన మాట తప్పడం సరికాదన్నారు. ఉద్యోగులకు 51శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి పడిన 5 డిఏ లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య కార్డులు జారీ చేసి సక్రమంగా అమలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని జాక్టో ఛైర్మన్ డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు.

సమస్యల పరిష్కారానికి జాక్టో ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధం కావాలని తీర్మానించినట్టు తెలిపారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కొరకు నెలకు రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌కోసం ఏళ్ల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మోడల్, గురుకుల, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డ్స్ జారీ చేయాలన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలని, కేజీబీవీ, యుఆర్ఎస్ టీచర్లకు సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పిల్లల అల్మాంట్ కిడ్ సిరప్ నిషేధం

## అమ్మకాలు నిలిపివేయాలి


## తెలంగాణ ఔషధ నియంత్రణ మండలి నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పిల్లల కోసం వినియోగించే అల్మాంట్‌కిడ్ (ఆల్మోంట్-కిడ్) సిరప్‌ను నిషేధిస్తున్నట్టు తెలంగాణ ఔషధ నియంత్రణ మండలి(డిసిఎ) ప్రకటించింది. ఈ సిరప్‌లో మోతాదుకు మించి ప్రమాదకర రసాయనాలు (ఇథిలీన్ గ్లైకాల్) ఉన్నట్లు గుర్తించామని, ఆ సిరప్ ను వాడొద్దని డిసిఎ ప్రజలను హెచ్చరించింది. బిహార్‌కు చెందిన ట్రిడస్ రెమెడీస్ సంస్థ తయారుచేసిన ఎఎల్-24002 బ్యాచ్ సిరప్‌లలో కల్తీ జరిగినట్లు బెంగాల్‌లో గుర్తించారు. ఈ బ్యాచ్ సిరప్ ఎవరి వద్దనైనా ఉంటే వెంటనే వాడకం ఆపేయాలని, మార్కెట్‌లో దీని విక్రయాలను నిలిపివేయాలని తెలంగాణ డిసిఎ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసీం ఆదేశించారు. వాడకూడని సిరప్ ఆల్మంట్- కిడ్ సిరప్, బ్యాచ్ నం: ఎల్-24002, తయారీ తేదీ: జనవరి-2025, గడువు తేదీ: డిసెంబరు 2026. దీనిపై సమాచారం, ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబరు 18005996969లో సంప్రదించాలని డిసిఎ డైరెక్టర్ జనరల్ సూచించారు.

# మియాపూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

## 3 వేల కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం

**హైదరాబాద్, జనవరి 10,ప్రభాతవార్త:** మియాపూర్‌లో హైడ్రా శనివారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ విలేజ్ మక్తా మహబూబ్ పేట సర్వే నంబరు 44లో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ. 3 వేల కోట్ల వరకూ ఉంటుందని అంచనా. ఇదే సర్వే నంబరు 44లో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురి అవుతోందని హైడ్రాకు గతంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు గతేడాది డిసెంబరు 8వ తేదీన 5 ఎకరాల మేర ఉన్న ఆక్రమణలను తొలగించింది. మియాపూర్ బాచుపల్లి ప్రధాన రహదారికి ఆనుకుని 200ల మీటర్ల మేర ఉన్న 18 షెట్టర్లను హైడ్రా గతంలోనే తొలగించింది. తాజాగా అదే సర్వే నంబరు 44లో 15 ఎకరాలను శనివారం స్వాధీనం చేసుకుంది. రేకులతో హద్దులను నిర్ణయించి ఆక్రమణలకు పాల్పడగా.. వాటిని తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. సర్వే నంబరు 44లోని ప్రభుత్వ భూమిలో అక్రమ రిజిస్ట్రేషన్లతో పాటు.. సంబంధిత సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్ కు సంబంధించిన వార్తల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత శాఖల అధికా రులతో హైడ్రా పరిశీలించింది. ఆక్రమణలను నిర్ధారించుకుంది. హైడ్రాకమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు శనివారం 15 ఎకరాల మేర ఆక్రమణలను తొలగించి హైడ్రా ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది. 159 సర్వే నంబర్‌కు సంబంధించిన పత్రాలతో సర్వే నంబర్ 44లోని ఎకరన్నర వరకూ కబ్జా చేసిన ఇమ్రాన్ అనే వ్యక్తిపై ఇప్పటికే కేసు నమోదయ్యింది.



# కెటిఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

## హార్వర్డ్ యూనివర్సిటీలో ప్రసంగానికి పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 10:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 23వ ఎడిషన్ ఇండియా కాన్ఫ రెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం లభించింది. హైదరాబాద్, తెలంగాణపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడంలో కేటీఆర్ కీలక కృషికి గానూ ఈ ఆహ్వానం అందినట్లుగా నిర్వాహకులు తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో ఈ కాన్ఫరెన్స్ జరగ నుంది. ది ఇండియా వి ఇమాజిన్ (మన ఊహల్లోని భారత్) అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్, దక్షి ణా సియా దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, వ్యాపారవేత్తలు, పాలసీ మేకర్స్, సాంస్కృతిక రంగ నిపుణులు హాజరుకానున్నారు. గతంలో ఈ సదస్సుల్లో నీతాఅంబానీ, నితిన్ గడ్కరీ, జైరాంరమేశ్, అజీమ్‌ప్రేమ్‌జీ వంటి ప్రము ఖులు హాజరై ప్రసంగించారు. తాజాగా కేటీఆర్‌కు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం అందడం విశేషం. తెలంగాణను టెక్నాలజీ, ఇన్నో వేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కేటీఆర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఆహ్వానం అందిందని నిర్వాహకులు ప్రెస్‌నోట్‌లో తెలిపారు. హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో తొలిరోజు జరగబోయే సదస్సులో పాలన, అభివృద్ధి, పబ్లిక్ పాలసీలపై చర్చ జరగనుంది. ఇక రెండోరోజు హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్, ఆంత్ర ప్రెన్యూర్‌షిప్, గ్లోబల్ ఎకానమీ అంశాలపై చర్చ జరగనుంది. రెండోరోజు జరిగే ఈ సమావేశంలోనే కేటీఆర్ ప్రసంగించనున్నారు.

# రాముడి పేరును వాడుకునే హక్కు బిజెపికి ఎక్కడిది?

## ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదు: మహేశ్‌కుమార్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద, జనవరి 10:** శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిది? అని ప్రశ్నించారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని పేర్కొన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. తాను ఆంజనేయ స్వామి భక్తుడినని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే తప్ప మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన అంశాలను ప్రసారం చేయడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణా యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలి. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం అని చెప్పారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు పేర్కొన్నారు.

# బండ్ల గణేశ్ మహాపాదయాత్ర!

## షాద్‌నగర్ నుంచి తిరుమల దాకా.. చంద్రబాబు కోసం మొక్కు తీర్చుకోడానికే!

**షాద్‌నగర్, జనవరి 10, ప్రభాగవార్త :** ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ తిరుమల వేంకటేశ్వరస్వామి మొక్కు తీర్చుకోవడానికి షాద్‌నగర్ నుంచి తిరుమల వరకు మహా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాజకీయ, సినీ వర్గాల్లో ఈ నిర్ణయం ఆసక్తికరంగా మారింది. బండ్ల గణేశ్ పాదయాత్ర నిర్ణయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. నెటిజన్లు ఆయన సంకల్పాన్ని మెచ్చుకుంటూనే, ఇంత దూరం నడవడం అంటే చిన్న విషయం కాదని అభిప్రాయపడుతున్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు.. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయిన సమయంలో బండ్ల గణేశ్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. చంద్రబాబు నాయుడు నిర్దోషిగా విడుదల కావాలని, తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆయన తిరుమల శ్రీవారికి మొక్కుకున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి భారీ విజయం సాధించి చంద్రబాబు మళ్లీ సీఎం అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ మొక్కును తీర్చుకునేందుకు బండ్ల గణేశ్ సిద్ధమయ్యారు. బండ్ల గణేశ్ ఈ నెల 19న షాద్ నగర్‌లోని తన స్వగృహం నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి కాలినడకన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకోనున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ మహా పాదయాత్రలో రోజూ నిర్దిష్ట దూరం నడవడం, భక్తులతో కలిసి శ్రీవారి నామస్మరణ, భక్తి వాతావరణంలో ప్రయాణమే లక్ష్యంగా ఈ పాదయాత్ర కొనసాగనుంది.

## ఎప్‌సెట్‌కు టి-శాట్‌లో డిజిటల్ క్లాసులు

### 12 నుంచి ప్రారంభం.. సిఇఒ వేణుగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించనున్న ఎప్‌సెట్-2026తోపాటు ఇతర పోటీ పరీక్షలకు టి-సాట్ ప్రత్యేకంగా డిజిటల్ కంటెంట్ క్లాసులను నిర్వహించనుంది. ఈ క్లాసులను ఈ నెల 12 నుంచి ప్రారంభించనున్నట్టు టి-శాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్ విద్యను పూర్తి చేసుకొని ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ విద్యను ఎంచుకునే విద్యార్థుల కోసం టిసాట్ నెట్‌వర్క్ నాణ్యత కలిగిన డిజిటల్ కంటెంట్ అందిస్తోందని, వచ్చే విద్యా సంవత్సంలో ఆయా కోర్సులు ఎంచుకునే విద్యార్థులు పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు డిజిటల్ కంటెంట్ తోడ్పడుతుందని సీఈవో అన్నారు. పేద, మారుమూల ప్రాంత విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం టి-సాట్ వేదికగా కంటెంట్ అందిస్తూ విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత సేవలందిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే ఎప్‌సెట్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఈ నెల 12 సోమవారం నుండి మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బొటని, జువాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించి 112 రోజుల పాటు .. 450 పాఠ్యాంశ భాగాలను టి-సాట్ విద్య ఛానల్ లో ఉదయం ఏడు గంటలకు, నిపుణ ఛానల్‌లో సాయంత్రం 7 గంటలకు ప్రసారం చేయనున్నామని సీఈవో తెలిపారు. ప్రసారాలు టి-సాట్ శాటి లైట్ ఛానళ్లతోపాటు యాప్, యూట్యూబ్‌లోనూ అందుబాటులో ఉంటాయని.. విద్యార్థినీ, విద్యార్థులు డిజిటల్ పాఠాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్‌రెడ్డి సూచించారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

## జీ రామ్‌జీ చట్టంతో ఉపాధి కూలీల సంక్షేమం

### వికసిత్ భారత్ లక్ష్యంగా కృషి చేస్తున్న ప్రధాని మోడీ: దత్తాత్రేయ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉపాధి హామీ కూలీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభు త్వం తీసుకొచ్చిన జీ రామ్‌జీ చట్టం గ్రామీణ కూలీలకు ఎంతో ఉపయోగ పడు తుందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. గతంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు వంద రోజుల పని మాత్రమే కల్పించేవారని, జీ రామ్ జీ చట్టం ద్వారా గ్రామీణ ఉపాధి కూలీలకు 125 పనిదినాలు కల్పించడం జరుగుతుందన్నారు. కూలీల వేతనాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే జమ చేసేలా చట్టం రూపొం దించారని తెలిపారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం ఎన్నో సంస్కరణలు తీసుకొస్తుంటే వాటిని అడ్డుకోవాలని విపక్షాలు ప్రయత్నించడం సరికాదన్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర సర్కార్ విడుదల చేసే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఎంతో దోహదపడతాయన్నారు. 2040 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోడీ పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వంగ రామచంద్రారెడ్డి, చందు. పట్టణ పార్టీ అధ్యక్షులు బాసంగారి వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కురుమ సంఘం ఉద్యోగుల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను మాజీ గవర్నర్ దత్తాత్రేయ ఘనంగా సత్కారించారు. ఉద్యోగులకు సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## అటల్ పెన్షన్ యోజన పథకంలో దేశవ్యాప్తంగా 8.59 కోట్ల చందాదారులు

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులు కలిసి అటల్ పెన్షన్ యోజన పథకం (ఎపివై) కింద 8.59 కోట్ల మంది చందాదారులను చేర్చినట్లు పిఎఫ్ఆర్‌డిఎ చీఫ్ జనరల్ మేనేజర్ ప్రవేశ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్‌లో స్టాఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ తెలంగాణలో బ్యాంకులు కలిసి ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి తమ వార్షిక పెన్షన్ పథక లక్ష్యాలలో 61 సాధించాయన్నారు. రాష్ట్రం 100 శాతం లక్ష్యాలను అధిగమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణంతో పాటు, పట్టణ ప్రాంతాలలో కూడా ఎపివై గణనీయమైన పరిధి ఉందని వెల్లడిస్తూ, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులను చేర్చుకోవాలని కోరారు. దీర్ఘకాల ప్రభుత్వ హామీ, హామీతో కూడిన పెన్షన్ ప్రయోజనాలు, అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక భద్రతతో సహా పెన్షన్ పథకం ప్రత్యేక బలాన్ని ఇస్తుందన్నారు, ఆర్థిక సమ్మిళితాన్ని మరింతగా విస్తరించడానికి తీవ్ర ప్రయత్నాలు చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఎల్‌బిసి డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రియవ్రత మిశ్రా మాట్లాడుతూ, వృద్ధాప్యంలో పౌరులకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ఉన్న ఈ పెన్షన్ యోజన పథకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోని బ్యాంకులు డిసెంబరు నాటికి 2,98,658 మంది చందాదారులను చేర్చాయని చెప్పారు.

## తెలంగాణ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌మీట్‌ను ఘనంగా నిర్వహించిన శ్రీచైతన్య స్కూల్

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** శ్రీచైతన్య స్కూల్ తమ తెలంగాణ రాష్ట్ర స్థాయి డాక్టర్ బిఎస్ రావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు ఉత్సవాన్ని శనివారం గచ్చిబౌలి స్టేడియం, హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీచైతన్య స్కూల్ నాణ్యమైన, మెరుగైన విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ తమ విద్యార్థులను వారికి ఇష్టమైన క్రీడాంశాలలో శిక్షణనిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, విద్యార్థుల, తల్లిదండ్రుల మన్ననలను పొందుతోంది. దేశ వ్యాప్తంగా 20కి పైగా రాష్ట్రాలలో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌కి చెందిన 685 బ్రాంచీలలో జరిగిన బ్రాంచ్ లెవెల్ పోటీలను నిర్వహించారు. తెలంగాణాలోని 90 బ్రాంచిల నుండి 59778 మంది విద్యార్థులు బ్రాంచ్ లెవెల్ పోటీలలో పాల్గొన్నారు. ప్రతి బ్రాంచ్ నుండి 138 మంది విద్యార్థులను జోనల్ లెవెల్ పోటీలకు ఎంపిక చేయగా, ఈ జోనల్ లెవెల్ పోటీలలో మొత్తం 12420 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారినుండి 630 మంది అత్యంత ప్రతిభ కనబరిచిన వారిని ఫైనల్ పోటీలకు ఎంపిక చేయటం జరిగింది. వారికి వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, 100 మీటర్ల పరుగు, షాట్ పుట్‌లలో పోటీలు నిర్వహించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ బొప్పన ఝాన్సీలక్ష్మీ బాయి ముఖ్య అతిథిగా నిర్వహించిన కార్యక్రమంలో, శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ బొప్పన సీమా, మాదాపూర్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు, రీతి రాజ్, తెలంగాణా ఈగిల్ ఫోర్స్ ఎస్‌పి సీతారాం, ఇండియన్ వాలీబాల్ టీం మాజీ కెప్టెన్ వెంకట నారాయణ, సినీ యాక్టర్ కిరణ్ అబ్బవరం, సినీ డైరెక్టర్ వివిఎన్ ఆదిత్య, ప్రముఖ టివి యాక్టర్ రామ్ ప్రసాద్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. వివిధ క్రీడాంశాలలో గెలుపొందిన విద్యార్థులు హాజరైన ప్రముఖుల నుండి బహుమతులు స్వీకరించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ బొప్పన సీమా విజేతలను



# మేడారం జాతరలో పకడ్బందీగా వైద్య సేవలు

### మూడు ఆస్పత్రులు.. 30 మెడికల్ క్యాంపుల ఏర్పాటు
### జాతరకు వెళ్లే రూట్లలో 35 అంబులెన్సులు..
### 3,199 మంది సిబ్బందితో వైద్యసేవలు
### అధికారుల సమీక్షలో వైద్యమంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా జరిగే మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. శనివారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం 8 ప్రధాన రూట్లలో వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి అధికారులను ఆదేశించారు. అందుకోసం 42 ఎన్‌రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. హనుమకొండ మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి చెప్పారు. జాతరలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారని, వారికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారని అధికారులు తెలిపారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజులపాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు.. 248 రకాల మందులు, సర్జికల్ సామగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధంచేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 25 నుంచి అన్ని వైద్యశిబిరాలు పూర్తిస్థాయిలో పని చేసేలా ప్రణాళిక రూపొందించా మన్నారు. క్షేత్ర స్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని మంత్రి ఆదేశించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశించారు.

## హైదరాబాద్‌లో మరో బడా సైబర్ మోసం

### స్టాక్ మార్కెట్‌లో చిట్కాలు చెబుతామని విశ్రాంత ఐపిఎస్ అధికారి భార్యకు రూ. 2.58 కోట్ల టోకరా

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వారి ఆగడాలు మాత్రం ఆగడం లేదు. రోజుకో తరహా మోసంతో అమాయకులను సైబర్ నేరగాళ్లు ముంచుతునే వున్నారు. తాజాగా హైదరాబాద్‌లో ఓ విశ్రాంత ఐపిఎస్ అధికారి సతీమణికి స్టాక్ మార్కెట్‌లో చిట్కాలు చెబుతామని నమ్మించి రెండు కోట్ల 58 లక్షల రూపాయలను కాజేశారు. వివరాలు ఇలావున్నాయి. నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో విశ్రాంత ఐపిఎస్ అధికారి కుటుంబం వుంటుంది.

సదరు మాజీ అధికారి కేంద్ర సర్వీసులో చాలాకాలం పాటు పని చేశారు. ఆయన సతీమణి సెల్‌ఫోన్‌కు ఇటీవలే సైబర్ నేరగాళ్లు స్టాక్ మార్కెట్ లావాదేవీల సమాచారం చెబుతామని మాటలు కలిపారు. మొదట వీ టిని నమ్మని ఆమె ఆ తరువాత వరుసగా మెసేజ్‌లు రావడంతో నమ్మింది. దీని తరువాత స్టాక్ మార్కె ట్లో 500 శాతం లాభాలు వచ్చేలా చేస్తామ ని, ఇందుకు తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇది నిజమని నమ్మిన ఆమె నేరగాళ్ల చెప్పినట్లుగానే గత డిసెంబరు 24వ తేదీ నుంచి ఈ నెల ఐదవ తేదీ వరకు 19సార్లు విడతల వారిగా రెండు కోట్ల 58 లక్షల రూపాయలను పలు కంపెనీల్లో పెట్టు బడులు పెట్టింది. ఈ క్రమంలో తన భర్త ఫోన్ నంబర్‌ను కూడా వారితో పంచుకుంది. అయితే లాభాల కోసం మరింతగా పెట్టుబడులు పెట్టాలని నేరగాళ్ల కోరడ ంతో ఆమె గట్టిగా నిలదీసి మొదల లాభాలు ఇవ్వాలని కోరింది. ముందు మరింత పెట్టుబడులు పెడితే తప్ప లాభాలు రావని, ఎక్కువ మాట్లాడితే ఇప్పటివరకు పెట్టిన డబ్బులు కూడా పోతాయని నేరగాళ్ల చెప్పడంతో తాను మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీ నిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.



ఈగల్ పోలీసుల దాడిలో ఒపిఎంతో పట్టుబడిన దాబా యజమాని గుర్మీత్‌సింగ్

## విజయవాడ దారిలో ఓపిఎం విక్రయాలు

### ఈగల్ పోలీసుల దాడుల్లో పట్టుబడిన ధాబా యజమాని

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** హైదరాబాద్...విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల వద్ద రోడ్డు పక్కన గల దాబాలో దూర ప్రాంతాల కు వెళ్లే డ్రైవర్లకు రహస్యంగా ఓపిఎం అమ్ముతున్న వైనాన్ని ఈగల్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా దాబా యజమానిని అరెస్టు చేయడం తో పాటు అతని వద్ద నుంచి తొమ్మిది కిలోల ఓపిఎం పౌడర్‌ను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా శనివారం మీడియాకు వెల్లడించారు. చిట్యాల వద్ద రోడ్డు పక్కన గల దూన్ పంజాబి దాబాలో కొంత కాలంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన లారీ డ్రై వర్లకు దొంగచాటుగా ఓపిఎం అమ్మ కాలు జరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల డ్రైవర్లలో కొందరు ఓపిఎం సేవించి డ్రైవింగ్ చేస్తుంటారు. ఇది ప్ర మాదకరం అని తెలిసినా వారు ఈ అలవాటును వీడడం లేదు. ఓపిఎం అనేది తెలుగులో నల్లమందుగా పిలుస్తుంటారు. ఘాటైన మత్తు పదార్థం కావడంతో దీనిని తీసుకున్న వారు నిషాలో జారుకుంటారు. ఈ సమయంలో వాహనాల డ్రైవింగ్ మరింత ప్రమాదకరం. ఈ విషయం తెలిసి కూడా దాబా యజబాని గుర్మీత్ సింగ్ (24) ఓపిఎం పౌడర్‌ను లారీ డ్రైవర్లకు అమ్ముతున్నాడు. దీనిని అతను ఉత్తరాది రాష్ట్రాలలో కొందరు స్మగ్లర్ల నుంచి కిలో 1800 రూపాయలకు కొని ఇక్కడ ఆరు వేలకు అమ్ముతున్నాడు. అవసరాన్ని బట్టి ధరను పెంచుతూ దండిగా సంపాదిస్తున్నాడు. ఇటీవలే ఇతను 20 కిలోల ఓపిఎం పౌడర్‌ను కొన్నాడు. ఇందులో 11 కిలోలను అమ్మేయగా మిగతా తొమ్మిది కిలోలను తన వద్ద వుంచుకున్నాడు. కాగా గుర్మి త్ సింగ్ ఉత్తర్‌ఖండ్‌కు చెందిన వ్యక్తి. కొన్నేళ్లుగా ఇక్కడ దాదా నిర్వహిస్తున్నాడు. గుర్మిత్ సింగ్ బండారంపై పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు శుక్రవారం రాత్రి దాబాపై దాడిచేసి తొమ్మిది కిలోల ఓపిఎం పౌడర్‌ను పట్టుకున్నారు. దీంతో పాటు అతన్ని అరెస్టు చేశారు. కాగా రాష్ట్ర ంలో డ్రగ్స్‌కు సంబంధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా టోల్ ఫ్రీ నంబర్ 1908 లేదా 8712671111కు ఫిర్యాదు చేయాలని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.

## క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోన్న ముఖ్యమంత్రి

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 10, ప్రభాతవార్త:** రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్య మంత్రి అయ్యాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని పిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బి.మహేష్‌కుమార్‌గౌడ్ చెప్పారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం 840 కోట్ల రూపాయలు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్, రాజ్యసభ మాజీ ఛైర్మన్ వి.హనుమంతరావు నేతృత్వంలో 19వ రాజీవ్‌గాంధీ అండర్-19 డే అండ్ నైట్ లీగ్ ట్వంటీ-20 ఫైనల్ మ్యాచ్ శనివారం ఎల్‌బి స్టేడియంలో అద్భుతంగా జరిగింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు పాల్గొన్న మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు విన్నర్స్, రన్నర్స్, ఇతర క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని, అనివార్య కారణాల వల్ల ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని తెలిపారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని క్రీడా మైదానాల అభివృద్ధి కోసం సిఎం ఎంతో కృషి



క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రులు శ్రీహరి, లక్ష్మణ్, వి.హనుమంతరావు, కెకె తదితరులు

చేస్తున్నారని, క్రీడాకారులను ప్రోత్స హిస్తున్నారని చెప్పారు. అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో రాష్ట్రం స్పోర్ట్స్ హబ్‌గా మారబోతున్నదని చెప్పారు.

మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్‌గాంధీ క్రీడలకు, ఐటికి అధిక ప్రాధాన్యత కల్పించారని, అందుకే ప్రతి యేడాది ఆయన పేరిట క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పా రు. రేవంత్‌రెడ్డి సిఎం అయిన తరువాత క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన వివరించారు. సమావే శంలో రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఛైర్మన్‌లు కోదండరెడ్డి, మెట్టు సాయి, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, క్రికెట్ ఫెరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఆది అవినాష్, ప్రధాన కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో నిరుద్యోగులకు రూ. 5 కోట్ల టోకరా

### సర్కారీ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల పేరిట భారీగా డబ్బు వసూలు.. ముగ్గురి అరెస్టు

**హైదరాబాద్, జనవరి 10, ప్రభాతవార్త:** ప్రభుత్వ విభాగాల్లో మంచి వేతనంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగులను నిండా ముంచి ఐదు కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసిన ముగ్గురు నేరగాళ్లను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లతో పాటు తప్పుడు అప్పాయింట్‌మెంట్ లెటర్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి అఖిల్ మహాజన్ శనివారం నాడు మీడియాకు వెల్లడించారు. ఆదిలాబాద్ పట్టణంలో అనంత్ సొల్యూషన్, విద్యాదాన్ ఆర్గనైజేషన్‌ల పేరుతో హైద రాబాద్‌కు చెందిన జట్టబోయిన మధు కిరణ్ అనే వ్యక్తి స్వచ్ఛంద సంస్థలను స్థాపించి ప్రభుత్వ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు ఖమ్మం, వరంగల్ జిల్లాలలో 350 మంది నిరుద్యోగులను నమ్మించాడు. ఒక్కో నిరుద్యోగి నుంచి లక్ష రూపాయల నుంచి రెండున్నర లక్షల రూపాయల వరకు వసూలు చేశాడు. ఇతనితో పాటు హైదరాబాద్‌కే చెందిన మాదాసి సుధాకర్, గోదావరిఖనికి చెందిన ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ నమ్మని సతీష్, సుజాత ఠాకూర్, లావణ్యలు ఈ ముఠాలో వున్నారు. వీరితో పాటు బోథ్ ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ కూడా నిందితులతో చేతులు కలిపాడు. విద్యా శాఖను ఈ ముఠా టార్గెట్ చేసు కుంది. కేంద్రం నుంచి అందే సిఎస్ఆర్ నిధుల ను కాజేయాలని ఈ ముఠా పక్కాగా వ్యూహం పన్ని నిరుద్యోగులను టార్గెట్ చేసుకుంది. ఈ క్రమంలో పలువురికి నకిలీ అప్పాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి వారిని మోసం చేశారు. ఈ విషయాన్ని నిరుద్యోగులు ఆలస్యంగా తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదిలాబాద్ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మొదట బోథ్ ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేశారు. మిగతా వారిలో మధు కిరణ్, మాదాసి సుధాకర్, నమ్మని సతీష్‌లను శనివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లతో పాటు తప్పుడు అప్పాయింట్‌మెంట్ లెటర్లను జప్తు చేశారు. మిగతా ఇద్దరు నిందితులు సుజాత ఠాకూర్, లావణ్యల కోసం గాలిస్తున్నారు. ఈ కేసుపై విచారణ చేస్తున్నామని ఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో డి ఎస్‌పి జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను కిడ్నాప్ చేస్తున్న ముఠా అరెస్ట్



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

**వరంగల్ క్రైం, జనవరి 10, ప్రభాతవార్త:** వరంగల్ నగరంలో చిన్నపిల్లల కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నిందితులను కాజీపేట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుల్లో పెద్దపెల్లి జిల్లాకు చెందిన కొడుపాక నరేష్ (42), వెల్పుల యాదగిరి (32) ఇరువురు పెద్దపల్లి టౌన్, పెద్దపల్లి జిల్లాకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్ట్‌కు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తూ గత డిసెంబరు 28న తెల్లవారుజామున కాజీపేట రైల్వేస్టేషన్ బయట ఫుట్‌పాత్‌పైన నిద్రిస్తున్న కన్నా నాయక్ కుమారుడైన 5 నెలల వయసున్న మల్లన్న అనే బాలుడిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసిన సంఘటనలో బాలుడి తండ్రి కన్నా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కాజీపేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బృందాలుగా ఏర్పడి విచారించగా నేర స్థలంలో లభించిన ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు ఇద్దరు శనివారం కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలో పట్టుకొని విచారించగా 28 డిసెంబరు, 2025 రోజున కిడ్నాప్ చేసిన కిడ్నాప్‌తో పాటుగా గతంలో నలుగురు చిన్న పిల్లల్ని కిడ్నాప్ చేసినట్టుగా ఒప్పుకున్నారు. పిల్లలను వీళ్లు పిల్లలు లేని దంపతులకు అనాధాశ్రమాల నుంచి తీసుకొచ్చి ఇస్తున్నట్టుగా నమ్మబలికి డబ్బులకు అమ్ముకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్, కాజీపేట పోలీస్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ అభినందించి రివార్డులను అందజేసారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి కవిత, టాస్క్‌ఫోర్స్, కాజీపేట ఎసిపిలు మధుసూదన్, ప్రశాంత్‌రెడ్డి, కాజీపేట ఇన్స్ స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

## దక్షిణభారత స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు కుమ్రంభీం జిల్లా ఉపాధ్యాయుడు, విద్యార్థి ఎంపిక



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు మామిడాల తిరుపతయ్య

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 10, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లా పాతరాజంపేటలో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో కుమ్రం ఆసిఫాబాద్ జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థి, ఉపాధ్యాయుడు దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. విద్యార్థుల విభాగంలో కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి ఎస్. ప్రవీణ్ కుమార్ హరిత శక్తి (గ్రీన్ ఎనర్జీ) విభాగంలో ప్రతిభ కనబర్చి దక్షిణ భారత స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక కాగా ఉపాధ్యాయుల విభాగంలో 9,10 తరగతి విద్యార్థులకు రసాయన శాస్త్రంను సులభంగా బోధించుటకు అవసరమైన బోధనోపకరణాలు తయారు చేసినందుకు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పెట్రోల్ పంప్ కాగజ్‌నగర్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు మామిడాల తిరుపతయ్య దక్షిణ భారత స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 2023, 2024,2025,2026 వరుసగా నాలుగు సంవత్సరాలు రాష్ట్ర స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనికి కుమ్రం భీం జిల్లా నుండి ఉపాధ్యాయ విభాగంలో టీఎల్ఎం(బోధనోపకరణాల) తయారీలో ఎంపిక కాబడి 2023లో కెరళలో త్రిచూర్‌లో నిర్వహించిన పోటీలకు హాజరయ్యారు. 2024లో విజయవాడలో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబీషన్‌కు హాజరయ్యారు. అదే విధంగా ఈ సంవత్సరంలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న దక్షణ భారత స్థాయి సైన్స్ ఎగ్జిబీషన్‌కు హాజరవుతున్నందుకు గాన అభినందించినట్లు తెలిపారు. కామారెడ్డిలో గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అంజిరెడ్డి, కమిషనర్ ఫర్ స్కూల్ ఎడ్యూకేషన్ నవీన్ నికోలస్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి దీపక్ తివారి, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ ఎంపికైన విద్యార్థి, ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. దక్షిణ భారత స్థాయిలో కూడా జిల్లా ప్రతిష్ఠను నిలబెట్టాలని ఆకాంక్షించారు. ఈ పోటీలు ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# అరిసెలు

**కావలసినవి :** .బియ్యం 1 కిలో, బెల్లం: 1 కిలో, నువ్వులు 100 గ్రా, నెయ్యి , నూనె వేయించ డానికి.



**తయారీ :** బియ్యాన్ని రాత్రంతా వీలయితే ఒక రోజంతా నానబెట్టాలి. ★ ఒకవేళ కుదిరితే బియ్యం పిండిని ఇంట్లో కాకుండా మిల్లులో మర పట్టించడం మంచిది పిండి బాగా నలిగి అరిసెలు కూడా మృదువుగా వస్తాయి. ★ ఎప్పుడూ అవసర మైన దాని కన్నా ఎక్కువ పిండిని ఉంచుకోవాలి. ఒకవేళ బెల్లం పాకం ఎక్కువ అనుకోకుండా కాస్త బియ్యం పిండి వేసి సరిచేయవచ్చు.★ బెల్లం పాకం చేసేటప్పుడు బెల్లం తురుములో నీళ్ళు చాలా కొద్దిగా మాత్రమే పోయాలి. ఎక్కువగా పోస్తే పాకం పల్చగా అయ్యి అదంతా ఆవిరి అయ్యే వరకు కలుపుతూనే ఉండాల్సొస్తుంది. ★ అరిసెల పిండి చపాతీ పిండిలా గట్టిగా అయ్యే వరకు బెల్లం పాకంలో బియ్యం పిండి వేసి కలుపుతూనే ఉండాలి. ఒక వేళ పిండి కాస్త పలుచగా కానీ జారుగా కానీ ఉన్నా అరిశలు విపరీతంగా నూనె పిలుస్తాయి.అంటే కాకుండా వేయిందాక బాగా గట్టిగా అవుతాయి. అందుకే పిండిలో ఎక్కువ తేమ లేకుండా చూసుకోవాలి. ★ మీడియం స్లిమ్ మీద ఉడికించడం వల్ల పై భాగమే కాకుండా లోపల కూడా చక్కగా ఉడుకుతుంది. ★బెల్లం పాకంలో నెయ్యి గానీ నూనె గానీ వేయాలి, అరిసెల పిండి కలిపాక ఆ నెయ్యి పిండిని అన్ని అరిసెలను వేయించే లోపు పొడిబారకుండా కాపాడు తుంది అంతే కాకుండా పిండిలో కలిపి ఉన్న నెయ్యి వేయించేటప్పుడు బయటి నుండి వచ్చే నూనెను పీల్చనివ్వకుండా చేస్తుంది.★ అరిసెలను నూనె లోకి జార విడిచే టప్పుడు, తిప్పేటప్పుడు ఇంకా వేయిందాక నూనె పిండేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. పొరబాటున నూనె మీద చింది అవకాశం ఉంది.అరసలను రెండు వారాల వరకు నిలవ చేసుకోవచ్చు.

# ఆమె బామ్మల టీచరమ్మ !



**ఆ ఊరిలో నిరక్షరాస్యులు ఉండకూడదు అనుకుంది. చదువుకుని ఉద్యోగానికే పరిమితం కాకుండా గ్రామంలో వృద్ధులకూ చదువు చెప్పాలనుకుంది. వారి జీవితంలో వెలుగులు నింపాలనుకుంది. అందుకే అప్పటి వరకు పుస్తకం పట్టని వారికి చదవడం, రాయడం నేర్పడానికి టీచర్‌గా మారింది 28 ఏళ్ల రాజ్వీందర్‌కౌర్.**

పంజాబ్లోని బల్ల గ్రామంలో పుట్టి పెరిగింది రాజ్వీందర్ కౌర్, సామాజిక అడ్డంకులు, తల్లిదండ్రులు విద్యకు ప్రాధాన్యత ఇవ్వలేదు మా గ్రామంలో చాలామంది వృద్ధులు చదువుకోలేదు. పెన్షన్, బీమా, ఆస్తిపత్రాలపై సంతకాలు పెట్టడానికి బదులు వేలిముద్రలు వేసేవారు. ఈ పరిస్థితిని మార్చాలనుకున్నా. వారికి చదవడం, రాయడం నేర్పించాలనుకున్నా. సర్దార్ గుర్బజన్స సేవాసమితి సొసైటీ స్థాపించిన 'ది బెబే బాపు' స్కూల్లో 50ఏళ్ల పైబడిన వారికి చదువు చెబుతున్నాను. ప్రస్తుతం వందమందికి పైగా విద్యార్థులు ఇక్కడ పాఠాలు



నేర్చుకుంటున్నారు. మొదట మా ఊళ్లో ఈ విషయం చెప్పినప్పుడు మలివయసులో చదువేంటి అన్నవారే ఎక్కువ. చదువుకి వయసుతో పనేంటి? ఇది అందరికీ ఉపయోగపడుతుందని బోధించడం మొదలు పెట్టా నా ప్రయత్నం ఫలిస్తోంది. వీళ్లలో చాలామంది వేలిముద్ర మాని సంతకాలు చేస్తున్నారు. ఇంకొందరు విదేశాల్లో ఉన్న తమ పిల్లల్ని కలుసు కోవడానికి ఉన్నప్పుడు. ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆయాపత్రాల్లో సంతకాలు పెడుతున్నారు. ఇలా వాళ్ల సంతకం వాళ్లే పెట్టుకున్న వారికి బహుమతులిచ్చి ప్రోత్సహిస్తా. అంతేకాదు. వీళ్లకోసం ప్రత్యేకంగా లైబ్రరీలను ఏర్పాటుచేశాం. అక్కడకీ, పెద్దలకీ కలిపి క్లాసులు పిల్లలను నిర్వహిస్తాం. దీనితో ఒకరి నుంచి మరొకరు తెలియని విషయాలు తెలుసుకోగలుగు తున్నారు. చిన్నారుల పెద్దకీలపట్ల గౌరవమూ పెరుగుతుందంటారీమె. ◻

# తిరుప్పావై

## 27వ పాశురము



కూడారై వెల్లుమ్‌శీర్ గోవిన్దా!
వుందన్నై
ప్పాడి పఱైకొణ్ణు యామ్ పెఱు
శమ్మానమ్,
నాడుపుకళుమ్ పరిశినాల్ నన్టాక
శూడగమే తోళ్ యే తోడే
శెవిప్పూవే.
పాడగమే యెన్టనైయ పల్
కలనుమ్ యామణివోమ్,
ఆడైయుడుప్పోమ్ అదన్ పిన్నే
పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్‌తు ముళంగై
వళివార
కూడియిరున్దు కుళిర్‌న్దేలో
రెమ్బావాయ్

నిన్ను ఆశ్రయింపని వారిని కూడా వారి మనసులను మార్చి నీకు దాసులైనట్లు చేసి విజయాన్ని సాధించగల ధీమంతుడా ఓ గోవిందా! నిన్ను సుత్తించి నీనుండి 'పఱ' అనే పద్యాన్ని పొంది లోకులచే సన్మానింపబడలేనని మా కోరిక నీ అనుగ్రహానికి పాత్రులమైన మమ్ము లోకమంత పొగడాలి. మేము పొందు ఆ సన్మానము లోకులందరూ పొగుడునట్లుండాలి. అనాటి మా రూపాలు ప్రకాశవంతంగా, తేజోమయంగా విరాజిల్లుతూ వుండాలి. దానికై మాకు కొన్ని భూషణాలు కావాలి. ముంజేతులకు కంకణాలు కావాలి.

# సంక్రాంతి రుచులు

సంక్రాంతికి ముంగిట్లో ముగ్గులు అందరూ వేస్తారు. కానీ మీరు మాత్రం కాస్త ప్రత్యేకంగా నూనెలో అందమైన మెలికల ముగ్గులు వేసుకోవాలనుకుంటున్నారు. అయితే ఈ రకరకాల పిండి వంటలను వెంటనే ప్రయత్నించి రుచులను ఆస్వాదించండి మరి.

# సకినాలు



**కావలసినవి :** కిలో పిండికి, 100 గ్రాముల నువ్వులు, వాము: 10 గ్రాములు, ఉప్పు రుచికి సరిపడా , నూనె **తయారీ :** తయారైన పిండిలో కొద్ది కొద్దిగా నీళ్ళు పోసుకొని కలుపుకుంటూ ఉండాలి మరీ గట్టిగ కాకుండా మరీ పలచగా కాకుండా చేసుకోవాలి. అలా కలిపినా దానిని ఒక పదిహేను నిముషాలపాటు మూత పెట్టి ఉంచాలి. తర్వాత దానిని ఏదైనా కాటన్ వస్త్రంలో కట్టి పిండితో గుండ్రంగా చుట్టాలి. మొత్తం సకినాల ఆకారం వచ్చేదాక చుట్టాలి. వాటిని మరుగుతున్న నూనెలో వేసి గోలించుకోవాలి. అంతే రుచికరమైనసకినాలు రెడి అయిపోతాయి.మీకు ఏ రకమైన షేప్స్ కావాలని అనుకుంటారో ఆ షేప్స్‌లో చేసుకోవచ్చు. ఇంట్లో ఎంత మంది ఉంటే అన్ని ఉట్టిలు చేస్తారు. ఉట్టి అంటే మూడు చుట్లు కాకుండా కొద్దిగా పెద్దగా వేస్తారు. ఇది పలక షేప్‌లో ఉంటుంది. ఉదాహారణకు పలక, బలపం, రోలు, రోకలి మురుకు ఇంకా చాలా రకాల షేప్స్ లో చేసుకోవచ్చు. పిల్లలకు కావాల్సిన, ఇష్టమున్న షేప్స్ కూడా చేసుకోవచ్చు. **ఆరోగ్య ప్రయోజనాలు..** ఇక ఈ సకినాలలో ఉపయోగించే వాము కూడా జలుబు, దగ్గు వంటి సమస్యలను దూరం చేస్తుంది. సకినాల్లో ప్రధాన పదార్థం నువ్వులు. దీంట్లో పోషకాలు మెండు. ఇనుము శాతం అధికం. వీటిని తరచుగా తినడం వల్ల రక్తహీనత సమస్య తగ్గుతుంది. దీంట్లో అమినోయా సిడ్‌లు, మెగ్నీషియం, మాంసకృత్తులు కూడా అధికం. ఇవి రక్తపోటును నియంత్రిస్తాయి. రక్తంలోని చక్కెరస్థాయిని అదుపు చేయడంలో నువ్వుల పాత్రం గొప్పది. నువ్వులు తినడం వల్ల ఉబ్బస వ్యాధి నియంత్రణలోకి వస్తుంది. రక్తనాళాలు, ఎముకలు, కీళ్ల సక్రమంగా పనిచేస్తాయి. వీటిలో సెసమాల్ అనే యాంటీ ఆక్సిడెంట్ గుండె వ్యాధులను రానీయకుండా చేస్తుంది. లిగ్నిన్స్ అనే ఫైబర్ చెడు కొవ్వును దరిచేరనీయదు. నువ్వుల్లో ఉండే కాల్షియం మానసిక ఒత్తిడి నుంచి రక్షిస్తుంది.

# నువ్వుల లడ్డు



**కావాల్సిన పదార్థాలు:** నువ్వులు 1 కప్పు బెల్లం 1 కప్పు, నెయ్యి.
**తయారీ :** ముందుగా ఒక కడాయి లో ఒక కప్పు నువ్వులు వేసుకొని సన్నని సెగ పై నువ్వులు చిటపటమన్నంత వరకు వేయించుకోవాలి, నువ్వులు వేగి కొద్దిగా కలర్ చేంజ్ అయ్యాక స్టవ్ ఆఫ్ చేసి చల్లారానివ్వాలి, ఒక మిక్సీ జార్ లో చల్లారిన నువ్వులు వేసి భండగా గ్రైండ్ చేసుకొని, అందులో ఒక కప్పు బెల్లం వేసుకొని మళ్లీ గ్రైండ్ చెయ్యండి, నువ్వులలో ఆయిల్ రిలీజ్ అవుతుంది. ఒక ప్లేట్ లోకి తీసుకోని లడ్డు సైజులో ఉండలు చుట్టుకోవాలి. అంతే ఎంతో ఆరోగ్యకరమైన బెల్లం నువ్వుల ఉండలు రెడీ.. ఈ నువ్వుల లడ్డుని రోజుకి ఒకటి చొప్పున తిన్న ఎంతో ఆరోగ్యం..

# జంతికలు




**కావాల్సినవి:** బియ్యప్పిండి రెండు కప్పులు, సెనగపిండి ముప్పావు కప్పు, వెన్న పావు కప్పువాము, నువ్వులపొడి రెండు టీస్పూన్లు, పసుపు అర టీస్పూన్, ఉప్పు తగినంత, కారం టీస్పూన్, గరంమసాలా పొడి టీస్పూన్, చాట్మసాలా పొడి అర టీస్పూన్.
**తయారీ:** వెడల్పాటి పాత్రలో బియ్యప్పిండి, సెనగపిండి మిగిలిన పదార్థాలన్నీ వేసుకోవాలి. కొద్దికొద్దిగా నీళ్లు పోస్తూ పిండిని ముద్దల కలపాలి. జంతికల గొట్టంలో కొద్దిగా నూనె రాసి కొంచెం మిశ్రమాన్ని పెట్టాలి. కడాయిలో నూనె పోసి మరిగించి జంతికలు వేయాలి. మధ్యస్థంగా ఉండే మంట మీద రెండు వైపులా వేయించి తీయాలి.

# రంగవల్లి



**ఉషశ్రీ రజిత**
హైద్రాబాద్



**15 చుక్కలు,, 8 వరకు సందుచుక్కలు**



**జయశ్రీ**
సికింద్రాబాద్



**15 చుక్కలు, 5 వరుసలు ఇటు అటు వదిలి 5 వరకు**

# 'మా ఇంటి బంగారం' టీజర్ రిలీజ్



సమంత ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇది హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా మెప్పించనుంది. సామ్‌ను సరికొత్త పాత్రలో ఆవిష్కరించనున్న సినిమాగా ఇది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. రాజ్ నిడిమోరు క్రియేట్ చేసిన మా ఇంటి బంగారంను నందినీ రెడ్డి డైరెక్ట్ చేశారు. 'ఓ బేబీ' తర్వాత సమంత, నందినీ రెడ్డి కాంబోలో వస్తోన్న రెండో చిత్రమిది. టీజర్‌ను గమనిస్తే..కామెడీతో నవ్వించే సినిమా ఉన్నట్లుండి రియలిస్టిక్ ఫ్యామిలీ యాక్షన్ థ్రిల్లర్‌గా జరిగే మార్పును మనం స్పష్టంగా గమనించవచ్చు.రెండు భిన్న కోణాలు.. టీజర్‌లో సమంతను సాధారణమైన గృహిణి పాత్రలో చూపించారు. అయితే ఆమె తన అత్తగారింటికి వెళ్లిన తర్వాత పరిస్థితులు తలకిందులవు తాయి. నవ్వుతూ మృదు స్వభావిగా కనిపించే ఆమె ఉన్నట్లుండి ఎదురు దాడి చేసేంత శక్తివంతురాలిగా మారుతుంది. సమంత లీడ్ రోల్ చేస్తోన్న"మా ఇంటి బంగారం" చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య కీలక పాత్రల్లో నటిస్తుండగా, సీనియర్ నటి గౌతమి, మంజుషా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు.

# 'రాజా సాబ్' బ్లాక్ బస్టర్ రెస్పాన్స్

**-విశ్వప్రసాద్, మారుతి**

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ప్రెస్టీజియస్ మూవీ "రాజా సాబ్" నిన్న శుక్రవారం థియేటర్స్ లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. ఈ చిత్రాన్ని హారర్ ఫాంటసీ జానర్ లో ఎవర్ గ్రీన్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా రూపొందించారు దర్శకుడు మారుతి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై గ్లోబల్ సినిమా స్థాయిలో గ్రాండ్‌గా మూవీని నిర్మించారు ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్ టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ తమ పర్ ఫార్మెన్స్ లు, అందంతో ఆకట్టుకున్నారు. "రాజా సాబ్" సినిమా వరల్డ్ వైడ్ హ్యూజ్ కలెక్షన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతున్న నేపథ్యంలో ఈ రోజు మూవీ టీమ్ కింగ్ సైజ్ బ్లాక్ బస్టర్ పేరుతో హైదరాబాద్ లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూ సర్ టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ "రాజా సాబ్" సక్సెస్ తో హ్యాపీగా ఉన్నాం. తొలి రోజు 100 కోట్ల రూపాయలు వరల్డ్ వైడ్ కలెక్ట్ చేస్తుందని ఆశించాం. మా అంచనాలు మించి 112 కోట్ల రూపా యలు వసూళ్లు తొలి రోజు "రాజా సాబ్"కు దక్కాయి. గ్లోబల్ గా కలెక్షన్స్ డీటెయిల్స్ వస్తున్నాయి. ఈ నెంబర్ ను అఫీషియల్ గా అనౌన్స్ చేస్తాం. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ మిడ్ రేంజ్ డైరెక్టర్ అయిన నాకు ప్రభాస్ గారితో సినిమా చేశాననే క్రెడిట్ దక్కడం సంతోషంగా ఉంది.



# తెర

## 'మన శంకర వరప్రసాద్‌గారు' 'వావ్'

**అనిల్ రావిపూడి**



మన శంకర వర ప్రసాద్ గారు' సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**లాస్ట్ ఇయర్ రిలీజ్ టైం కి నెర్వస్ గా ఉంది అని చెప్పారు.. ఈ ఇయర్ ఎలా అనిపిస్తోంది?**

ఈసారి కొద్దిగా రిలాక్స్ గా ఉన్నాను. నెర్వస్ పర్సంటేజ్ కొంచెం తగ్గింది. దానికి కారణం చిరంజీవి గారు. ప్రీరిలీజ్ ఈవెంట్లో హుక్ స్టెప్ సాంగ్ రిలీజ్ చేసాము. ఆ పాటకి చిరంజీవి గారు వేసిన డాన్స్, ఆ ఈవెంట్లో ఆయన ముందు నేను వెంకటేష్ గారు చేసిన అల్లరి ఇదంతా తెలియకుండా ఒక పాజిటివ్ వైబ్ తీసుకొచ్చేసింది. దీంతో చాలా రిలాక్స్ అయ్యాను.

**మ్యూజిక్ విషయంలో ఎక్కువగా లోకల్ టెక్నీషియన్ తో పని చేస్తుంటారు.. కారణం?**

కొరియోగ్రాఫర్స్ లో భాను మాస్టర్, విజయ్,. ఆట సందీప్ అద్భుతంగా ప్రూవ్ చేసుకున్నారు. మన లోకల్ టెక్నీషియన్స్ అందరు కూడా వెలుగులోకి వస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

**మీరు సంక్రాంతికి వస్తే తిరుగు లేదనే ట్రాక్ రికార్డు వచ్చింది కదా?**

అలా ఎక్కువగా ఒక ముద్ర పడటం కూడా మంచిది కాదు. ఒత్తిడి పెరుగుతుంది. సంక్రాంతి కొచ్చి మంచి ఎంటర్టైన్మెంట్ ఇస్తున్నాడనే అనే ఫీలింగ్ ఉంటే చాలు. మంచి కంటెంట్ తో ఎవరొచ్చినా సరే ఆ సినిమాలన్నీ ఆడతాయి.

**చిరంజీవి గారికి వెంకటేష్ గారికి ఒక కథ చేయడం అంటే చాలా కసరత్తు ఉంటుంది కదా.. ఈ కథ జర్నీ గురించి చెప్పండి?**

లక్కీగా నాకు మొదటి ఐడియానే హుక్ అవుతుంది. వెంకీకి నాకు చాలా మంచి సింక్ ఉంటుంది. చిరంజీవి గారికి నేను చెప్పిన ఐడియా చాలా నచ్చింది. అలాగే క్యారెక్టరైజేషన్ కూడా చాలా నచ్చింది.

**నయనతార గారు ఈ సినిమాకి ప్రమోషన్స్ కూడా చేశారు కదా? ఎలా కుదిరింది?**

నేను వర్క్ చేసే ప్రతి ఆర్టిస్టు టెక్నీషియన్స్‌కి చాలా కంఫర్ట్ ఇస్తాను. మనం చాలా జెన్యూన్‌గా ఒకటి అడుగుతున్నప్పుడు ఒక ఎమోషనల్ కనెక్షన్ అవతలి వాళ్ళకి జనరేట్ అయినప్పుడు కచ్చితంగా చెయ్యను అనుకున్న వాళ్లు కూడా చేస్తారు.

**ఈ సినిమా కోసం చిరంజీవి గారి స్టైల్ కి మీరు వెళ్ళారా లేకపోతే ఆయన్ని మీ స్టైల్ చేశారా?**

చిరంజీవిగారు, వెంకటేష్ గారి కాంబినేషను 20 నిమిషాలు నాన్ స్టాప్ ఉంటుంది. ఇందులో వెంకటేష్ గారు కర్ణాటక నుంచి వచ్చిన వెంకీ గౌడ అనే ఒక మైనింగ్ బిజినెస్ మాన్ క్యారెక్టర్ లో కనిపిస్తారు. చాలా డిఫరెంట్ గా ఉంటుంది.

**చిరంజీవి గారికి వెంకటేష్ గారికి ఒక కథ చేయడం అంటే చాలా కసరత్తు ఉంటుంది కదా.. ఈ కథ జర్నీ గురించి చెప్పండి?**

లక్కీగా నాకు మొదటి ఐడియానే హుక్ అవుతుంది. వెంకీ గారికి నాకు చాలా మంచి సింక్ ఉంటుంది. చిరంజీవి గారికి నేను చెప్పిన ఐడియా చాలా నచ్చింది. అలాగే క్యారెక్టరైజేషన్ కూడా చాలా నచ్చింది.

**సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ కూడా ఫుల్ ఎంటర్టైనర్స్ కదా.. ఏదైనా కాంపిటీషన్ అనిపిస్తుందా?**

సంక్రాంతికి ఎంటర్టైన్స్ అద్భుతంగా వర్కౌట్ అవుతాయి. కంటెంట్ బాగుంటే అన్ని సినిమాలు ఆడుతాయి. గతంలో సంక్రాంతికి వచ్చిన సరిలేరు నీకెవ్వరు, అల వైకుంఠపురంలో దుమ్ము దులిపేసాయి. ఈ సంక్రాంతికి వస్తున్న సినిమాలన్నీ కూడా విజయవంతం కావాలని కోరుకుంటున్నాను

# 'ఓ..! సుకుమారి' ఫస్ట్ లుక్ రిలీజ్



యంగ్ హీరో తిరువీర్, ట్యాలెంటెడ్ హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తమ తమ చిత్రాలు"ప్రీ వెడ్డింగ్ షో","సంక్రాంతికి వస్తున్నాం"తో బ్లాక్‌బస్టర్ విజయాలు అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరూ కలిసి విలేజ్ ఎంటర్టైనర్ ఖఓ..! సుకుమారిఖ చేస్తున్నారు. నూతన దర్శకుడు భరత్ దర్శన్ దర్శకత్వంలో గంగా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొందిన తొలి సినిమా ఖశివం భజేఖ తర్వాత ఈ బ్యానర్ లో రూపొందుతన్న చిత్రమిది.ఐశ్వర్య రాజేష్ పుట్టినరోజు సందర్భంగా, ఆమె ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. దామినిగా ఆమె స్పిరిటెడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. రంగురంగుల హాఫ్‌సారీలో, చేతుల్లో కర్రలు పట్టుకున్న గ్రామస్థుల నుంచి తప్పించుకుంటూ పరుగులు తీస్తూ, ఆమె ధైర్యం, చలాకీతనంతో పల్లెటూరి అమ్మాయిగా అద్భుతంగా కనిపించింది.ఈ సినిమా తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# 'పురుష' ఒక్కో షాట్ ఒక్కో ఆణిముత్యం



భార్యాభర్తల కథలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది. ఇక అందులో కాస్త కామెడీ జోడించి, రియాలిటీకి దగ్గరగా చూపిస్తే ఆ సినిమా పక్కా సూపర్ హిట్. అలాంటి ఫ్యామిలీ కథతో వినూత్నంగా ఎంటర్టైన్ చేయడానికి ప్రస్తుత తరానికి తగ్గట్టుగా ట్రెండీ మేకింగ్‌తో"పురుష: అనే సినిమా రాబోతోంది. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే భార్యల ఇంపార్టెన్స్ ఏంటనేది ఈ సినిమాలో చూపించనున్నారు.బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు ఈ"పురుష: సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం అవుతుండగా.. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ తో పాటు సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్ ముఖ్య పాత్రలలో కనిపించనున్నారుఈ నేపథ్యంలోనే తాజాగా 'పురుష్' టీజర్ వదిలారు. ప్రముఖ దర్శకుడు బుచ్చిబాబు సానా చేతుల మీదుగా ఈ టీజర్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూసిన బుచ్చిబాబు సానా చాలా ఇంట్రెస్టింగ్‌గ ఉందని చెప్పారు.

# చరిత్ర సృష్టించిన 'హోంబాలే ఫిల్మ్స్'

భారతీయ సినిమా ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబాలే ఫిల్మ్స్ మరో ప్రతిష్టాత్మక మైలురాయిని అందుకుంది. 2025లో విడుదలై ఘన విజయం సాధించిన 'మహావతార్ నరసింహ', 'కాంతార: చాప్టర్ 1' సినిమాలు అధికారికంగా ఆస్కార్ జనరల్ ఎంట్రీ లిస్ట్లో చోటు దక్కించుకున్నాయి. ఇది భారతీయ సినిమాకు, హోంబాలే ఫిల్మ్స్‌కు గర్వకారణ మైన క్షణం.రిషబ్ శెట్టి దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన 'కాంతారా: చాప్టర్ 1' అలాగే అశ్విన్ కుమార్ దర్శకత్వంలో రూపొందిన"మహావతార్ నరసింహ్మ (హోంబాలే ఫిల్మ్స్ ప్రెజెంటేషన్) బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడమే కాకుండా, అద్భుతమైన కథ, సాంస్కృతిక ప్రామాణికత, సాంకేతిక నైపుణ్యం, విజువల్ గ్రాండియర్‌కు విశేష ప్రశంసలు అందుకున్నాయి.



ఆట

# సింధు ఘోర ఓటమి

## మలేసియా ఓపెన్‌లో ముగిసిన భారత్ పోరు



**న్యూఢిల్లీ:** మలేషియా ఓపెన్‌లో భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు చైనా చేతిలో ఘోర ఓటమిపాలయింది. సింధు ఓటమితో ఈ టోర్నమెంట్‌లో భారత్ పోరు ముగిసింది. కౌలాలంపూర్‌లో శనివారం జరిగిన మలేషియా ఓపెన్ టోర్నీలో వాకోవర్ ద్వారా క్వార్టర్ ఫైనల్స్ గెలిచిన సింధు సెమీఫైనల్లో ఓడిపోయింది. చైనాకు చెందిన వాంగ్ హేయి ఆమెను 21-16, 21-15 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించింది. ఈ మ్యాచ్‌లో రెండు గేమ్‌ల్లో సింధు మరియు వాంగ్ మధ్య హోరాహోరీగా పోటీ జరిగింది. మొదటి గేమ్ 14-14తో సమమైంది. రెండవ గేమ్‌లో, సింధు ఒక సమయంలో 11-6తో ఆధిక్యంలో ఉంది. అయితే, సింధు తర్వాత అనేక అనవసర తప్పిదాలు చేసింది. వాంగ్ దీనిని సద్వినియోగం చేసుకుని 21-16తో గేమ్‌ను గెలుచుకుంది. దీంతో వాంగ్ చివరికి గేమ్‌ను గెలుచుకోవడం ద్వారా ఫైనల్‌లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. ఈ కాలంలో, ఆమె వరుసగా తొమ్మిది పాయింట్లు గెలుచుకుంది. కాగా వాంగ్ ప్రస్తుతం మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్ టూ క్రీడాకారిణిగా ఉంది. ఇదే సమయంలో సింధు 18వ స్థానంలో ఉంది.

# పురుషుల హాకీ లీగ్‌లో హైదరాబాద్ ఓటమి

## 3-1తో సూర్మా క్లబ్ విజయం



**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) 2025-26లో, నిర్ణీత సమయంలో 1-1తో డ్రా అయిన తర్వాత, సూర్మా హాకీ క్లబ్ హైదరాబాద్ టూఫాన్స్‌పై 3-1తో ఉత్కంఠభరితమైన విజయాన్ని నమోదు చేసింది. సూర్మా హాకీ క్లబ్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (20) గోల్ చేయగా, హైదరాబాద్ టూఫాన్స్ తరఫున అమన్‌దీప్ లక్రా (46) గోల్ స్కోరర్‌గా నిలిచాడు. మొదటి క్వార్టర్ ప్రారంభంలో సూర్మా క్లబ్ తొలి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ప్రయత్నాన్ని మొదటి రషర్ ఆపాడు.

తర్వాత హైదరాబాద్ టూఫాన్స్‌పై ఒత్తిడి పెంచుతూ సూర్మా గోల్ కోసం ప్రయత్నాలు చేశాడు. కానీ గోల్ కీపర్ బిక్రమ్జిత్ సింగ్ అద్భుతమైన సేవ్‌లు చేసి వారికి గోల్ దక్కకుండా చేశాడు. టూఫాన్స్(8) వరుసగా మూడు పెనాల్టీ కార్నర్లను గెలుచుకున్నా, సూర్మా బ్యాక్ లైన్ గోల్ కాకుండా అడ్డుకుంది. రెండవ క్వార్టర్‌లో హర్మన్‌ప్రీత్ (20) సూర్మా తరఫున పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. రెండవ క్వార్టర్‌లో (34) హైదరాబాద్ గోల్ సాధించడానికి చాలా దగ్గరగా వచ్చింది. మరో ఎండ్‌లో సూర్మాకు పెనాల్టీ కార్నర్ లభించింది. ఈసారి సూర్మా తరఫున జెరెమీ హేవార్డ్ షాట్ తీసుకున్నా, బిక్రమ్‌జిత్ సింగ్ హైదరాబాద్ టూఫాన్స్ తరఫున మరో అద్భుతమైన సేవ్ చేసి లోటును తగ్గించాడు. చివరి క్వార్టర్‌లో టూఫాన్స్‌కు కీలకమైన పెనాల్టీ కార్నర్ లభించింది.

అమన్‌దీప్ లక్రా (46) డ్రాగ్‌ఫ్లిక్‌తో హైదరాబాద్ కు ఈక్వలైజర్‌ను అందించాడు. దేవీందర్ వాల్మీకి (54) పాస్‌ను ఆడటంతో హైదరాబాద్ మరో ఎత్తుగడ వేసినా ఫలితానివ్వలేదు. సూర్మా గోల్ కీపర్ విన్సెంట్ వనాష్ బలమైన సేవ్ చేసి మ్యాచ్ షూటౌట్‌కు వెళ్లడంతో స్కోరును సమం చేశాడు. హర్మన్‌ప్రీత్, నికోలస్ కీనన్ గోల్స్ చేయడంతో సూర్మా హాకీ క్లబ్ షూటౌట్‌ను 3-1తో గెలుచుకుంది.

# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్
# ఫైనల్ రేస్ నుండి ఇంగ్లండ్ ఔట్

### భారత్‌కు కలిసొచ్చిన వారి ఓటమి
### టీమిండియాకు ఇంకా ఛాన్స్



**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ ముగియడంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఈక్వేషన్స్ ఆసక్తికరంగా మారాయి. ఇంగ్లాండ్‌ను వారి గడ్డపైనే 4-1తో చిత్తు చేసిన ఆస్ట్రేలియా, 2027 ఫైనల్ రేసులో దూసుకుపోతోంది. అయితే ప్రస్తుతం ఆరో స్థానంలో ఉన్న టీమ్ ఇండియా కథ ఇంకా ముగిసిపోలేదు. ఇంగ్లాండ్ ఓటమి భారత్‌కు ఒక రకంగా కలిసొచ్చిందనే చెప్పాలి. ప్రస్తుతం ఐసీసీ విడుదల చేసిన తాజా పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా తిరుగులేని ఆధిక్యంలో ఉంది. ఆడిన 8 టెస్టుల్లో 7 గెలిచి 87.50 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. న్యూజిలాండ్ (77.78), సౌతాఫ్రికా (75) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్ ప్రస్తుతం 48.15 శాతంతో ఆరో స్థానంలో ఉండగా, ఇంగ్లాండ్ 31.67 శాతంతో ఏడో స్థానానికి పడిపోయింది. పట్టికలో కింద ఉన్నట్లు కనిపిస్తున్నా, భారత్ ఆడాల్సిన మ్యాచ్‌లు ఎక్కువగా ఉండటం మనకు కలిసొచ్చే అంశం. ఇక 2027లో జరిగే ఫైనల్‌కు టాప్2 జట్లు మాత్రమే అర్హత సాధిస్తాయి. భారత్ చేతిలో ఇంకా 9 టెస్టులు ఉన్నాయి. 2026లో శ్రీలంకలో 2 టెస్టులు, న్యూజిలాండ్‌లో 2 టెస్టులు ఆడి, ఆ తర్వాత సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో 5 టెస్టుల భారీ సిరీస్ ఆడాల్సి ఉంది. భారత్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకోవాలంటే ఈ 9 మ్యాచ్‌ల్లో కనీసం 7 లేదా 8 వాటిల్లో విజయాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ మొత్తం 9 మ్యాచ్‌లు గెలిస్తే, భారత్ పీసీటీ 74.07 శాతానికి చేరుతుంది. అప్పుడు ఎవరితోనూ సంబంధం లేకుండా నేరుగా ఫైనల్ చేరుకోవచ్చు. కాగా విదేశీ గడ్డపై జరిగే మ్యాచ్‌లే భారత్‌కు అత్యంత కీలకం. శ్రీలంక, న్యూజిలాండ్ పర్యటనల్లో డ్రా కోసం ప్రయత్నించకుండా విజయాలే లక్ష్యంగా బరిలోకి దిగాలి. అక్కడ కనీసం 3 మ్యాచ్‌లు గెలిచి, ఆ తర్వాత భారత్‌లో జరిగే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో ఆస్ట్రేలియాను 4-1 లేదా 5-0తో ఓడిస్తే భారత్ పాయింట్ల శాతం 65కు పైగా చేరుతుంది. ఈ ఈక్వేషన్ ఉంటే టాప్ 2లో చోటు దక్కించుకోవడం సులభమవుతుంది. ఇందుకు భారత్ తన సొంత ప్రదర్శనతో పాటు, ఇతర జట్ల ఓటములపై కూడా ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా పట్టికలో పైన ఉన్న న్యూజిలాండ్, సౌతాఫ్రికా జట్లు ఆడాల్సిన మ్యాచ్‌లు తక్కువగా ఉన్నాయి. ఒకవేళ అవి ఒకటి లేదా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయినా వాటి శాతం పడిపోతుంది. అలాగే భారత్ తన సొంత గడ్డపై ఆస్ట్రేలియాను భారీ తేడాతో ఓడిస్తే, ఆసీస్ పాయింట్ల శాతం కూడా తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ మెరుగైన స్థానానికి చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుంది.



# మహిళల ప్రీమియర్ లీగ్‌లో
# గుజరాత్ జెయింట్స్ గ్రాండ్ విక్టరీ

## 10 రన్స్ తేడాతో యుపి వారియర్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) నాలుగో సీజన్ అంచనాలకు తగ్గట్టే ఉత్కంఠగా, ఆసక్తిగా సాగుతోంది. తొలిపోరులో చివరి బంతికి రాయల్ ఛాలెంజర్స్ గెలుపొందగా, రెండో మ్యాచ్‌లో యూపీ వారియర్స్ చివరి ఓవర్ వరకూ పోరాడింది. శనివారం హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 10 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌కు షాకిచ్చింది. ఫొబే లిచ్‌ఫీల్డ్ (78) అర్ధ శతకంతో పోరాడినా డెత్ ఓవర్లలో గుజరాత్ బౌలర్లు అద్భుతంగా కట్టడి చేశారు. చివర్లో ఆశా శోభన (27 నాటౌట్) వరుసగా 6, 4 తో భయపెట్టినా యూపీ జట్టుకు ఓటమి తప్పలేదు. కానీ 208 పరుగుల ఛేదనలో ఆ జట్టును గుజరాత్ జెయింట్స్ బౌలర్లు 197కే కట్టడి చేశారు. గుజరాత్ బౌలర్లలో రేణుకా సింగ్ (225), జార్జియా వరేహం (230), సోఫీ డెవినె (2 55)లు రెండేసి వికెట్లతో రాణించారు. భారీ ఛేదనలో యూపీ వారియర్స్‌కు ఆదిలోనే రేణుక షాకిచ్చింది. డేంజరస్ ఓపెనర్ కిరణ్ నవగిరే (1)ను ఔట్ చేసి గుజరాత్‌కు బిగ్ బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఫొబే లిచ్‌ఫీల్డ్ (78), మేగ్ లానింగ్ (30)లు ధనాధన్ ఆడుతూ స్కోర్ బోర్డును నడిపించారు. అయితే వరేహం ఒకే ఓవర్లో లానింగ్, హర్లీన్ డియోల్ (0)ను వెనక్కి పంపి యూపీని కష్టాల్లోకి నెట్టగా, ఆ తర్వాత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ(1)ను రిటర్న్ క్యాచ్‌తో రేణుక వెనక్కి పంపింది. దీంతో 74కే 4 వికెట్లు పడినవేళ క్రీజులోకి వచ్చిన శ్వేతా షెహ్రావత్(25) తొలి బంతినే సిక్సర్‌గా మలవగా స్కోర్ 80 దాటింది. ఆ తర్వాత గార్డ్‌నర్ ఓవర్లో లిచ్‌ఫీల్డ్ రెండు ఫోర్లు, సింగిల్‌తో అర్ధ శతకం పూర్తి చేసుకుంది. ఇక షెహ్రావత్ 4, 6 బాదేయగా స్కోర్ వంద దాటింది. దూకుడుగా ఆడుతున్న ఈ జోడీని రాజేశ్వరి గైక్వాడ్ విడదీ యూపీని దెబ్బకొట్టింది. ఆ తర్వాత డియాండ్ర డాటిన్(12) బ్యాట్ ఝుళిపించినా, వికెట్ ఇచ్చేసింది. చివరి ఓవర్లో ఎకిల్‌స్టోన్ వికెట్ పడగా 10 పరుగుల తేడాతో గుజరాత్ బోణీ చేసింది. కాగా కెప్టెన్‌గా తొలి మ్యాచ్‌లోనే అషే గార్డ్‌నర్(65) అర్ధ శతకంతో మెరవగా, అనుష్క శర్మ(44) యూపీ బౌలర్లను ఉతికేసింది. వీరిద్దరూ ఔటయ్యాక టెయిలెండర్లు జార్జియా వరేహం(27 నాటౌట్), భారతి ఫుల్‌మలి(14 నాటౌట్)లు సైతం సిక్సర్లతో చెలరేగారు. దాంతో నిర్ణీత ఓవర్లలో గుజరాత్ 4 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది.



# వరల్డ్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్స్‌లో మానవ్ నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** పురుషుల సింగిల్స్ రౌండ్ ఆఫ్ 16లో ప్రపంచ 5వ ర్యాంకర్ ట్రుల్స్ మోర్‌గార్డ్ చేతిలో ఘోరంగా ఓడిపోవడంతో భారత్ ప్లేయర్ మానవ్ ఠక్కర్ 2026 ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్స్ నుంచి నిష్క్రమించాడు. థక్కర్ తొలి గేమ్‌ను కంటి రెప్పపాటులోనే 4-11 తేడాతోచేజార్చుకుని పోటీకి అత్యుత్తమ ఆరంభాలు ఇవ్వలేకపోయాడు. రెండవ గేమ్‌లో మానవ్ తన తప్పులను సరిదిద్దుకున్నాడు. స్వీడిష్ ప్యాడ్లర్ మోర్‌గార్డ్‌పై నిరంతరం దాడి యత్నంలో మానవ్ 11-9తో గెలిచి స్కోరును సమం చేశాడు. మూడో గేమ్‌లో మరోసారి ఇద్దరు ఆటగాళ్లు ఒకరికొకరు షాట్‌కు పోటీ పడ్డారు. థక్కర్ తన ప్రత్యర్థి 7-10తో వెనుకబడినప్పుడు పాయింట్ సంపాదించడానికి వేసిన నోలుక్ షాట్ ప్రత్యేకంగా నిలిచింది. అయినప్పటికీ, మోర్‌గార్డ్ మూడో గేమ్‌ను 11-8తో చేజిక్కించుకున్నాడు. నాలుగో గేమ్‌లో ప్రపంచ ర్యాంక్‌లో 34వ స్థానంలో ఉన్న థక్కర్ 8-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అయితే సూరత్‌కు చెందిన 25 ఏళ్ల ఈ యువకుడు షాట్‌లలోకి దూసుకెళ్లి వరుస పొరపాట్లు చేసి మోర్‌గార్డ్‌కు అవకాశాన్ని కల్పించాడు. నాల్గవ గేమ్‌లో థక్కర్ ఒక మ్యాచ్ పాయింట్‌ను కూడా కాపాడుకున్నా, మోరెగార్డ్ దాన్ని 14-12 తేడాతో గెలుచుకుని విజయం సాధించాడు.

# ఎటిఎం ఛార్జీలు పెంచిన ఎస్బీఐ




**ముంబయి, జనవరి 10:** దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు షాకిచ్చింది. ఏటీఎం లావాదేవీలపై ఛార్జీలను పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇంటర్‌ఛేంజ్ రుసుములు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్యాంకు తెలిపింది. పెంచిన ఈ కొత్త ఛార్జీలు 2025 డిసెంబర్ 1 నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేసింది. ఈ మార్పుల ప్రభావం ప్రధానంగా సేవింగ్స్, శాలరీ ఖాతాదారులపై పడనుంది. ఎస్‌బీఐ ఖాతాదారులు ఉచిత పరిమితి దాటిన తర్వాత ఇతర బ్యాంకుల ఏటీఎంలలో చేసే నగదు విత్‌డ్రాయల్‌పై ఇకపై రూ. 23తో పాటు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఛార్జీ రూ. 21 ప్లస్ జీఎస్టీ అదనంగా ఉండేది. బ్యాలెన్స్ చెకింగ్, మినీ స్టేట్‌మెంట్ వంటి నాన్‌ఫైనాన్షియల్ లావాదేవీలపై ఛార్జీని రూ. 10 నుంచి రూ. 11ప్లస్ జీఎస్టీ అదనం పెంచారు. సేవింగ్స్ ఖాతాదారులకు ఇతర బ్యాంకుల ఏటీఎంలలో నెలకు 5 ఉచిత లావాదేవీల పరిమితిలో మాత్రం ఎలాంటిమార్పులేదు. ముఖ్యంగా శాలరీ ప్యాకేజీ ఖాతాదారుల విషయంలో ఎస్‌బీఐ కీలక మార్పులు చేసింది. గతంలో వీరికి ఏ ఏటీఎంలోనైనా అపరిమిత ఉచిత లావాదేవీల సౌకర్యం ఉండగా, ఇప్పుడు దానిని నెలకు 10కి పరిమితం చేసింది. ఈ 10 లావాదేవీలు దాటిన తర్వాత చేసే ప్రతి ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 23, నాన్‌ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కు రూ. 11 జీఎస్టీ అదనం చెల్లించాలి. అయితే, కొన్ని ఖాతాలపై ఈ పెంపు ప్రభావం ఉండదని బ్యాంకు స్పష్టం చేసింది. ఎస్‌బీఐ బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ (బిఎస్‌బిడి) ఖాతాల సర్వీస్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు లేవు. అలాగే, ఎస్‌బీఐ డెబిట్ కార్డుతో ఎస్‌బీఐ ఏటీఎంలలో చేసే లావాదేవీలపై ఛార్జీలు యథాతథంగా ఉంటాయి. కార్డు లేకుండా చేసే క్యాష్ విత్‌డ్రాయల్స్ పైనా కొత్త ఛార్జీలు వర్తించవు.

# వాణిజ్యం

# గ్లోబల్ మార్కెట్లకు భారత్ బియ్యం ఎగుమతులు

**న్యూఢిల్లీ, జనవరి 10:** భారత్‌నుంచి బియ్యం ఎగుమతులు గణనీయంగాపెరిగాయి. గత ఏడాది 19.4శాతంపెరిగి 21.55 మిలియన్ టన్నులమేర ఎగుమతులు జరిగాయి. ప్రభుత్వం అన్ని ఎగుమతుల ఆంక్షలు తొలగించడంతో సరఫరా గణనీయంగా పెరిగింది. రికార్డుస్థాయిలో వరి దిగుబడులు పెరగడంతో బియ్యం ఎగుమతులు పెరిగేందుకు దోహదంచేసింది. 2022-23నుంచి బియ్యం ఎగుమతులపై ఆంక్షలు ఉన్నాయి. ప్రస్తుతం కేంద్రం వీటిని పూర్తిగా




తొలగించింది. ట్రేడర్లు అందరూ కూడా విదేశాలకు ఎగుమతులుచేసుకునేందుకు సడలింపులు ఇచ్చింది. దీనితో కీలక వెరైటీ రకాలన్నీ ఇపుడు విదేశీ మార్కెట్లను ముంచెత్తనున్నాయి. దేశీయంగా బియ్యం అందుబాటులో ఉంచేందుకు వీలుగా మూడేళ్లక్రితం బియ్యం ఎగుమతులపై ఆంక్షలు ప్రకటించింది. తదనంతరం రుతుపవనాలు మెరుగుపడి ఉత్పత్తిపెరిగి దిగుబడులు గణనీయంగా పెరగడంతో ఆంక్షలను తొలగించి గ్లోబల్ మార్కెట్లకు భారత్ బియ్యాన్ని ఎగుమతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆఫ్రికా, మధ్యప్రాచ్య ఆసియా దేశాలకు ఎగుమతులు భారీగాపెరిగినట్లు కేంద్రం చెపుతోంది. ఆంక్షలకారణంగా గ్లోబల్‌మార్కెట్లలో ధరలు కూడా పెరిగాయి. సరఫరాపై కూడా ఆంక్షలు పెరిగాయి. ఇపుడు అన్నీ సడలించడంతో భారత్ బియ్యం వెరైటీలన్నీ అంతర్జాతీయ మార్కెట్లలో కనిపిస్తున్నాయి. అమెరికా తన సుంకాలతో భారత్‌ను బెదిరిస్తున్నా వరి దిగుబడులతో ఇపుడు బియ్యం ఎగుమతులు భారీ స్థాయిలోజరుగుతున్నాయన్నది డేటా రుజువుచేస్తోంది.



## ఎగుమతిదారులకోసం రూ.3361.83 కోట్ల
# క్రెడిట్ గ్యారంటీ క్లియరెన్సులు!

**న్యూఢిల్లీ, జనవరి 10:** ఎగుమతిదారులకోసం దేశంలోని బ్యాంకులు మొత్తం 20 వేలకోట్ల క్రెడిట్ గ్యారంటీస్కీమ్‌ను క్లియర్‌చేసారు. ఒక్కనెలలోనే మొత్తం 3361.83 కోట్ల రూపాయలమేర క్రెడిట్‌హామీలు క్లియర్‌చేసారు. కేంద్రం ఈస్కీం కింద 20 వేల కోట్లు గ్రాంట్ ఇచ్చినసంగతి తెలిసిందే. సిజిఎస్ఇ స్కీం కిందా ఎగుమతిదారులకు ఎలాంటి ఆర్థిక అడ్డంకులు లేకుండా ఈపథకం అమలుచేస్తోంది. అర్హత కలిగిన ఎగుమతి దారులకు ఎంఎస్ఎంఇ రంగాలతోసహా ఈ స్కీంను వర్తింపచేయాలని గత ఏడాది నవంబరు కేబినెట్ బేటీలో కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం 20 వేల కోట్లు కేటాయించింది. గత ఏడాది డిసెంబరు ఒకటవ తేదీనుంచి ఈ స్కీం అమలులోకి వచ్చింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ స్కీం ద్వారా భారతీయ ఎగుమతిదారులకు కొంత స్పష్టమైన గడువుకు లోబడి అదనపు ఆర్థిక సాయం అందించేవీలుంటుంది. రూ.8764.81 కోట్ల విలువైన 1840 దరఖాస్తులు రాగా వాటిలో 774 దరఖాస్తులు 3361.83 కోట్ల విలువైన వాటిని పరిష్కరించినట్లు ఆర్థికశాఖపరిధిలోని ఆర్థికసేవల విభాగం ప్రకటించింది. సిజిఎస్ఇ ఈ ఏడాది మార్చి 31వరకూ అమలులో ఉంటుంది. మొత్తం 20 వేలకోట్ల గ్యారంటీల జారీ పూర్తయ్యేంతవరకూ ఈస్కీం అమలులో ఉంటుందని డిఎఫ్ఎస్ విభాగం ప్రకటించింది.

# ఫోన్‌పేలో కొత్తఫీచర్ 'పీజీబోల్డ్'!

**ముంబయి, జనవరి 10:** డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే తమ యూజర్ల కోసం కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. వీసా, మాస్టర్‌కార్డ్ క్రెడిట్, డెబిట్ కార్డ్ లావాదేవీల కోసం ఫోన్‌పే పీజీ బోల్ట్ పేరుతో కొత్త ఫీచర్‌ను శనివారం ప్రారంభించింది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ఒకే క్లిక్‌తో అత్యంత వేగంగా, సురక్షితంగా చెల్లింపులు పూర్తి చేయవచ్చు. ఈ కొత్త విధానం డివైస్ టోకెనైజేషన్ టెక్నాలజీపై పనిచేస్తుంది. యూజర్లు తమ వీసా లేదా మాస్టర్‌కార్డ్ వివరాలను ఫోన్‌పే యాప్‌లో ఒక్కసారి సేవ్ (టోకెనైజ్) చేస్తే సరిపోతుంది. ఆ తర్వాత ఫోన్‌పే పేమెంట్ గేట్‌వే ఉన్న ఏ మర్చంట్ యాప్‌లోనైనా మళ్లీ మళ్లీ కార్డ్ వివరాలు ఎంటర్ చేయాల్సిన పనిలేదు. అదే డివైస్ లో చేసే తదుపరి లావాదేవీలకు సీవీవీ నంబర్ కూడా అడగదు. దీంతో చెల్లింపుల ప్రక్రియ చాలా సులభతరం అవుతుంది. సాధారణంగా ఆన్‌లైన్ చెల్లింపుల సమయంలో యూజర్‌ను వేరే పేజీకి రీడైరెక్ట్ చేస్తుంటారు. బోల్ట్ ఫీచర్‌తో ఆ అవసరం ఉండదు. మొత్తం లావాదేవీ మర్చంట్ యాప్‌లోనే పూర్తవుతుంది. ఇది యూజర్‌కు సౌకర్యంగా ఉండటమే కాకుండా, లావాదేవీలు మధ్యలో ఆగిపోయే (డ్రాప్‌అవుట్స్) సమస్యను తగ్గిస్తుందని కంపెనీ చెబుతోంది. దీనివల్ల వ్యాపారులకు లావాదేవీల సక్సెస్ రేటు కూడా పెరుగుతుంది. ఈ సందర్భంగా ఫోన్‌పే మర్చంట్ బిజినెస్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ యువరాజ్ సింగ్ షెకావత్ మాట్లాడుతూ భారతీయులకు డిజిటల్ చెల్లింపులను సులభతరం చేసే మా ప్రయాణంలో బోల్ట్ ఫీచర్ ఒక ముఖ్యమైన ముందడుగు. టోకెనైజేషన్ ద్వారా యూజర్లకు వన్‌క్లిక్ అనుభవాన్ని అందిస్తున్నాం. ఇది యూజర్ల సౌకర్యాన్ని పెంచడంతో పాటు, మా మర్చంట్ భాగస్వాముల వ్యాపారాభివృద్ధికి కూడా దోహదపడుతుందని వివరించారు.







# డీమార్ట్ నికరలాభం రూ.855.78 కోట్లు

**ముంబయి, జనవరి 10:** అవెన్యూ సూపర్‌మార్ట్స్ అధీనంలోని డీమార్ట్ మూడో త్రైమాసికంలో 18.28శాతం నికరలాభాలను పెంచుకోగలిగింది. డిమార్ట్ పేరుతో సూపర్‌మార్కెట్ చైన్‌న ఇర్వహిస్తున్న కంపెనీ నికరలాభం రూ.723.54 కోట్లు గత ఏడాది ఆర్జిస్తే ఈఏడాది ఇదే కాలంలో 855.78 కోట్లకు పెరిగింది. లావాదేవీలద్వారా మూడోత్రైమాసికంలో రాబడులు 18,100.88 కోట్లకు చేరింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 15,972.55కోట్లు ఆర్జించినట్లు కంపెనీ ప్రకటించింది. మూడోత్రైమాసికంలో కంపెనీ ఖర్చులు కూడా పెరిగాయి. 15,001.64 కోట్లనుంచి 16,942.62కోట్లకు పెరిగినట్లు కంపెనీ ఎక్స్ఛేంజిలకు నివేదికిచ్చింది. ప్రస్తుత సిఇఒ డిజిగ్నేట్‌గా ఉన్న అన్షుల్ అసావాను మరో మూడేళ్ల కాలానికిగాను సిఇఒ ఎండిగా నియమించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీనుంచి ఈ ఉత్తర్వులు అమలులోకి వసానతయి. ఆయన ఎండిసిఇఒగా ఉన్న ఇగ్నేషస్ నవిల్ నోరోన్హా పదవీకాలం ఈనెల 31తో ముగుస్తుంది. ఆయన స్థానంలో అన్షుల్ బాధ్యతలు స్వీకరిస్తారు.

# 10 లక్షలు దాటిన ట్రాక్టర్ల సేల్స్!



**న్యూఢిల్లీ, జనవరి 10:** దేశీయ మార్కెట్లలో ట్రాక్టర్ల విక్రయాలు పదిలక్షలు దాటి కొత్త రికార్డు నమోదుచేసాయి. ట్రాక్టర్ అండ్ మెకనైజేషన్ అసోసియేషన్ టిఎంఎ డేటా ప్రకారం గత ఏడాది దేశవ్యాప్తంగా 10.9 లక్షల ట్రాక్టర్లను విక్రయించినట్లు తేల్చింది. గత ఏడాదితోపోలిస్తే 20శాతం వృద్ధి నమోదయిందని అంచనా. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలోకూడా భారతీయ ట్రాక్టర్లకు డిమాండ్ పెరుగుతుండటంతో ఎగుమతులు కూడా లక్ష మార్కు దాటినట్లు టిఎంఎ వెల్లడించింది. ప్రభుత్వ నిర్ణయాలు, ప్రకృతి అనుకూలించడం వంటి వాటితో వ్యవసాయ సాగు విస్తీర్ణం పెరిగింది. సాగుపనులు ముమ్మరం కావడంతో సన్నచిన్నకారు రైతులకు బ్యాంకులు రుణాలు అందిస్తుండటం, ప్రభుత్వం కూడా భారీ సబ్సిడీలు అందిస్తుండటంతో అమ్మకాలు పెరిగాయి. ట్రాక్టర్లపై ఉన్న జిఎస్టీని 12నుంచి ఐదుశాతానికి తగ్గించింది. హార్స్‌పవర్ ఆధారంగా ట్రాక్టర్ల ధరలు 40 వేలనుంచి లక్షరూపాయలవరకూ తగ్గడంతో రైతులు కొనుగోళ్లకు ఆసక్తి చూపించారు. కంపెనీలపరంగాచూస్తే మహీంద్ర 24శాతం మార్కెట్ వాటాతో 2.37 లక్షల యూనిట్లు విక్రయించి టాప్‌లో ఉంది. స్వరాజ్, సోనాలికా సంస్థలు రెండు,మూడు స్థానాల్లో నిలిచాయి. 2024లో దేశీయంగా 9.1 లక్షలు మాత్రమే ఉన్న అమ్మకాలు ఏడాదిలోనే 10.9 లక్షలకు చేరడం గమనిస్తే వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రాధాన్యత పెరుగుతున్నదని తెలుస్తోంది. గ్రామీణప్రాంత సన్నచిన్నకారు రైతు కుటుంబాలకు ఆర్థికభరోసా మరింత పెరుగుతుందన్న అంచనాలుకూడా పెరిగాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.